


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు

నబీన్ సారథ్యంలో..
బీజేపీ మరింత బలోపేతం
కొత్త వర్కింగ్ ప్రెసిడెంట్‌కు అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు

3

## పూర్వోదయతో..

# గ్రోత్ ఇంజన్‌గా ఏపీ

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌జీని శుక్రవారం న్యూఢిల్లీలో కలవడం ఆనందంగా ఉంది. పూర్వోదయవంటి కేంద్ర కార్యక్రమాల మద్దతుతో ఆంధ్రప్రదేశ్.. తూర్పు భారతదేశానికి ప్రధాన చోదకశక్తిగా ఎదగగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. సాస్కీ ద్వారా నిధుల మద్దతు, రాయలసీమను ఉద్యానవన కేంద్రంగా అభివృద్ధి చేయాలనే మా ప్రణాళికలకు మద్దతు కోరాను. ఏపీ దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికి కేంద్ర బడ్జెట్ సహాయం కూడా అభ్యర్థించాను.

*- సీఎం చంద్రబాబు నాయుడు*



- ప్రాజెక్టులకు పాలనాపరమైన నిబంధనల్ని సరళీకృతం చేయండి
- సీమ హార్టీకల్చర్ హబ్‌కు బడ్జెట్‌లో నిధులు పెట్టండి
- అమరావతి తరహాలోనే పోలవరం -నల్లమల సాగర్‌కు నిధులు
- ప్రాజెక్టులపై కేంద్ర సహకారానికి ధన్యవాదాలు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీలో సీఎం చంద్రబాబు

3



## ఏపీ ప్రాజెక్టులకు సహకరించండి

- విభజన హామీల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టులకు నిధులివ్వండి
- జల జీవన్ మిషన్‌లో కేంద్ర వాటా విడుదల చేయండి
- పీఎంకెఎస్‌వై -ఆర్ఆర్ఆర్‌కూ కేంద్ర వాటా ఇవ్వాలి
- ఏపీకి నీటి భద్రత అత్యంత కీలకాంశం
- సాగు, తాగునీటి అవసరాలపై సానుకూలంగా స్పందించండి
- కేంద్ర జలవనరుల మంత్రితో భేటీలో సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

2

న్యూఢిల్లీలో శుక్రవారం కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌జీని కలవడం ఆనందంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ నీటి అవసరాలు, కొనసాగుతున్న.. ప్రతిపాదిత అభివృద్ధి పనులకు సంబంధించిన వివిధ అంశాలపై మేము ఉత్పాదక చర్చలు సాగించామని చెప్పడానికి మరింత ఆనందిస్తున్నాను.

*- సీఎం చంద్రబాబు నాయుడు*

## పెట్టుబడులను మళ్లించండి!

- ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల పెట్టుబడులకు ఏపీ అనుకూలం
- ఎల్ఎన్‌జి టెర్మినళ్ల అభివృద్ధి, విస్తరణకు సహకరించండి
- గ్యాస్ పైప్‌లైన్, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ విస్తరించాలి
- కేంద్ర పెట్రోలియం మంత్రికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి



2

నెల్లూరులో బీపీసీఎల్ గీన్‌ఫీల్డ్ రిఫైనరీ ప్రాజెక్ట్ పురోగతిపై చర్చించేందుకు శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరిని కలవడం ఆనందంగా ఉంది. రిఫైనరీ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావాలని మంత్రి హర్దీప్ సింగ్ పూరీజీని సహృదయంతో ఆహ్వానించాను.

*- సీఎం చంద్రబాబు నాయుడు*

## నేడు అనకాపల్లి జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'
సహా పలు కార్యక్రమాలకు హాజరు

3

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీకి..

## అభివృద్ధి సొబగులు

- పలు నూతన భవనాలను ప్రారంభించిన మంత్రి లోకేష్

5

## దుగరాజపట్నంపై దృష్టిపెట్టండి

- జాతీయ మెగా షిప్‌బిల్డింగ్, రిపేర్ క్లస్టర్ అభివృద్ధికి సహకరించాలి
- "చిప్ టు షిప్" విజన్‌తో షిప్‌బిల్డింగ్ రంగాన్ని బలోపేతం చేయాలి
- షిప్పింగ్, జలరవాణా మంత్రికి సీఎం చంద్రబాబు వినతి
- కేంద్ర హోం, పట్టణాభివృద్ధి మంత్రులతో చంద్రబాబు భేటీ



4

రాష్ట్రంలోని కీలకమైన నౌకానిర్మాణ ప్రాజెక్టులు మరియు ప్రధాన ఫిషింగ్ హార్బర్‌ల అభివృద్ధిపై కేంద్ర-రాష్ట్ర పరస్పర సహకారంపై శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ జీతో ఫలవంతమైన సమావేశం నిర్వహించాను.

*- సీఎం చంద్రబాబు నాయుడు*

సమాజంలో మార్పు కోసం..

## యువత రాజకీయాల్లోకి రావాలి

- విద్యార్థులు జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనకు కృషిచేయాలి
- ఉద్యోగాల సాధనకు విద్యతో పరిశ్రమల అనుసంధానం
- కేజీ నుంచి పీజీ వరకు స్త్రీలను గౌరవించేలా ప్రత్యేక కార్యాచరణ
- నైపుణ్యం పోర్టల్ ద్వారా ఉద్యోగావకాశాలు
- జనవరి నెలలో జాబ్ కేలండర్ విడుదల
- మా నాన్నకి దక్కే గౌరవం నాకూ దక్కాలని అహర్నిశలు కష్టపడుతున్నా
- 'హలో లోకేష్' పేరుతో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి లోకేష్
- విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన మంత్రి




8

## యువత భవిష్యత్తుపై ఇంత ద్వేషమా

- రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవటమే ఏకైక లక్ష్యం

**పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనపై కుట్రలు - జగన్‌పై మంత్రి లోకేష్ మండిపాటు**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర యువత భవిష్యత్తుపై జగన్ రెడ్డి ద్వేషంతో ఉన్నారని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న రహేజా ఐటీ పార్క్ భూకేటాయింపుల విషయంలో హైకోర్టులో పిల్ దాఖలు కావడంపై ఎక్స్ వేదికగా మంత్రి లోకేష్ స్పందించారు. వైసీపీ నేతలు రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా ప్రాజెక్టులకు అడ్డం పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీ పెట్టుబడులు రాకుండా, యువతకు ఉద్యోగాల కల్పనకు వ్యతిరేకంగా కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునేందుకు కోర్టులను ఆశ్రయిస్తున్నారా అని ప్రశ్నించారు. ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్, సత్వా వంటి సంస్థలపై కోర్టులో వైసీపీ పిటిషన్లు దాఖలు చేసిన విషయాన్ని లోకేష్ గుర్తు చేశారు. ఇప్పుడు రహేజా ఐటీ పార్క్ పై పిల్ దాఖలు చేయడాన్ని తప్పుబట్టారు. ఆ ప్రాజెక్టులతో ఏపీ యువతకు లక్షకు పైగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వైసీపీ నేతలు ఆ అవకాశాలను రాకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన ప్రతి పనిలో జగన్ అడ్డుపడుతున్నారని విమర్శించారు. యువత భవిష్యత్తుపై వైఎస్ జగన్‌కు ఎందుకింత ద్వేషమని మంత్రి లోకేష్ నిలదీశారు.

## ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకున్నాం




9

- ఏపీకి బ్రాండ్ సీఎం చంద్రబాబు
- కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి
- మంగళగిరితో పోటీపడతామనే ఎమ్మెల్యే వాసు సవాల్‌ను స్వీకరిస్తున్నా
- కష్టంలో తోడుగా ఉన్న ఆదిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం
- రాజమండ్రి సిటీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి లోకేష్

# ఏపీ ప్రాజెక్టులకు సహకరించండి

- విభజన హామీల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టులకు నిధులివ్వండి
- జల జీవన్ మిషన్‌లో కేంద్ర వాటా విడుదల చేయండి
- పీఎంకెఎస్‌వై - ఆర్ఆర్ఆర్‌కూ కేంద్ర వాటా ఇవ్వాలి
- ఏపీకి నీటి భద్రత అత్యంత కీలకాంశం
- సాగు, తాగునీటి అవసరాలపై సానుకూలంగా స్పందించండి
- కేంద్ర జలవనరుల మంత్రితో భేటీలో సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

*న్యూఢిల్లీలో శుక్రవారం కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌జీని కలవడం ఆనందంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ నీటి అవసరాలు, కొనసాగుతున్న.. ప్రతిపాదిత అభివృద్ధి పనులకు సంబంధించిన వివిధ అంశాలపై మేము ఉత్పాదక చర్చలు సాగించామని చెప్పడానికి మరింత ఆనందిస్తున్నాను.*
*-సీఎం చంద్రబాబు నాయుడు*



ఢిల్లీ (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌కు నీటి భద్రత అత్యంత కీలకాంశమని.. పోలవరం సహా రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు, వివిధ పథకాలకు నిధుల విడుదలపై కేంద్రం సానుకూలంగా స్పందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఒకరోజు ఢిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం సీఎం చంద్రబాబు.. కేంద్ర జలవనరుల మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. పోలవరం సహా రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు, వివిధ పథకాలకు నిధుల విడుదలపై పాటిల్‌తో చర్చించారు. ప్రత్యేకించి విభజన హామీల్లో భాగంగా ఆమోదం పొందిన ప్రాజెక్టులకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని, పెండింగ్ అంశాలపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని కోరారు. రాష్ట్రానికి నీటి భద్రత అత్యంత కీలక అంశమని పేర్కొంటూ.. రాష్ట్రంలో సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టులపై కేంద్ర-రాష్ట్ర సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జల్ జీవన్ మిషన్ అమలుకు రాష్ట్రానికి అదనంగా రూ.1,000 కోట్లు కేటాయించాలని సీఎం కోరారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.524.41 కోట్లు ఖర్చు చేశామని.. దీనికి సంబంధించిన కేంద్ర వాటా నిధులను సాధ్యమైనంత త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

**పీఎంకెఎస్‌వై - ఆర్ఆర్ఆర్ పథకం**

ప్రధానమంత్రి కృషి సించాయి యోజన పథకం కింద చెరువులు, కాలువల పునరుద్ధరణకు రాష్ట్రం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని పాటిల్ దృష్టికి సీఎం తీసుకువచ్చారు. ఈ పథకానికి సంబంధించి కేంద్రం వాటా నిధులు వెంటనే విడుదల చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి సామర్థ్యం గణనీయంగా పెంచుకునేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే, పోలవరం జాతీయ ప్రాజెక్టులో వివిధ పనులకు సంబంధించి పెండింగులో ఉన్న అనుమతులు వెంటనే వచ్చేలా చూడాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. రెండోదశ పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులపై త్వరలోనే పూర్తి నివేదిక కేంద్రానికి సమర్పిస్తామని చెప్పారు. ఇక, వంశధార నదీ వివాదానికి సంబంధించి ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుల అమలు ఇంకా పూర్తిగా జరగడం లేదని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నేరడి బ్యారేజ్ నిర్మాణం శ్రీకాకుళం జిల్లాలోని కరువు ప్రాంతాల నీటి అవసరాలకు అత్యవసరమని వివరించారు. దీనికి అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ హక్కులకు భంగం కలగకుండా, ట్రిబ్యునల్ నిర్ణయాల అమలుకు కేంద్రం స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. ఈ అంశంపై తక్షణమే కేంద్ర జోక్యం చేసుకోవాలన్నారు.

**ఆల్మట్టి డ్యామ్ ఎత్తుపెంపు అంశం:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం వాటిల్లేలా కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచాలని భావిస్తోందని, దీనికి సంబంధించి భూసేకరణకు కూడా సిద్ధమైందని సీఎం వివరించారు. అయితే ఈ వివాదం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున కర్నాటక ప్రభుత్వం దీనిపై ముందుకు వెళ్లకుండా కేంద్రం నిలవరించాలని పాటిల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

# పెట్టుబడులను మళ్లించండి!



*నెల్లూరులో బీపీసీఎల్ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ ప్రాజెక్ట్ పురోగతిపై చర్చించేందుకు శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరిని కలవడం ఆనందంగా ఉంది. రిఫైనరీ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావాలని మంత్రి హర్దీప్ సింగ్ పూరీజీని సహృదయంతో ఆహ్వానించాను.*
*- సీఎం చంద్రబాబు నాయుడు*

- ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల పెట్టుబడులకు ఏపీ అనుకూలం
- ఎల్ఎన్‌జీ టెర్మినళ్ల అభివృద్ధి, విస్తరణకు సహకరించండి
- గ్యాస్ పైప్‌లైన్, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ విస్తరించాలి
- కేంద్ర పెట్రోలియం మంత్రికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

ఢిల్లీ (చైతన్య రథం): ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని.. ఏపీలో పెట్టుబడులకు ఇదే అనుకూల సమయమని సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి విజ్ఞప్తి చేశారు. ఏపీలో ఎల్ఎన్‌జీ టెర్మినళ్ల అభివృద్ధి, విస్తరణకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరీతో సమావేశమయ్యారు. నెల్లూరు జిల్లాలో బీపీసీఎల్ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ ప్రాజెక్ట్ శంకుస్థాపనకు హాజరుకావాలని ఈ సందర్భంగా మంత్రిని చంద్రబాబు ఆహ్వానించారు. రూ. 96,862 కోట్ల పెట్టుబడితో ప్రాజెక్ట్ దేశంలోనే అతిపెద్ద సమగ్ర ఇంధన ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 6,000 ఎకరాల భూమిని కేటాయించడంతోపాటు ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు అందించినట్లు వెల్లడించారు. ప్రాజెక్టుకు సంబంధించిన పబ్లిక్ హియరింగ్ విజయవంతంగా పూర్తయ్యిందని, పర్యావరణ అనుమతులు కూడా త్వరలోనే రానున్నాయన్నారు. ప్రాజెక్ట్ అన్ని దశల్లో వేగంగా ముందుకు సాగుతోందని వివరిస్తూ.. ప్రాజెక్ట్ ద్వారా ఉద్యోగావకాశాలు, పారిశ్రామికాభివృద్ధి, రాష్ట్ర ఆర్థికవృద్ధికిగణనీయమైన తోడ్పాటు లభించనుందని సీఎం చంద్రబాబు వివరించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రికి అనేక అంశాలపై విజ్ఞాపనలు చేస్తూ.. "సహజ వాయువు, ఎల్ఎన్‌జీ రంగంలోని కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా సహకరించండి. రాష్ట్రంలోని ఎల్ఎన్‌జీ టెర్మినళ్లను మరింతగా అభివృద్ధి చేయాలి. ఐవోసీఎల్, గెయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ పెట్రో నెట్ ఎల్ఎన్‌జీవంటి చమురు కంపెనీలు ఏపీ అభివృద్ధిలో భాగస్వాములయ్యేలా చూడండి" అని సీఎం చంద్రబాబు కోరారు. ఏపీవ్యాప్తంగా గ్యాస్ పైప్‌లైన్, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌లను విస్తరించాలని కోరుతూ.. దేశ ఇంధన వినియోగంలో సహజ వాయువు వాటాను 2030నాటికి 6 శాతం నుంచి 15శాతానికి పెంచాలన్న ప్రధాని మోదీ విజన్‌కు ఏపీ తనవంతు సహకారం అందించడానికి సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని 65.4 లక్షల ఎల్పీజీ కనెక్షన్లను ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తూ.. పీఎంయువై పథకం పరిధిలోకి వస్తే పథకం లబ్ధిదారులకు సిలిండరుపై రూ.300 రాయితీ అందుతుందని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు.

# ప్రపంచస్థాయి రాష్ట్ర రాజధాని అమరావతిలో భాగస్వాములవ్వండి

**టాప్ రియల్టర్లకు సీఎం చంద్రబాబు పిలుపు**

ఢిల్లీ (చైతన్య రథం): భారతదేశం యొక్క తదుపరి అద్భుత సృష్టిగా నిలవనున్న ప్రపంచస్థాయి రాష్ట్ర రాజధాని అమరావతి మహా నిర్మాణంలో భాగస్వామ్యం పంచుకునే గొప్ప అవకాశాన్ని జాతీయ, అంతర్జాతీయ రియల్టర్లు సద్వినియోగం చేసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన క్రెడాయ్ జాతీయ కాన్‌క్లేవ్‌కు హాజరైన సీఎం చంద్రబాబు నాయుడు రియల్ ఎస్టేట్ డెవలపర్లతో సంభాషించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. "భారత తదుపరి ప్రపంచస్థాయి రాష్ట్ర రాజధాని నిర్మించడానికి అమరావతి ఒక తరంలో ఒకసారి లభించే అవకాశాన్ని సూచిస్తుంది. దూరదృష్టిగల డెవలపర్లు నమ్మకంగా పెట్టుబడి పెట్టడానికి ఇది సరైన సమయం. మైలురాయి ప్రాజెక్టులను సృష్టించడానికి, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ఐకానిక్ నగరాన్ని రూపొందించడంలో భాగస్వామిగా ఉండటానికి ఇంతకుమించిన సమయం దొరుకుతుందని నేననుకోను. అదే విషయాన్ని న్యూఢిల్లీలో జరిగిన క్రెడాయ్ నేషనల్ కాన్‌క్లేవ్‌లో ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్‌లతో సాగిన సంభాషణలో చెప్పాను. అమరావతి యొక్క ప్రత్యేక ప్రయోజనాలు, దీర్ఘకాలిక సామర్థ్యాన్నీ వివరించాను" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.





# పూర్వోదయతో..
# గ్రోత్ ఇంజన్‌గా ఏపీ

- ప్రాజెక్టులకు పాలనాపరమైన నిబంధనల్ని సరళీకృతం చేయండి
- సీమ హార్టీకల్చర్ హబ్‌కు బడ్జెట్‌లో నిధులు పెట్టండి
- అమరావతి తరహాలోనే పోలవరం - నల్లమల సాగర్‌కు నిధులు
- ప్రాజెక్టులపై కేంద్ర సహకారానికి ధన్యవాదాలు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీలో సీఎం చంద్రబాబు



> కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌జీని శుక్రవారం న్యూఢిల్లీలో కలవడం ఆనందంగా ఉంది. పూర్వోదయవంటి కేంద్ర కార్యక్రమాల మద్దతుతో ఆంధ్రప్రదేశ్.. తూర్పు భారతదేశానికి ప్రధాన చోదకశక్తిగా ఎదగగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. సాస్కీ ద్వారా నిధుల మద్దతు, రాయలసీమను ఉద్యానవన కేంద్రంగా అభివృద్ధి చేయాలనే మా ప్రణాళికలకు మద్దతు కోరాను. ఏపీ దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికి కేంద్ర బడ్జెట్ సహాయం కూడా అభ్యర్థించాను.
>
> - సీఎం చంద్రబాబు నాయుడు

ఢిల్లీ (చైతన్య రథం): దేశంలోని తూర్పు ప్రాంత రాష్ట్రాల సమగ్రాభివృద్ధికి తోడ్పడే పూర్వోదయ పథకం వికసిత్ భారత లక్ష్యాన్ని చేరుకునేందుకు జాతీయ ఆర్థిక వ్యవస్థకు చోదకశక్తిగా నిలుస్తుందని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. అలాంటి పూర్వోదయ పథకంతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చేయూతనివ్వాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్‌కు చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు వచ్చే బడ్జెట్లో నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుకు చేయూత అందించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన చంద్ర బాబు.. పూర్వోదయ, సాస్కీ పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు చేయూత ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల కనెక్టివిటీ, సాగునీటి పారుదల వ్యవస్థల ఆధునీకరణ, మౌలిక సదుపాయాల కల్పన, పారిశ్రామిక కారిడార్లు, ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్ల నిర్మాణం, విద్య వైద్య రంగాల సదుపాయాల కల్పనకు పూర్వోదయ పథకం కీలకంగా మారుతుందని అంటూ.. ఆయా గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన ఆర్థిక అవకాశాలనూ అందించగలదని పేర్కొన్నారు. విద్య, నైపుణ్యకల్పన, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, హౌసింగ్, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులలాంటి కీలకమైన రంగాల్లో పూర్వోదయ నిధులు అందించి ఏపీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ పథకం కింద ప్రాధాన్యతా క్రమంలో చేపట్టే ప్రాజెక్టులకు పాలనాపరమైన నిబంధనల్ని సరళీకృతం చేయాలని.. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా వీటిని వినియోగించుకునేలా వెసులుబాటు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

### సాస్కీతో ఏపీకి చేయూత

సాస్కీ కింద మంజూరైన వివిధ ప్రాజెక్టులను సత్వరం చేపట్టాలని కేంద్ర మంత్రికి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. విశాఖలో యూనిటీమాల్ నిర్మాణం, అఖండ గోదావరి కింద చేపట్టిన హేవ్ లాక్ బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు, గండికోట పర్యాటక ప్రాజెక్టుతోపాటు రాష్ట్రంలో మూడు వర్కింగ్ విమెన్ హాస్టళ్ల నిర్మాణాల పూర్తికి నిధులివ్వాలని కోరారు. సాస్కీకింద రెండో విడత నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరిన ముఖ్యమంత్రి, తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌లాంటి రాష్ట్రంలో మౌలిక సదుపాయాల నిర్మాణానికి సాస్కీ పథకం కింద నిధులు కీలమని అభ్యర్థించారు. వీటితోపాటు సాగునీటి ప్రాజెక్టులు, రాష్ట్ర, జిల్లా రహదారుల నిర్మాణం, ఎంఎస్ఎంఈ పార్కులు, హౌసింగ్, వైద్యారోగ్య మౌలిక సదుపాయాల కల్పనకు అదనపు నిధులు మంజూరు చేయాలని ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ పనులకుగానూ రూ.10,054 కోట్లు సాస్కీ కింద మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరారు.

### రాయలసీమ హార్టికల్చర్ హబ్

రాయలసీమకు హార్టికల్చర్ డెవలప్మెంట్ ప్యాకేజీకి ఆర్థిక సాయం కోరుతూ విజ్ఞాపన పత్రాన్ని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి అందించారు. ప్రకాశం జిల్లాతోపాటు రాయలసీమ జిల్లాల్లో ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న 18 పంటలను సాగు చేస్తోన్నట్టు విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని ఎనిమిది జిల్లాల్లో విస్తరించిన 93 ఉద్యానవన క్లస్టర్లు ప్రత్యక్షంగా పరోక్షంగా 33.7 లక్షలమంది రైతులకు ప్రయోజనం కల్పిస్తాయని స్పష్టం చేశారు. ఎగుమతులు చేసేందుకు వీలుగా ఉద్యాన ఉత్పత్తులు పెద్దఎత్తున ఈ ప్రాంతంలో పండుతున్నాయని తెలిపిన ముఖ్యమంత్రి, ప్రస్తుతం ఉన్న 8.48 లక్షల హెక్టార్ల హార్టికల్చర్ సాగును 2029నాటికి 12.28 లక్షల హెక్టార్లకు విస్తరించాలని నిర్ణయించినట్టు వివరించారు. ఈ ప్రాంతంలో నీటి వనరులను మెరుగుపర్చటంతోపాటు ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతికి వీలుగా రోడ్డు, రైలు, ఓడరేవులు, ఎయిర్ కార్గో సహా లాజిస్టిక్స్ పార్కుల లాంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉందని స్పష్టం చేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు వచ్చే మూడేళ్లలో రూ.41 వేల కోట్ల ఆర్థిక సహకారం అవసరమని పేర్కొన్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర -2047 విజన్‌లకు అనుగుణంగా రైతుల వార్షికాదాయం రూ.2 లక్షలనుంచి 3.5 లక్షలకు పెరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సానుకూల అంశాలను దృష్టిలో ఉంచుకుని 2026-27 కేంద్ర బడ్జెట్‌లో రాయలసీమ హార్టికల్చర్ డెవలప్మెంట్ ప్యాకేజీని ప్రకటించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను సీఎం చంద్రబాబు కోరారు.

### కేంద్ర సహకారానికి ధన్యవాదాలు

ఏపీలో సాగునీటి ప్రాజక్టులకు కేంద్రం అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి.. కరవు పీడిత ప్రాంతాల దాహార్తిని తీర్చేందుకు, సాగునీటి అవసరాల కోసం గోదావరి వరద జలాల మళ్లింపు కోసం చేపట్టే పోలవరం- నల్లమల సాగర్ ప్రాజెక్టుకు చేయూత అందించాలని విజ్ఞప్తి చేశారు. గోదావరి నదికి వచ్చే వరద జలాల్లో 200 టీఎంసీ నీటిని పోలవరం ఆనకట్టనుంచి నీటి కొరత ఉన్న ప్రాంతాలకు తరలించటమే ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలో కరవు నివారణ సాధ్యపడుతుందన్నారు. మూడు దశలుగా ప్రాజెక్టును చేపట్టేందుకు అయ్యే వ్యయాన్ని వివరిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖ అందించారు. ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ఇప్పటికే జలహారతి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్టు వివరిస్తూ.. దీనికి సంబంధించి ప్రాథమిక ప్రాజెక్టు రిపోర్టునూ కేంద్ర జలశక్తి శాఖకు సమర్పించినట్టు తెలిపారు. దీనికి ఆమోదం తెలిపిన వెంటనే డీపీఆర్‌ను సమర్పిస్తామని సీఎం చంద్రబాబు కేంద్రమంత్రికి వివరించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రుణ సహకారం అందించిన తరహాలోనే ఈ ప్రాజెక్టుకూ కేంద్రం చేయూత అందించాలని కోరారు. ఈ ప్రాజెక్టు ద్వారా కరవు పీడిత ప్రాంతాలైన ప్రకాశం, రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు సాగు, తాగునీరు అందుతుందని వివరించారు. 2026-27 కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

---

# నబీన్ సారథ్యంలో..
# బీజేపీ మరింత బలోపేతం

## కొత్త వర్కింగ్ ప్రసిడెంట్‌కు అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు



> బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొత్తగా నియమితులైన నితిన్ నబిన్‌జీని కలిశాను. ఆయన కొత్త బాధ్యతలను స్వీకరించినందుకు శుభాకాంక్షలు తెలిపాను.
>
> - సీఎం చంద్రబాబు నాయుడు

ఢిల్లీ (చైతన్య రథం): భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ నాయకత్వంలో ఆ పార్టీ మరింత అభివృద్ధి చెందాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఢిల్లీ పర్యటనలోవున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. "ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అత్యంత వేగంగా ముందుకు సాగుతోంది. ఈ ప్రయాణంలో అందరం కలిసికట్టుగా పని చేశాం. ఇకపైనా అలాగే నిలబడతాం. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నబీన్‌ను కలసి అభినందించడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన యువకుడు, ఉత్సాహవంతుడు. వరుసగా ఎన్నికల్లో విజయాలు సాధిస్తూ ముందుకు సాగుతున్నారు.

ఇది దేశానికి చాలా కీలకమైన సమయం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశ బ్రాండ్‌ను ప్రపంచమంతటా గుర్తింపు పొందే స్థాయికి తీసుకువచ్చారు. రైట్ టైమ్, రైట్ లీడర్, రైట్ డెసిషన్.. అది నరేంద్ర మోదీ. అలాంటి పార్టీకి ఈరోజు నబీన్ కీలక బాధ్యతలు స్వీకరించడం ఎంతో శుభప్రదం. వారి నాయకత్వంలో దేశం అన్ని విధాలా మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షిస్తూ, మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నా" అని చంద్రబాబు పేర్కొన్నారు.

---

## నేడు అనకాపల్లి జిల్లాలో
# సీఎం చంద్రబాబు పర్యటన

### 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' సహా పలు కార్యక్రమాలకు హాజరు



అమరావతి (చైతన్య రథం): 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం అనకాపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడతారు. ప్రజావేదిక సభ, పార్టీ కేడర్‌తో భేటీ, మత్స్యకారులతో సమావేశం, అలాగే మాజీ ప్రధాని అటల్ బిహారి వాజపేయి విగ్రహావిష్కరణ వంటి కార్యక్రమాల్లో పాల్గొంటారు. శనివారం ఉదయం అమరావతినుంచి నేరుగా హెలికాప్టర్‌లో అనకాపల్లి జిల్లా చేరుకుంటారు. ఉదయం 11.30 గంటలకు కశింకోట మండలం తల్లపాలెంలో విద్యార్థులతో ముచ్చటిస్తారు. ఆ తర్వాత బంగారాయ్యపేట గ్రామంలోని సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ పరిశీలిస్తారు. అనంతరం "స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర" కార్యక్రమానికి హాజరవుతారు. మధ్యాహ్నం తల్లపాలెంలోని ప్రజావేదిక సభలో పాల్గొంటారు. తర్వాత ఉగ్గినపాలెం గ్రామంలో నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం స్థానిక మత్స్యకారులతోనూ వివిధ అంశాలపై మాట్లాడతారు. సాయంత్రం అనకాపల్లిలో అటల్ బిహారి వాజపేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. తిరిగి రాత్రికి అమరావతికి చేరుకుంటారు.

# దుగరాజపట్నంపై దృష్టిపెట్టండి



- జాతీయ మెగా షిప్‌బిల్డింగ్, రిపేర్ క్లస్టర్ అభివృద్ధికి సహకరించాలి
- "చిప్ టు షిప్" విజన్‌తో షిప్‌బిల్డింగ్ రంగాన్ని బలోపేతం చేయాలి
- షిప్పింగ్, జలరవాణా మంత్రికి సీఎం చంద్రబాబు వినతి
- కేంద్ర హోం, పట్టణాభివృద్ధి మంత్రులతో చంద్రబాబు భేటీ

ఢిల్లీ (చైతన్య రథం): ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా మంత్రి సర్బానంద సోనోవాల్‌తో సమావేశమయ్యారు. దుగరాజపట్నం షిప్‌బిల్డింగ్ క్లస్టర్, ఫిషింగ్ హార్బర్లకు కేంద్ర సాయంపై సోనోవాల్‌తో లోతుగా చర్చించారు. దేశంలో నౌకాశ్రయాలు, నౌకా నిర్మాణరంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలకు ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. "చిప్ టు షిప్" విజన్‌కు అనుగుణంగా షిప్‌బిల్డింగ్ రంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి సర్బానందకు విజ్ఞప్తి చేశారు. దుగరాజపట్నంలో నేషనల్ మెగా షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ క్లస్టర్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్రం పూర్తి సన్నద్ధంగా ఉందని, ప్రాజెక్టు కోసం 3,488 ఎకరాల భూమి సమకూర్చేందుకూ సిద్ధంగా ఉన్నామని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. "ప్రాజెక్టుకు సంబంధించిన టెక్నో-ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్ట్ సిద్ధమైంది. నౌక నిర్మాణానికి అనుబంధ ఎంఎస్ఎంఈ యూనిట్లు, కామన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో సమగ్ర క్లస్టర్‌గా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం -2014లో పేర్కొన్న అంశాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇవ్వండి. దుగరాజపట్నాన్ని నేషనల్ మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్‌గా త్వరితగతిన ఆమోదించాలి" అని మంరితి సర్బానందను సీఎం చంద్రబాబు కోరారు.

### ఫిషింగ్ హార్బర్లకు కేంద్రం సాయం

"ఫేజ్-1లో చేపట్టిన నాలుగు ఫిషింగ్ హార్బర్లకు అదనపు నిధులు కేటాయించండి. మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదల కోసం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాం. ఫేజ్-1లో జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్లను రూ.1361.49 కోట్లతో చేపట్టాం. జువ్వలదిన్నె హార్బర్‌కు మాత్రమే కేంద్రం నుంచి రూ.138.29 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.782.29 కోట్లు ఖర్చు చేసింది. మిగిలిన మూడు హార్బర్లకు కేంద్ర సాయం ఇంకా అందలేదు. ఫేజ్-1 పూర్తి కోసం ఇంకా రూ.440.91 కోట్లు అవసరముంది. ప్రకాశం జిల్లా ఓడరేవు ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సాగరమాల పథకం కింద రూ.150 కోట్లు మంజూరు చేయాలి. మొత్తంమీద రూ.590.91 కోట్లు కేంద్రం నుంచి సహాయంగా అందాల్సి ఉంది" అని మంత్రి సర్బానంద దృష్టికి సీఎం చంద్రబాబు తీసుకొచ్చారు.

### కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ

ఢిల్లీ పర్యటనలో భాగంగా తాజ్ ప్యాలెస్ హోటల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. ఏపీలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. ఇటీవల

*రాష్ట్రంలోని కీలకమైన నౌకానిర్మాణ ప్రాజెక్టులు మరియు ప్రధాన ఫిషింగ్ హార్బర్‌ల అభివృద్ధిపై కేంద్ర-రాష్ట్ర పరస్పర సహకారంపై శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ జీతో ఫలవంతమైన సమావేశం నిర్వహించాను.*

*- సీఎం చంద్రబాబు నాయుడు*

నిర్వహించిన పెట్టుబడుల సదస్సుకు వచ్చిన సానుకూల స్పందనను అమిత్ షాకు వివరిస్తూ.. ఏపీలోని రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. అనంతరం క్రెడాయ్ నేషనల్ కాన్‌క్లేవ్‌లో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.

### మెట్రో ప్రాజెక్టుకు ఓకే చెప్పండి

కేంద్ర గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి వ్యవహారాల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమైన చంద్రబాబు నాయుడు..విశాఖ, విజయవాడలో మెట్రో రైలు ప్రాజెక్టులను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. సవరించిన డీపీఆర్‌లను కేంద్ర ఆమోదానికి పంపినట్టు ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విశాఖ, విజయవాడ మెట్రో రైలు ఏర్పాటు అవశ్యకతను కేంద్ర మంత్రికి వివరిస్తూ.. సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టుకు కేంద్రం ఓకే చెప్పాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.






# ఆ బాధ్యత మీదే..

## ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం కేంద్రమే చేపట్టాలి
## కేంద్రమంత్రి గడ్కరీని కోరిన సీఎం చంద్రబాబు

ఢిల్లీ (చైతన్య రథం): రాజధాని అమరాతిని దేశంలోని వేర్వేరు నగరాలతో అనుసంధానించేలా జాతీయ రహదారుల నెట్వర్క్‌ను అనుసంధానించాలని ఏపీ సీఎం చంద్రబాబు.. కేంద్రమంత్రి గడ్కరీని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా నితిన్ గడ్కరీతో సీఎం సమావేశమయ్యారు. జాతీయ రహదారి నెట్వర్క్‌ను బలోపేతం చేయడంలో నితిన్ గడ్కరీ కృషిని కొనియా డారు. వివిధ ప్రాంతాల కనెక్టివిటీతోపాటు ఆర్థిక ప్రగతికి సూచికగా జాతీయ రహదారులు నిలిచాయని పేర్కొన్నారు. గ్రీన్ ఫీల్డ్ నగరంగా అభివృద్ధి చెందుతున్న అమరావతికి జాతీయ రహదారులతో ప్రత్యక్ష, పరోక్ష నెట్వర్క్ ఏర్పాటు చేయాల ని కోరారు. కృష్ణానదిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 6 లేన్ల ఐకానిక్ వంతెన నిర్మాణాన్ని కేంద్రమే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. 6 లేన్ల ఐకానిక్ కేబుల్ స్టెడ్ వంతెన మూలపాడు వద్ద 3 కీలకమైన జాతీయరహదారులతో అమరావతిని అను సంధానిస్తుందని తెలిపారు. విజయవాడ-హైదరాబాద్, చెన్నై- కోల్‌కతా సహా తీరప్రాంత రోడ్ కారిడార్‌తో అమరావతిని ఈ వంతెన అనుసంధానిస్తుందన్నారు. హైదరాబాద్ నుంచి అమరావతి వరకూ ప్రతిపాదిత గ్రీన్ ఫీల్డ్ హైవే హై స్పీడ్ యాక్సెస్ కలిగిస్తుందన్న ముఖ్యమంత్రి.. నగరాల మధ్య కనెక్టివిటీతోపాటు ప్రజలకు ప్రయాణ సమయాన్ని కూడా గణనీయంగా తగ్గిస్తుందని స్పష్టం చేశారు. అమరావతిని జాతీయ రహదారి గ్రిడ్లో మొబిలిటీ కేంద్రంగా, లాజిస్టిక్స్ నోడ్‌గా మారుస్తుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఒక ప్రధాన నదిపై నిర్మించే ఈ 6 లేన్ ఐకానిక్ బ్రిడ్జిని జాతీయ రహదారుల సంస్థ చేపట్టేలా చూడాలని కేంద్ర మంత్రిని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాజధానికి కీలకమైన ప్రాజెక్టుగా 6 లేన్ల ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి పూర్తి సహకారం అందించాలని కేంద్ర మంత్రి గడ్కరీకి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

*కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ జీతో శుక్రవారం సమావేశమయ్యాను. రాష్ట్రానికి కీలకమైన రోడ్డు మౌలిక సదుపాయాల అవసరాల గురించి గడ్కరీ జీతో చర్చించడం ఆనందంగా ఉంది. ఎన్‌హెచ్ -65, ఎన్‌హెచ్-13లను కలుపుతూ కృష్ణా నదిపై ప్రతిపాదిత 6 లేన్ల కేబుల్-స్టేడ్ వంతెన గురించి నేను వివరించాను. ఈ వంతెన అమరావతిని హైదరాబాద్- విజయవాడ మరియు చెన్నై-కోల్‌కతా కారిడార్‌లకు అనుసంధానిస్తుంది. ప్రయాణాన్ని వేగవంతం చేస్తుంది. మన రాజధాని కీలకమైన రవాణా మరియు లాజిస్టిక్స్ హబ్‌గా ఎదగడానికి సహాయపడుతుంది.*

*- సీఎం చంద్రబాబు నాయుడు*



## రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీకి..

# అభివృద్ధి సొబగులు

### - పలు నూతన భవనాలను ప్రారంభించిన మంత్రి లోకేష్





రాజమహేంద్రవరం(చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాలేజీలో వివిధ విభాగాలకు సంబంధించి నూతనంగా నిర్మించిన పలు భవనాలను లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా కళాశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ మెయిన్ గేట్ వద్ద కాలేజీ లోగోను ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా నిర్మించిన స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. హై-గ్లో ల్యాబ్ ఆన్ వీల్స్ సైన్స్ ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. విద్యార్థులతో సంభాషించారు. అనంతరం ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ హబ్‌ను ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు రూపొందించిన పలు ఆవిష్కరణలను పరిశీలించారు. ఈ సందర్భంగా వాల్ ఆఫ్ ఫేమ్‌లో సంతకం చేశారు. అనంతరం కాలేజీలో వందేమాతరం మూవ్‌మెంట్ మెమోరియల్‌ను మంత్రి ఆవిష్కరించారు. వందేమాతరం ఉద్యమానికి ప్రతీకగా సైన్స్ బ్లాక్ వద్ద వందేమాతరం పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వందేమాతరం ఉద్యమంలో రాజమండ్రి గవర్నమెంట్ కాలేజీ పాత్రను విద్యార్థులు వివరించారు. విదేశీ విద్యార్థుల పరిశోధనల కోసం నూతనంగా నిర్మించిన సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ బిల్డింగ్‌ను మంత్రి లోకేష్ ప్రారంభించారు. సీవీ రామన్ ఇంటర్నేషనల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో ఇంటర్నేషనల్ స్టూడెంట్స్‌తో ఇంటరాక్ట్ అయ్యారు. అరకు కాఫీ కేఫ్‌ను సందర్శించారు. విద్యార్థులతో సంభాషించారు. అనంతరం జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడల్లో రాణించిన కళాశాల విద్యార్థులను అభినందించారు.



అనంతరం కాలేజీ లైబ్రరీని సంద ర్శించి అరుదైన పుస్తకాలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా Some Meditations of Marcus Aurlius Antoninus Presentation పుస్తకాన్ని మంత్రి లోకేష్‌కు గ్రంథాలయనిర్వాహకులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి గవర్నమెంట్ కాలేజీ (అటానమస్) ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కళాశాల విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేసీ వై.మేఘా స్వరూప్, రాజమండ్రి ఆర్టీఐహెచ్ నోడల్ ఆఫీసర్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తోంది. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో కాలేజీలో ఆధునిక వసతులను సమకూర్చారు. రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సహకారంతో రూ.32 లక్షల వ్యయంతో కాలేజీ ఆధునిక డిజైన్‌తో మెయిన్ అవుట్ గేట్ ఎలివేషన్‌ను నిర్మించారు. పూర్వ విద్యార్థి అయిన నున్న తిరుమలరావు (తిరుమల ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్), రూసా(RUSA) సహకారంతో రూ.70 లక్షల వ్యయంతో ఇండిపెండెంట్ కామర్స్ బ్లాక్‌ను నిర్మించారు. అదేవిధంగా పూర్వవిద్యార్థి డాక్టర్ ఏవీఎస్ రాజు(యూఎస్ఏ), సీపీడీసీ సహకారంతో రూ.11 లక్షలు వెచ్చించి సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్ అండ్ రీసెర్చ్(CISR) సెంటర్‌ను నెలకొల్పారు. హన్స(Hansa) సొల్యూషన్స్ రూ.1.2 కోట్ల సీఎస్ఆర్ నిధులు వెచ్చించి ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ హబ్‌ను (IIH)ను నిర్మించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రూ.55 లక్షలు వెచ్చించి ఏఐ-డ్రైవన్ డిజిటల్ క్లాస్ రూమ్స్, రూ.కోటి వ్యయంతో రీసెర్చ్ అడ్వాన్సెస్ ఇన్ మెటీరియల్స్(RAM) సైన్స్ సెంటర్ అప్ గ్రేడ్, కాలేజీ ఇంటర్నల్ ఫండింగ్(CPDC) కింద రూ.2.2 కోట్ల వ్యయంతో బుద్ధ భవన్ బ్లాక్ విస్తరణ, రూ.1.2 కోట్ల వ్యయంతో టెక్నోస్పియర్ కంప్యూటర్ ల్యాబ్, రూ.27లక్షలు వెచ్చించి యాంఫీ థియేటర్, రూ.12 లక్షల వ్యయంతో ఇన్నర్ గేట్, సెంట్రల్ ఆర్చ్‌ను నిర్మించారు.










































# నన్నయ్య యూనివర్సిటీలో నూతన భవనాలను ప్రారంభించిన మంత్రి లోకేష్





రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో రూ.34 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మూడు భవనాలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా యూనివర్సిటీ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మంజీరా బ్లాక్ పేరుతో నూతనంగా నిర్మించిన ఎగ్జామినేషన్ బిల్డింగ్, గౌతమి బ్లాక్ పేరుతో నిర్మించిన కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఇంద్రావతి బ్లాక్ పేరుతో నిర్మించిన స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కళాశాల విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేసీ వై. మేఘా స్వరూప్, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్. ప్రసన్న శ్రీ, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.జ్యోతిర్మయి, యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయ నిర్మల, యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.




















### తూర్పుగోదావరిలో మంత్రి లోకేష్‌కు

## అడుగడుగునా ఘన స్వాగతం

రాజమహేంద్రవరం (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు శుక్రవారం అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. తొలుత రాజమండ్రి విమానాశ్రయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్ వారితో ఫోటోలు దిగారు.

బూరుగుపూడి జంక్షన్ వద్ద రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో మంత్రి లోకేష్‌కు టీడీపీ నాయకులు గజమాలతో స్వాగతం పలికారు. గాడాల గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి లోకేష్‌కు సాదర స్వాగతం పలికారు. రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ జంక్షన్ వద్ద సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పార్టీ జెండాలు, డప్పులు, బాణా సంచాలతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. లాలాచెరువు జంక్షన్‌లోనూ మంత్రి నారా లోకేష్‌కు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్ వారితో ఫోటోలు దిగారు. లాలాపేట జంక్షన్ వద్ద మంత్రి లోకేష్‌కు ఆటో డ్రైవర్‌లు ఘనంగా స్వాగతం పలికి.. 'ఆటో డ్రైవర్ ల సేవలో' పథకం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద లోకేష్‌కు ప్రతిభ ఒకేషనల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు.




# యువత రాజకీయాల్లోకి రావాలి

◆ విద్యార్థులు జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనకు కృషిచేయాలి
◆ ఉద్యోగాల సాధనకు విద్యతో పరిశ్రమల అనుసంధానం
◆ కేజీ నుంచి పీజీ వరకు స్త్రీలను గౌరవించేలా ప్రత్యేక కార్యాచరణ
◆ నైపుణ్యం పోర్టల్ ద్వారా ఉద్యోగావకాశాలు
◆ జనవరి నెలలో జాబ్ కేలండర్ విడుదల
◆ మా నాన్నకి దక్కే గౌరవం నాకూ దక్కాలని అహర్నిశలు కష్టపడుతున్నా
◆ 'హలో లోకేష్' పేరుతో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి లోకేష్
◆ విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన మంత్రి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు కృషిచేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి ఉద్బోధించారు. రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన బహిరంగ సభ వేదిక వద్ద 'హలో లోకేష్' పేరుతో మంత్రి నారా లోకేష్ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ఇంగ్లీష్ లెక్చరర్ ఎన్.శ్రీనివాస్ ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానం ఇచ్చారు.

డిగ్రీ చదివేప్పుడే ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకునేలా గవర్నమెంట్ కాలేజీల్లో ప్రభుత్వం ఎలాంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందని హరివర్మ అనే విద్యార్థి అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ సమాధానం ఇస్తూ.. గ్రాడ్యుయేషన్ తర్వాత కూడా యువత ఉద్యోగాలు పొందేందుకు ఇబ్బందులు పడుతోందన్నారు. 173 ఏళ్ల చరిత్ర ఉన్న రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీలో చదివిన విద్యార్థులకు కూడా ఉద్యోగాలు రావడం లేదు. ఇందుకు అకడమియాతో ఇండస్ట్రీని అను సంధానించాల్సిన అవసరం ఉంది. విద్యతో పరిశ్రమ లను అనుసంధానించాలి. అందుకే ప్రభుత్వం క్లస్టర్ బేస్డ్ విధానంలో ముందుకు వెళుతోంది. ఆయా జిల్లాల్లో సుమారు 22 క్లస్టర్స్‌ను గుర్తించాం. అనంత లో ఆటోమోటివ్, కర్నూలులో రెన్యూవబుల్ ఎనర్జీ, ఉత్తరాంధ్రలో ఐటీ, మెడికల్ డివైసెస్ పరిశ్రమలను ప్రోత్సహిస్తామని మంత్రి లోకేష్ చెప్పారు.

## స్త్రీలను గౌరవించేందుకు ప్రత్యేక కార్యాచరణ

స్త్రీలను గౌరవించాలని పదేపదే చెబుతున్నారు. కానీ సోషల్ మీడియా, మూవీస్‌లో అలాంటి పరిస్థితి లేదు. అవి మారకుండా ఈ సమాజంలో మార్పు వస్తుందా అని బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న శ్రీదేవి అనే విద్యార్థి అడిగి ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. మా తల్లిని అవమానిస్తే ఎంత ఇబ్బందిపడ్డారో తాను కళ్లారా చూశానన్నారు. ఆ రోజు నుంచే స్త్రీల గౌరవాన్ని పెంపొందించే కార్యాచరణ అమలు చేయాలనే ఆలోచన వచ్చింది. కేజీ నుంచి పీజీ వరకు స్త్రీలను గౌరవించాలనే లక్ష్యంగా పాఠ్యాంశాలు రూపొందిస్తున్నాం. గాజులు తొడుక్కున్నావా, చీర కట్టుకున్నావా లాంటి పదాలను విడనాడాలి. విద్యార్థులకు నైతిక విలువలు చాలా అవసరం. విజయానికి దగ్గరి దారులు లేవు. నైతిక విలువలు పెంపొందించుకోవాలి. అందుకే ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుని సలహాదారుగా నియమించుకున్నాం. నైతిక విలువలపై ఆయన రూపొందించిన పుస్తకాలను విద్యార్థులకు అంద జేశాం. మరోవైపు కరిక్యులమ్‌ను ప్రళన చేస్తున్నాం. ప్రతి శనివారం నైతిక విలువలపై క్లాస్ ఏర్పాటు చేస్తాం. మహిళలను కించపరిచే విధంగా ఎవరు వ్యవహరించినా చర్యలు తీసుకునేలా చట్టం తీసుకు రావాలని భావిస్తున్నామని మంత్రి లోకేష్ తెలిపారు.

## నైపుణ్యం పోర్టల్ ద్వారా ఉద్యోగ అవకాశాలు

డిగ్రీ చదివేప్పుడే పార్ట్ టైం జాబ్ చేసే విధంగా ఏమైనా అవకాశాలు కల్పిస్తారా, విదేశాల్లో ఉద్యోగాల కోసం మెంటరింగ్, కెరీర్ కౌన్సిలింగ్ అవసరం ఉందని విద్యార్థిని సాత్విక అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ.. కూటమి ప్రభుత్వం నైపుణ్యం పోర్టల్‌ను రూపొందిస్తోందన్నారు. ఇంటర్వ్యూకు ఎలా హాజరు కావాలి, ఏవిధంగా సిద్ధం కావాలి, ప్రపంచంలో ఎక్కడ అవకాశాలు ఉన్నాయో ఈ పోర్టల్ ద్వారా తెలియజేస్తాం. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి లోకేష్ చెప్పారు.

## మన కుటుంబ వ్యవస్థ చాలా గొప్పది

మీది పెద్దలు కుదిర్చిన వివాహం.. మీ లవ్ ఎలా స్టార్ట్ అయింది అని కీర్తన అనే విద్యార్థిని అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. తనకు చిన్న వయసులోనే పెళ్లి అయిందన్నారు. అరేంజ్డ్ మ్యారేజీలో అండర్ స్టాండింగ్ ముఖ్యం. మన పర్సనల్ లైఫ్‌లో, కెరీర్ లో ఏదైనా సాధించాలంటే అండర్ స్టాండింగ్ తో ముందుకు వెళ్లాలి. బ్రాహ్మణితో ఆ బాండ్ అండర్ స్టాండింగ్ వల్ల వచ్చింది. ఇద్దరం కలిసి అన్ని పనులు సమానంగా చేస్తాం. తల్లిదండ్రులు, అవ్వాతాతల నుంచి మనం నేర్చుకోవాలి. ప్రపంచంలో అతి తక్కువ డైవోర్స్ రేట్ ఉన్న దేశం మనది. మన కుటుంబ వ్యవస్థ చాలా గొప్పది. మీరు బాగా చదువుకుని కంపెనీలు స్టార్ట్ చేయాలి. పదిమందికి ఉద్యోగాలు కల్పించాలి. బ్రాహ్మణి అర్థం చేసుకోవడం, ఆమె సపోర్ట్ వల్లే నేను పాదయాత్ర చేయగలిగా. అండర్ స్టాండింగ్ అనేది చాలా అవసరమని మంత్రి లోకేష్ అన్నారు.

## జనవరిలో జాబ్ కేలండర్ విడుదల

20 లక్షల ఉద్యోగాల కల్పన, జాబ్ కేలండర్ ఎప్పుడు విడుదల చేస్తారని కిషోర్ అనే విద్యార్థి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారన్నారు. అందులో భాగంగా స్వర్ణాంధ్ర విజన్ సాధించాలంటే పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ కు ఇటీవల శంకుస్థాపన చేశాం. 25 వేల ఉద్యోగాలు కల్పిస్తామని వారు చెప్పారు. గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. రిలయన్స్ డేటా సెంటర్ కూడా రాబోతోంది. ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. 150 కేసులు వేసినా 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియ పూర్తిచేసి 16వేల మందికి ఉద్యోగాలు ఇచ్చాం. 6వేల మందిని కానిస్టేబుళ్లుగా నియమించాం. జనవరి నెలలో జాబ్ కేలండర్ విడుదల చేస్తామని మంత్రి లోకేష్ తెలిపారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి

యువత రాజకీయాల్లో రావాలని అంటున్నారు. మీరు నాకు మెంటర్‌గా వ్యవహరిస్తారా అని కిరణ్ అనే విద్యార్థి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. యువత రాజకీయాల్లో రావాలని తాము కోరుకుంటున్నామన్నారు. సమాజంలో మనం ఆశించే మార్పు కోసం యువత రాజకీయాల్లోకి రావాలి. గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన తర్వాత నేను నీకు మెంటర్ గా ఉంటా. నీ ఫోన్ నెంబర్ ఇవ్వాలని మంత్రి లోకేష్ సూచించారు.

## పాఠశాలలు, కళాశాలల్లో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి

కాలేజీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించాలని, లైబ్రరీ భవనాన్ని విస్తరించాలని శిరీష అనే విద్యార్థి కోరింది. దీనిపై మంత్రి స్పందిస్తూ.. మన రాష్ట్రం నుంచి శ్రీచరణి అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో రాణిస్తు న్నారన్నారు. ఇటీవల ఐసీసీ మహిళల వన్డే ప్రపంచ కప్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసి మ్యాచ్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆమెకు ప్రభుత్వం రూ. 2. 5 కోట్ల నగదు ప్రోత్సహకాన్ని అందించింది. వైజాగ్‌లో ఇంటిస్థలం కేటాయించింది. గ్రూప్-1 ఉద్యోగం కూడా కల్పిస్తాం. చాలా మందికి క్రీడల్లో రాణించా లని ఆసక్తి ఉంటుంది. శాప్ ద్వారా క్షేత్రస్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం. భవిష్యత్‌లో కాలేజీల్లో కూడా క్రీడా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తామని మంత్రి లోకేష్ తెలిపారు

## విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలి

గతంలో లావుగా ఉండేవారు. మిమ్మల్ని ట్రోల్ చేసేవారు. ఇప్పుడు ఫిట్‌గా ఉన్నారు. ట్రోలింగ్స్ పై ఎప్పుడైనా బాధపడ్డారా? అయితే మిమ్మల్ని మీరు ఎలా మోటివేట్ చేసుకున్నారు, మీ డైట్ సీక్రెట్ ఏంటి అని కార్తికేయ అనే విద్యార్థి అడిగి ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. లైఫ్ ఈజ్ ఏ జర్నీ.. నాట్ డెస్టినేషన్ అన్నారు. మనం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటాం. ఒక లక్ష్యంతో ముందుకు వెళ్లాలి. మార్కులు తక్కువగా వచ్చాయని ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సవాళ్లను అధిగమించాలి. నేను సింగిల్ మీల్ మాత్రమే చేస్తా. మీ లాంటి యువతకు త్రీ మీల్స్ అవసరమని మంత్రి లోకేష్ చెప్పారు.

## ప్రతి స్టూడెంట్‌కు ఫ్రీగా ఏఐ టూల్

ప్రతి స్టూడెంట్ కు ఏఐ టూల్ ఫ్రీగా ఇచ్చే ఛాన్స్ ఉందా అని విద్యార్థి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. వందశాతం ఇచ్చే బాధ్యత తీసుకుంటామన్నారు. ఇది మంచి సలహా. నేను జెమినై ఎక్కువగా వినియోగిస్తా. జెమినైని ఉచితంగా అందించే బాధ్యత తీసుకుంటాం. వన్ ఫ్యామిలీ వన్ ఏఐ యూజ్ కేస్ తయారుచేయాలనేది సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## నేను ఈ స్థాయికి రావడానికి కారణం మా అమ్మ

మీ అమ్మ కొట్టిన మొదటి దెబ్బ ఎప్పుడు, ఎందుకు అని హర్షవర్ధని అనే విద్యార్థిని అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. మా అమ్మ ఇప్పుడు కూడా రెండు దెబ్బలు కొడతారన్నారు. అమ్మకు చెప్పకూడని పని చేయకూడదని చాగంటి చెప్పారు. నేను ఈ స్థాయికి రావడానికి కారణం మా అమ్మ. క్రమశిక్షణ ఆమె వద్ద నేర్చుకున్నా. అమ్మ ప్రేమ అన్ కండిషనల్. తల్లిని ప్రతిఒక్కరూ గౌరవించాలని మంత్రి లోకేష్ అన్నారు.

## పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలి

హయ్యర్ ఎడ్యుకేషన్ పై విజన్ ఏమిటి అని కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. మన పాఠాలు ఇండస్ట్రీ ఓరియెంటెడ్‌గా ఉండాలన్నారు. కరిక్యులమ్ ప్రక్షాళన చేస్తున్నాం. రీసెర్చ్ కూడా చాలా అవసరం. ప్రధాని మోదీ కూడా వచ్చే ఏడాది నుంచి పరిశోధనలకు ఎక్కువ నిధులు కేటాయించాలని భావిస్తున్నారు. హయ్యర్ ఎడ్యుకేషన్‌ను కూడా స్ట్రీమ్ లైన్ చేస్తున్నాం. లోకల్ ఇండస్ట్రీతో ఎక్కువగా టై అప్ కావాలి. పిల్లలకు గ్రేటర్ ఎక్స్ పోజర్ అందించాల్సిన అవసరం ఉందని మంత్రి లోకేష్ అన్నారు.

కాలేజీలో చదివేప్పుడు మిమ్మల్ని ఎవరైనా ర్యాగింగ్ చేశారా, మీరు ఎవరినైనా ర్యాగింగ్ చేశారా, మీ ఫస్ట్ క్రష్ ఎవరు అని భరత్ అనే విద్యార్థి అడిగి ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. తనను ఎవరూ ర్యాగింగ్ చేయలేదన్నారు. మా మధ్య ఫ్రెండ్ షిప్ ఉండేది. బ్రాహ్మణి నా ఫస్ట్ అండ్ లాస్ట్ క్రష్ అని స్పష్టం చేశారు.

## అందుకు అహర్నిశలు కష్టపడుతున్నా

అవినీతి అనేది చాలా పెద్ద సమస్యగా మారింది. అవినీతి కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనే విద్యార్థి ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా వెయ్యి వరకు సేవలందిస్తున్నామన్నారు. సంస్కరణలు రావాల్సిన అవసరం ఉంది. సంస్కరణల ద్వారానే అవినీతికి అడ్డుకట్ట పడుతుంది. మంచివారికి ఓటువేయడం ద్వారా మార్పు సాధ్యం. 2004-05 సమయంలో రాజకీయాల్లోకి రావాలని నిర్ణయం తీసుకున్నా. చంద్రబాబుకి దక్కే గౌరవాన్ని చూసి రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నా. ఏ గౌరవం అయితే మా నాన్నకి దక్కుతుందో ఆ గౌరవం నాకూ దక్కాలని అహర్నిశలు కష్టపడుతున్నానన్నారు.

## ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రి స్పందిస్తూ.. దేవుడు అనేక పరీక్షలు పెడతాడు. వాటిని జయించే శక్తి కూడా ఇస్తాడన్నారు. 2019లో మంగళగిరిలో పోటీ చేసి ఓటమి చెందాను. తర్వాత కసితో పనిచేసి విజయం సాధించాను. మాకూ అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. అందరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, లక్ష్య సాధనకు కష్టపడాలి. ఆత్మహత్యల నివారణకు ఫ్రేమ్ వర్క్ రూపొందిస్తాం. ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదని మంత్రి చెప్పారు. అనంతరం అందరితో కలిసి సెల్ఫీ ఫోటో దిగారు.

ఈ కార్యక్రమంలో రాజమండ్రి గవర్నమెంట్ కాలేజీ (అటానమస్) ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్ర రావు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజమండ్రి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కళాశాల విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేసీ వై.మేఘా స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.



# ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకున్నాం

- ఏపీకి బ్రాండ్ సీఎం చంద్రబాబు
- కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి
- మంగళగిరితో పోటీపడతామనే ఎమ్మెల్యే వాసు సవాల్‌ను స్వీకరిస్తున్నా
- కష్టంలో తోడుగా ఉన్న ఆదిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం
- రాజమండ్రి సిటీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి లోకేష్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది.. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని టీడీపీ నేతలు, కార్యకర్తలకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపు ఇచ్చారు. రాజమహేంద్రవరంలోని చెరుకూరి వీర్రాజు సుబ్బలక్ష్మి కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన రాజమండ్రి సిటీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలకు కార్యకర్తలు ఉంటారు.. కానీ తెలుగుదేశం పార్టీకి మాత్రం కుటుంబ సభ్యులు ఉంటారన్నారు. కార్యకర్తలను చూస్తే కుటుంబ సభ్యులను చూసినట్లుగా ఉంటుంది. హైదరాబాద్‌లో, మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో కుటుంబ సభ్యులకు మాదిరిగా కార్యకర్తలకు అధినేత చంద్రబాబు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యకర్తే మా అధినేత. నాయకులు వస్తారు, వెళ్తారు. టీడీపీకి కార్యకర్తలే బలం. అంజిరెడ్డి తాత, మంజుల, తోట చంద్రయ్యలే నాకు స్ఫూర్తి. ఫ్యాక్షన్ దాడిలో చనిపోయిన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాం. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కేసులు పెట్టించుకున్నాం. టీడీపీ కార్యకర్తలు, నేతలపై నమోదు చేసిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చెప్పా. 175 స్థానాల్లో 164 స్థానాలు కైవసం చేసుకున్నాం. వై నాట్ 175 అన్నవారు టీం 11కే పరిమితమయ్యారని మంత్రి లోకేష్ గుర్తు చేశారు.

## ఏపీకి బ్రాండ్ చంద్రబాబు

అహంకారం వద్దు. కష్టపడి పనిచేయాలి. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రూ.4వేల వృద్ధాప్య పెన్షన్ చెల్లిస్తున్నాం. వికలాంగులకు రూ.6వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15వేలు చెల్లిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ. తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ సాయం అందించాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నాం. ఇచ్చిన ప్రతి హామీ కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియ పూర్తిచేసి 16వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. 6వేల మందిని కానిస్టేబుళ్లుగా నియమించాం. ఎప్పుడూ లేనివిధంగా పెట్టుబడులు వస్తున్నాయి. ఏపీకి బ్రాండ్ సీఎం చంద్రబాబునాయుడు. జూనియర్లు, సీనియర్లను సమానంగా గౌరవిస్తాం. పనిచేసే వారినే ప్రోత్సహిస్తామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## బెదిరింపులే జగన్ రెడ్డి నైజం

బాగా పనిచేసిన వారిని నామినేటెడ్, పార్టీ పదవులతో పైకి తీసుకువెళతాం. పార్టీ శాశ్వతం. టీడీపీని భూస్థాపితం చేస్తామని కొంతమంది ప్రగల్భాలు పలికారు. తెలుగుజాతి ఉన్నంత వరకు టీడీపీ ఉంటుంది. రాష్ట్రంలో ఒక సైకో ఉన్నాడు. అరెస్ట్ చేస్తానంటున్నాడు. 53 రోజులు మా నాయకుడిని ఇదే రాజమండ్రి జైలులో బంధించి ఏం సాధించారు? మీరు అరెస్ట్ చేస్తే మేం భయపడాలా? నీ కంటే ముందు చాలా మంది పెద్దపెద్ద మాటలు మాట్లాడారు. వారందరి పరిస్థితి ఏమైందో ఆలోచించాలి. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని ఎవరినీ కూటమి ప్రభుత్వం వదిలిపెట్టదు. పార్టీ నేతలు అలక వీడాలి. సమస్యలు ఏమైనా ఉంటే కలిసికట్టుగా పరిష్కరించుకోవాలని మంత్రి లోకేష్ హితవు పలికారు.

## చరిత్ర సృష్టించాలన్నా, తిరిగి రాయాలన్నా టీడీపీతోనే సాధ్యం

కుప్పం, హిందూపురం నియోజకవర్గాలు టీడీపీ కంచుకోటలు. ఆ చరిత్ర మనం తిరగరాయాలి. కంచుకోట అంటే మంగళగిరి, రాజమండ్రి అనే విధంగా చరిత్ర తిరగరాయాలి. చరిత్ర సృష్టించాలన్నా, తిరిగి రాయాలన్నా టీడీపీతోనే సాధ్యం. 2019లో ఇక్కడ నుంచి భవానీని గెలిపించారు. కష్టకాలంలో వారు మాకు అండగా నిలబడ్డారు. శాసనసభ సాక్షిగా మా తల్లిని అవమానించినట్లుగానే భవానీని కూడా అవమానించారు. ఎన్నో ఇబ్బందులు పెట్టారు. అయినా జై తెలుగుదేశం నినాదానికి ఆదిరెడ్డి కుటుంబం కట్టుబడి ఉందని మంత్రి లోకేష్ చెప్పారు.

## ఎమ్మెల్యే సవాల్‌ను స్వీకరిస్తున్నా

పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను తూచా తప్పకుండా అమలుచేయాలి. ఆయా కార్యక్రమాలను మై టీడీపీ యాప్ ద్వారా నమోదు చేయాలి. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో నేతలు పాల్గొనాలి. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి. వారితో మమేకం కావాలి. మంగళగిరితో పోటీ పడతామని స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. ఈ సవాల్‌ను నేను స్వీకరిస్తున్నా. ప్రజలతో ఆత్మీయంగా ఉంటూ వారితో మమేకం కావాలి. ప్రేమతో వారి మనసులను గెలుచుకోవాలని మంత్రి లోకేష్ అన్నారు.

## అండగా ఆదిరెడ్డి కుటుంబం

53 రోజుల పాటు చంద్రబాబుని జైలులో అక్రమంగా బంధిస్తే ఆదిరెడ్డి కుటుంబం మాకు అండగా నిలిచింది. దీనిని జీవితాంతం గుర్తుపెట్టుకుంటా. అందరికీ రుణపడి ఉంటా. అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును నా కుటుంబ సభ్యుడిలా భావిస్తా. కూటమి పార్టీల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తారు. అలాంటి కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలి. కూటమి మధ్య నో క్రాస్ ఫైర్, నో మిస్ ఫైర్, నో విడాకుల్. వచ్చే 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వం ఉంటుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి పథాన నిలుపుతాం. నాడు, నేడు, ఎప్పుడూ ఆదిరెడ్డి కుటుంబం ఏవిధంగా మాకు అండగా నిలబడిందో, అదే విధంగా తెలుగుదేశం పార్టీ కూడా ఆదిరెడ్డి కుటుంబానికి అండగా నిలబడుతుందని మంత్రి లోకేష్ చెప్పారు.

ఈ కార్యక్రమంలో రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జోనల్ కోఆర్డినేటర్ సుజయ్ కృష్ణ రంగారావు, నియోజకవర్గ పరిశీలకులు బి.వెంకటకృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.





















# సంస్కరణల సారథికి సముచిత గౌరవం

రాజకీయాల్లో ఒడిదుడుకులు సాధారణం. కానీ అభివృద్ధి పట్ల నిబద్ధత ఉంటే విజయం తప్పదని చంద్రబాబు నాయుడు మరోసారి నిరూపించారు. 2024 జూన్‌లో బాధ్యతలు చేపట్టిన కొద్ది నెలల్లోనే ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చడంలో చూపిన చొరవను గుర్తించి 'ఎకనామిక్ టైమ్స్' సంస్థ ఆయన్ని 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు ఎంపిక చేసింది. అవార్డు ఎంపిక కోసం సునీల్ భారతీ మిట్టల్ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి జ్యూరీ సమావేశమైంది. ఇందులో సజ్జన్ జిందాల్ (JSW), ఉదయ్ కోటక్, నోయెల్ టాటా (టాటా ట్రస్ట్స్), డాక్టర్ దేవి శెట్టి వంటి పరిశ్రమల నేతలు సభ్యులుగా పాల్గొన్నారు. వీరంతా ఏకగ్రీవంగా చంద్రబాబు నాయుడిని ఆధునిక సంస్కరణల చిహ్నంగా గుర్తించారు.

### ఆర్థిక పునరుత్థానం

గత ప్రభుత్వ కాలంలో మందగించిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వేగంగా గాడిలో పెట్టిన చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, రాష్ట్రం 2025-26 రెండో త్రైమాసికంలో (Q2) 11.2% వృద్ధి రేటును సాధించింది. ఇది జాతీయ సగటు (8.7%) కంటే 2.5% అధికం. పారిశ్రామిక రంగం 13.5% వృద్ధితో రాణించింది. పెట్టుబడుల వర్షంపాలసీ స్థిరత్వం పెరగడంతో పరిశ్రమలలో నమ్మకం బలపడింది. ప్రభుత్వ మూలధన వ్యయం పెరగడం, అమరావతి, పోలవరం, పారిశ్రామిక కారిడార్లపై భారీ నిధులు కేటాయించడం ఆర్థిక చలనం సృష్టించింది.

MSME పార్కులు స్థానిక ఉపాధిని పెంచి వినియోగాన్ని వేగవంతం చేశాయి. 2024-25లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.8.65 లక్షల కోట్లుగా ఉండగా, 15% వృద్ధి లక్ష్యంతో రూ.10 లక్షల కోట్ల మైలురాయిని చేరుకోవడమే లక్ష్యం.

### స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్

చంద్రబాబు నాయుడు కొత్త నినాదాన్ని తీసుకువచ్చారు - 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'. గతంలో 60 - 90 రోజులు పట్టే పారిశ్రామిక అనుమతులు ఇప్పుడు కేవలం 21 రోజుల్లోనే లభిస్తున్నాయి. సెల్ఫ్ సర్టిఫికేషన్ ద్వారా తక్షణ పనులు మొదలుపెట్టే అవకాశం. ఎస్క్రో అకౌంట్లు - పెట్టుబడిదారులకు రాయితీల భరోసా. సింగిల్ విండో 2.0 - అన్ని అనుమతులు ఒకే ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా. మౌలిక సదుపాయాలు - పరిశ్రమలకు తక్షణ భూమి, విద్యుత్, నీటి వసతి. ఇవన్నీ పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచాయి. గతంలో వెళ్లిపోయిన కంపెనీలు తిరిగి రాష్ట్రం వైపు చూస్తున్నాయి.



### పెట్టుబడిదారుల రీ-ఎంట్రీ

లూలూ గ్రూప్ విశాఖలో మళ్ళీ భారీ మాల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి సిద్ధపడింది. టాటా గ్రూప్ 20కి పైగా ప్రాజెక్టులతో ముందుకు వస్తోంది. రిలయన్స్ గ్రీన్ ఎనర్జీలో భారీ పెట్టుబడులతో ముందుకువస్తుంది. గూగుల్ విశాఖపట్నంలో ఐటీ కార్యకలాపాల విస్తరణ చేపడుతోంది. పెట్టుబడిదారుల మాటల్లో: "చంద్రబాబు గారు ఒకసారి ఇచ్చిన హామీ నుంచి వెనక్కి వెళ్లరు." ఇది ఆయనపై పారిశ్రామికవేత్తలకు ఉన్న నమ్మకానికి నిదర్శనం.

### అమరావతి - అభివృద్ధి చోదకశక్తి

చంద్రబాబు విజన్‌లో అమరావతి కేవలం రాజధాని కాదు ౹ అది ఒక ఆర్థిక కేంద్రం. కొత్త రహదారులు, రింగ్ రోడ్లు, కనెక్టివిటీ ప్రాజెక్టులు విజయవాడ, గుంటూరును మెట్రోపాలిటన్‌గా మార్చుతున్నాయి. రాజధాని పనులు తిరిగి ప్రారంభమవడంతో సిమెంట్, స్టీల్, రవాణా రంగాల్లో ప్రాణం పోయింది. వేలాది కార్మికులు ఉద్యోగాలు పొందుతున్నారు. ప్రపంచ బ్యాంక్, ADB రూ.15,000 కోట్ల రుణం ఆమోదించడం రాష్ట్రంపై అంతర్జాతీయ సంస్థలకు గల నమ్మకానికి నిదర్శనం. అమరావతి అభివృద్ధి వల్ల రైతుల భూముల విలువ పెరిగి, వారి ఆర్థిక స్థితి మెరుగవుతోంది. "నగరం పెరిగితే ఆదాయం పెరుగుతుందిబీ ఆదాయం పెరిగితే పేదరికం తగ్గుతుంది" అనేది చంద్రబాబు నేతృత్వంలోని కొత్త సిద్ధాంతం. హైదరాబాద్ 'హైటెక్ సిటీ' ఎలాగైతే తెలంగాణ అభివృద్ధికి చిహ్నమయ్యిందో, రేపు అమరావతి ఆంధ్రప్రదేశ్‌కు అదే స్థానం తీసుకొస్తుంది.

### ఆ అవార్డు రాష్ట్రానికి గౌరవం

చంద్రబాబు నాయుడు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు అందుకోవడం కేవలం వ్యక్తిగత గౌరవమే కాదు ౹ అది ఆంధ్రప్రదేశ్ సంస్కరణల విజయగాథకు చిహ్నంగా నిలిచే సంఘటన. గత ప్రభుత్వం అనాలోచిత విధానాలతో రాష్ట్రాన్ని 30ఏళ్లు వెనక్కి తీసుకు వెళితే, చంద్రబాబు గారు కేవలం 18 నెలల్లో ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించి అభివృద్ధి దిశగా పరుగులు తీయిస్తున్నారు. అభివృద్ధి అనేది చట్టాల మార్పే కాదు, పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని నింపడం అని ఆయన నిరూపించారు. త్వరలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన స్వీకరించనున్నారు.

**- ఎస్పీ సాహెబ్,**
**టిడిపి అధికార ప్రతినిధి.**

# రహేజాపై రాకాసి మూకల రాజకీయ కుట్ర

*ఆంధ్రప్రదేశ్.. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్' బిజినెస్ విధానంతో దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తోంది. పారదర్శక వ్యవస్థలు, వేగవంతమైన అనుమతులు, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలవల్ల అనేక పెద్ద సంస్థలు ఆంధ్రప్రదేశ్‌వైపు చూస్తున్నాయి. కానీ, ఈ పెట్టుబడి తరంగాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా వైసీపీ కుట్రలు పన్నుతోంది. ప్రభుత్వం తీసుకొచ్చిన పెట్టుబడి అనుకూల విధానాల వల్ల రాష్ట్రానికి అంతర్జాతీయస్థాయి కంపెనీలు క్యూ కడుతున్నాయి. యువతకు ఉద్యోగాలు, రాష్ట్రానికి ఆదాయం, ప్రాంతాలకు అభివృద్ధి అనే స్పష్టమైన లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుంటే, వైసీపీ మాత్రం అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలను ఎంచుకుంది. కోర్టులను వేదికగా చేసుకుని పెట్టుబడులపై తూటాలు పేల్చడమే వారి ఏకైక అజెండాగా మారింది.*

### కోర్టులో పిటిషన్‌లతో పెట్టుబడులపై తూటాలు

*ప్రభుత్వం ఏ సంస్థకు భూమి కేటాయించినా వెంటనే కోర్టుల్లో పిటిషన్‌లు వేయడం వైసీపీ నేతల సాధారణ వ్యవహారంగా మారింది. గతంలో టీసీఎస్, కాగ్నిజెంట్‌వంటి ప్రపంచ ప్రఖ్యాత ఐటీ దిగ్గజాలకు ఎకరా 99 పైసల చొప్పున భూమి కేటాయింపులపై హైకోర్టును ఆశ్రయించి, చివరకు న్యాయస్థానం చేత మొట్టికాయలు వేయించుకుంది. పెట్టుబడులను ఆకర్షించేందుకు తక్కువ ధరకే భూములు కేటాయించడం తప్పు కాదని, ఇది వ్యాపార లాభం కోసం కాకుండా యువతకు ఉద్యోగాలు కల్పించాలనే సదుద్దేశంతో తీసుకున్న విధానమని హైకోర్టు స్పష్టంగా చెప్పింది. అయినా వైసీపీ తన తీరు మార్చుకోలేదు. కోర్టుల్లో కేసులు వేసి పెట్టుబడులను ఆలస్యం చేయడం, సందేహాలు సృష్టించడం, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెడితే ఇలాగే ఇబ్బందులు పడతారనే తప్పుడు సంకేతాలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలనే యోచనలో ఉన్న ఇతర కంపెనీలకు పంపడం వారి రాజకీయ వ్యూహంగా మారింది. ఇది రాష్ట్ర భవిష్యత్‌ను, యువత ఆశలను లక్ష్యంగా చేసుకొని వైసీపీ చేస్తున్న దాడి మాత్రమే.*

### రహేజా ఐటి పార్క్ లక్ష్యంగా రాజకీయ కుట్ర


*ఇప్పుడు అదే కుట్ర విశాఖ మధురవాడలో నిర్మించబోయే రహేజా ఐటి పార్క్‌పై పన్నుతోంది వైసీపీ. హైదరాబాద్‌లో మైండ్ స్పేస్ తరహా అత్యాధునిక ఐటి పార్క్‌ను విశాఖలో నిర్మించేందుకు రహేజా సంస్థ ముందుకు రావడం రాష్ట్రానికి గర్వకారణం. రూ.2,712 కోట్ల పెట్టుబడితో ఐటి పార్క్ నిర్మించేందుకు సంస్థ సిద్ధమైంది.*

*ఈ ప్రాజెక్టులు గ్రౌండ్ అయితే ప్రత్యక్షంగానే 10 వేలమందికి పైగా యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. పన్నుల రూపంలో ప్రభుత్వానికి భారీ ఆదాయం వస్తుంది. వీరు నిర్మించబోయే ఐటి పార్కుల్లో అనేక ఐటి కంపెనీలు వస్తాయి. పెట్టుబడులు పెరుగుతాయి, తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు అందుతాయి. విశాఖ ఐటి హబ్‌గా మారుతుంది. చుట్టుపక్కల ప్రాంతాల్లో హాస్టళ్లు, షాపులు, వాణిజ్య సముదాయాలు ఏర్పడి పరోక్షంగా వేలమందికి ఉపాధి దొరుకుతుంది. ఇలాంటి ప్రాజెక్టుకు ప్రభుత్వం మధురవాడలో 27 ఎకరాలను ఎకరా 99 పైసల చొప్పున కేటాయించింది. కానీ దీనిని తట్టుకోలేని వైసీపీ నేతలు రహేజా సంస్థను రియల్ ఎస్టేట్ సంస్థ అంటూ దుష్ప్రచారం చేస్తూ, కోర్టులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు.*

*వాస్తవానికి హైదరాబాద్‌లో రహేజా సంస్థ వంద ఎకరాల్లో విస్తరించి ఉంది. వీరు నిర్మించిన మైండ్ స్పేస్‌లో 'మారియట్ ఇంటర్నేషనల్' గ్రూప్‌కు చెందిన వెస్టిన్ 5 స్టార్ హోటల్ మినహా మిగిలినవన్నీ ఐటి కంపెనీలే. డెల్, ఐబిఎం, బ్యాంక్ ఆఫ్ అమెరికావంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు అక్కడే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పుడు అదే మోడల్‌ను విశాఖకు తీసుకురావడమే రహేజా లక్ష్యం. ఈ ప్రాజెక్టు గ్రౌండ్ అయితే ప్రపంచస్థాయి కంపెనీలు విశాఖకు వస్తాయన్న భయంతోనే తాడేపల్లి ప్యాలెస్‌లో పన్నిన రాజకీయ పన్నాగమే హైకోర్టు పిటిషన్‌గా మారింది. అభివృద్ధి జరిగితే తమ రాజకీయాలు వెలవెలబోతాయన్న ఆందోళనతోనే వైసీపీ ఈ విధంగా వ్యవహరిస్తోంది.*

*గతంలో తన తండ్రిపై సినిమా తీసిన డైరెక్టర్‌లకు ఉచితంగా జగన్ భూములిచ్చారు. జగన్ సీఎం అవ్వాలని పూజలు చేసిన గురువులకూ తక్కువ ధరకే విలువైన భూములు కేటాయించారు. కాని, యువత భవిష్యత్‌ను బంగారుమయం చేసే సంస్థలకు చంద్రబాబు భూములు కేటాయిస్తే మాత్రం సహించలేక.. అడ్డం పడటాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునే ఈ కుట్ర రాజకీయాలకు న్యాయస్థానాలు మరోసారి స్పష్టమైన సమాధానం చెప్పడం ఖాయం. ఇప్పటికే ఒకసారి చెంపదెబ్బ తిన్నా బుద్ధిరాక, మళ్లీ అదే దారిలో నడవడానికి సిద్ధమవుతున్న వైసీపీ నేతల వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. అభివృద్ధిని ఆపలేరు, యువత భవిష్యత్‌ను అడ్డుకోలేరు!*

# అగాధంనుంచి ఆకాశానికి వ్యవ'సాయం'




*ఆంధ్రప్రదేశ్ చరిత్రలో 2024 జూన్ ఒక చారిత్రాత్మక మలుపు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో పడింది. అప్పుల ఊబిలో కూరుకుపోయి,అభివృద్ధి అనే పదం వినిపించలేదు. రైతులు కూడా పంటలకు సరైన మద్దతులేక, రుణాలు అందక అనేకసమస్యలతో కష్టపడే పరిస్థితి వచ్చింది. పంట నష్టాలు, మార్కెట్‌లో అనిశ్చితివల్ల రైతుల జీవితాన్ని నరకంగా మార్చాయి.*

*2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రం మళ్లీ ప్రాణం పోసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అనుభవం, నారా లోకేష్ పారిశ్రామిక వేగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ ఇచ్చింది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన రైతులను కూటమి ప్రభుత్వం అక్కున చేర్చుకుంది. వారికి అందాల్సిన పంటల బీమా, రుణాలు అందించడంవంటి చర్యలతో వ్యవసాయం పూర్వవైభవం సంతరించుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2024-25 ఆర్థిక గణాంకాల ప్రకారం వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం చీకటిలో మగ్గినట్టు చెప్పకనే చెప్పింది.*

## ఆర్థిక పురోగతి.. తలసరి ఆదాయంలో భారీ పెరుగుదల

జగన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం 'అప్పుల ఆంధ్ర'గా మారి, సామాన్యుడి ఆదాయం పడిపోయింది. కానీ కూటమి ప్రభుత్వం రాగానే ఆ పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. 2023-24లో జగన్ పాలనలో రాష్ట్ర తలసరి ఆదాయం కేవలం రూ.2,19,917 వద్ద ఆగిపోగా, చంద్రబాబు రాకతో ఏకంగా రూ.2,66,240కి పెరిగింది. ఇది కేవలం అంకె కాదు, ప్రతి సామాన్యుడి ఆర్థిక స్థితి మెరుగుపడిందనడానికి నిదర్శనం. ప్రస్తుత ధరలవద్ద ఏపీ జీఎస్‌డీపీ రూ.15.93 లక్షల కోట్లకు చేరింది. రాష్ట్ర నికర ఉత్పత్తి ప్రస్తుత ధరల్లో రూ.14.22 లక్షల కోట్లుగా ఉండి, రాష్ట్ర ఆర్థిక స్థిరత్వాన్ని చాటుతోంది.

## అగ్రికల్చర్‌లో 'అగ్రపథం': జాతీయ సగటుకంటే 6 రెట్లు వేగంగా..

ఆంధ్రప్రదేశ్ అంటేనే ఒకప్పుడు అన్నపూర్ణ. కానీ గత వైసీపీ పాలనలో విత్తనాల కోసం క్యూ లైన్లలో రైతుల మరణాలు, నకిలీ ఎరువుల బెడద, గిట్టుబాటు ధరలేక రైతులు రోడ్డున పడ్డారు. కూటమి ప్రభుత్వం రాగానే అరాచక పాలనను తుడిచిపెడుతూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వ్యవసాయ వృద్ధి రేటు కేవలం 1.8శాతంగా ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో ఏకంగా 10.70శాతంగా నమోదైంది. అంటే జాతీయ సగటుకంటే దాదాపు 6రెట్లు వేగంగా ఏపీ ప్రగతి సాధించింది. కేవలం బటన్లు నొక్కితే సరిపోదని, సంపద సృష్టించి రైతులకు మౌలిక వసతులు కల్పిస్తేనే నిజమైన ప్రగతి సాధ్యమని కూటమి ప్రభుత్వం నిరూపించింది.

## రికార్డుస్థాయిలో వరి సాగు - పత్తి రైతు ఇంట సిరిసంపదలు

గత ప్రభుత్వ హయాంలో సాగు నీరులేక వరి రైతులు వలస వెళ్లే పరిస్థితి దాపురించింది. కాని కూటమి ప్రభుత్వం రాగానే విత్తనాలు, ఎరువుల సరఫరాలో రాజకీయ జోక్యాన్ని తొలగించి పారదర్శకత తెచ్చింది. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా 20.77 లక్షల హెక్టార్లలో వరి సాగు జరగ్గా, ఉత్పత్తి 24శాతం పెరిగి 2.93 లక్షల టన్నులనుంచి 3.64 లక్షల టన్నులకు చేరింది. మొత్తం బియ్యం ఉత్పత్తి 81.59 లక్షల టన్నులుగా నమోదైంది. అలాగే పత్తి ఉత్పత్తి గతంలో 737 వేల బేల్స్ ఉంటే, ఇప్పుడు 31శాతం వృద్ధితో 1131 వేల బేల్స్‌కు చేరింది. రాష్ట్రవ్యాప్తంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి 1.17 కోట్ల టన్నులకు చేరి రాష్ట్ర ఆహార భద్రతను పటిష్టం చేసింది.

## ఉద్యానవన పంటల్లో 'నెంబర్ వన్'.. పండ్ల భాండాగారంగా ఏపీ!

జగన్‌రెడ్డి అస్తవ్యస్త పాలనలో ఏపీ రైతు కన్నీరు పెడితే, నేడు కూటమి ప్రభుత్వం అందిస్తున్న భరోసాతో ఉద్యానవన పంటలు సిరిసంపదలు కురిపిస్తున్నాయి. దేశంలోనే ఉద్యానవన హబ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి సంకల్పం నేడు క్షేత్రస్థాయిలో నిజమవుతోంది. భారతదేశంలో పండ్ల ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న మహారాష్ట్రను సైతం వెనక్కినెట్టి ఏపీ 1.93కోట్ల టన్నుల ఉత్పత్తితో దేశంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. మహారాష్ట్ర 1.68కోట్ల టన్నులకే పరిమితమైంది. అరటి సాగులో ఎన్నడూ లేనివిధంగా 151శాతం అద్భుత వృద్ధి నమోదు కావడం కూటమి ప్రభుత్వ పాలనా దక్షతకు నిదర్శనం. కూరగాయల ఉత్పత్తి కూడా 6,345 వేల టన్నుల నుంచి 8,310 వేల టన్నులకు పెరిగి సామాన్యుడికి ఊరటనిస్తోంది.

## నీలి విప్లవం - పశుసంవర్ధక శాఖలో దేశంలోనే అగ్రస్థానం!

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలైన మత్స్య, పశుసంవర్ధక రంగాలు నేడు కూటమి ప్రభుత్వ సారథ్యంలో సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. గత వైసీపీ పాలనలో ఆక్వా రైతులు ఎదుర్కొన్న కష్టాలు వర్ణనాతీతం. విద్యుత్ ఛార్జీల పెంపు, నాణ్యమైన మేత దొరక్కపోవడం, దళారీల దోపిడీతో ఆక్వారంగం విలవిలలాడింది. కానీ, సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టగానే ఆక్వా, పాడి రైతులకు భరోసానిస్తూ తీసుకున్న నిర్ణయాలు నేడు అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయి. ఏపీ నేడు కేవలం రాష్ట్రానికే కాదు, దేశానికే 'మత్స్య భాండాగారం'గా అవతరించింది. చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ 51.58 లక్షల టన్నులతో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. మనతో పోటీ పడే పశ్చిమ బెంగాల్ (22 లక్షల టన్నులు) మనకంటే చాలా వెనుకబడి ఉంది. రొయ్యల ఉత్పత్తిలో 27శాతం వృద్ధి నమోదై 6.95 లక్షల టన్నులకు చేరింది. పశుసంవర్ధక శాఖలో మాంసం ఉత్పత్తి 8శాతం, కోడిగుడ్ల ఉత్పత్తి 6.7శాతం వృద్ధి సాధించాయి. జగన్‌రెడ్డి హయాంలో ఆక్వా జోన్ల పేరుతో సృష్టించిన గందరగోళాన్ని తొలగించి రైతులకు అండగా నిలవడమే ఈ విజయానికి కారణం.

## లక్ష్యం దిశగా.. అప్రమత్తంగా!

2025-26 నాటికి వ్యవసాయ అనుబంధ రంగాల్లో 16.47శాతం వృద్ధి రేటుతో రూ.6,02,278 కోట్ల భారీ జీవీఏ సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి ఆరు నెలల్లోనే రూ.2,07,073 కోట్లు (34.36శాతం) సాధించి రికార్డు సృష్టించింది. మిగిలిన ఆరు నెలల్లో రూ.3,95,655 కోట్ల జీవీఏ సాధించేలా అధికారులను ముఖ్యమంత్రి పరుగులు పెట్టిస్తున్నారు.

జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అంధకారంలో ఉంటే, చంద్రబాబు విజన్ రాష్ట్రానికి వెలుగులు తెచ్చింది. సంక్షేమం అంటే కేవలం అప్పులు తెచ్చి బటన్ నొక్కి కాదు.. సంపద సృష్టించి ప్రతి రైతు తలసరి ఆదాయాన్ని పెంచడమే అసలైన సంక్షేమం అని కూటమి ప్రభుత్వం నిరూపించింది. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు కాగా, సుపరిపాలనకు అర్థం కూటమి ప్రభుత్వం అన్నది నేడు జగమెరిగిన సత్యం. అబద్ధపు ప్రచారాలు చేసే వారికి రైతులు సాధించిన ఈ అద్భుత విజయాలే బలమైన సమాధానం!

- తోట నిర్మలాజ్యోతి,
అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

# అమరవీరులను స్మరించుకుందాం

**- హెంమంత్రి వంగలపూడి అనిత**

**- లోక్‌భవన్‌లో సాయుధ దళాల జెండా దినోత్సవం**

అమరావతి (చైతన్యరథం): దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకుందామని స్మరించుకుందామని రాష్ట్ర హెంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడలోని లోక్ భవన్‌లో సాయుధ దళాల జెండా దినోత్సవం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, హెంమంత్రి అనిత హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై రూపొందించిన 'మన మార్గదర్శి' పుస్తకాన్ని గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి మంత్రి అనిత ఆవిష్కరించారు. అనంతరం మంత్రి అనిత మాట్లాడుతూ సాయుధ దళాల జెండా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ సమక్షంలో మాట్లాడే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇది సాధారణ కార్యక్రమం కాదు. మన దేశానికి ప్రాణాలర్పించిన సైనికులను గుర్తు చేసుకునే రోజు. వారికి మనం కృతజ్ఞతలు చెప్పుకునే రోజు. భారత్ సాయుధ దళాలు ప్రపంచంలోనే అత్యంత క్రమశిక్షణ గల, ధైర్య సాహసాలతో కూడిన దళాలు. మన సైనికుల బలం కేవలం ఆయుధాల్లో కాదు. వారి ధైర్యంలో ఉంది. అత్యంత కఠిన వాతావరణ పరిస్థితులు కూడా దేశ రక్షణ కోసం అప్రమత్తంగా ఉంటారు. కేవలం యుద్ధాల్లోనే కాకుండా భూకంపాలు, వరదలు, తుఫాన్లు కొండ చర్యలు విరిగినప్పుడు ముందుగా అక్కడికి చేరేది మన సాయుధ దళాలే. మన దేశ ప్రజలు



ప్రశాంతంగా జీవించగలుగుతున్నామంటే దానికి కారణం మన సైనికులు త్యాగమే. చాలామంది సైనికులు సంవత్సరాల తరబడి తమ కుటుంబాలకు దూరంగా ఉంటారు. కొంతమంది సైనికులు దేశం కోసం తమ ప్రాణాలు సైతం త్యాగం చేశారు. ప్రాణాలర్పించిన సైనికుల కుటుంబాలు, యుద్ధంలో గాయపడిన సైనికుల కుటుంబాలకు అండగా నిలవడం మనందరి బాధ్యత. సాయుధ దళాల జెండా నిధికి విరాళం ఇస్తున్న వారికి కృతజ్ఞతలు. భారత ప్రభుత్వం మన సైనికుల సంక్షేమానికి ఎప్పటికీ ప్రాధాన్యత ఇస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సైనిక్ సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, 10 కోట్ల కార్పస్ నిధిని కేటాయించింది. జూన్ 2024 నుండి ఇప్పటివరకు మరణించిన రక్షణ సిబ్బంది కుటుంబాలకు చెందినవారిలో అర్హులకు మొత్తం 13 కారుణ్య నియామకాలు చేసాం. గసైనికుల సంక్షేమంపై గవర్నర్ చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధకు మంత్రి అనిత కృతజ్ఞతలు తెలిపారు. కాగా దేశ రక్షణలో సేవలందించిన వారిని, సాయుధ దళాల పతాక దినోత్సవ విరాళాలు అత్యధికంగా సేకరించిన కలెక్టర్లు, జిల్లా సైనిక సంక్షేమ అధికారులను ఈ సందర్భంగా గవర్నర్ సత్కరించారు.

**గుంటూరు కలెక్టర్‌కు అభినందనలు**

సాయుధ దళాల పతాక నిధికి రాష్ట్రంలోనే అత్యధికంగా నిధులు సేకరించినందుకు గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రశంసించారు. గుంటూరు జిల్లా నుండి రూ.17,67,363 సాయుధ దళాల పతాక నిధికి సేకరణ జరిగి ప్రథమ స్థానంలో నిలిచింది. బాపట్ల, తూర్పు గోదావరి జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచాయి. ఈ మేరకు శుక్రవారం లోక్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు గవర్నర్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెంంశాఖ మంత్రి వంగలపూడి అనిత, బాపట్ల, తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్ లు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్. గుణశీల తదితరులు పాల్గొన్నారు.

### వృథా జలాలు వాడుకుంటామంటే

# అభ్యంతరం ఎందుకు?

**- ఢిల్లీలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**

న్యూఢిల్లీ (చైతన్యరథం): బంగాళాఖాతంలో కలిసిపోతున్న గోదావరి వృథా జలాలను దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ వాడుకుంటామంటే ఎవరికి ఏ అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ఆయన కేంద్ర జల్‌శక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశం అయ్యారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు, వివిధ ప్రాజెక్టులకు నిధుల విడుదలపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించి, పలు విజ్ఞప్తులు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేకించి విభజన హామీల్లో భాగంగా ఆమోదం పొందిన ప్రాజెక్టులకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని కేంద్రమంత్రిని కోరామన్నారు. పెండింగ్ అంశాలపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని అడిగినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు నీటి భద్రత అత్యంత కీలక అంశమని, రాష్ట్రంలో సాగునీటి-తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టులపై కేంద్ర-రాష్ట్ర సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

**రెండు రాష్ట్రాలూ బాగుండాలనేదే సీఎం చంద్రబాబు ఆలోచన**

ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు జరపాలని, గోదావరి, వంశధార బోర్డుల నిబంధనలకు అనుగుణంగా అనుమతులిచ్చి సత్వర పూర్తికి సహకరించాలని కోరినట్లు రామానాయుడు చెప్పారు. గోదావరి నదీ జలాల వినియోగానికి సంబంధించి వివాదం విషయంలో తమకు పెద్దగా ఆసక్తి లేదన్నారు. ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రజలు బాగుండాలనేదే మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన, ఆశయం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అంతర్గత రాజకీయ పరిస్థితుల నేపథ్యం కూడా ఈ వివాదానికి కొంత కారణమై ఉండవచ్చు అని రామానాయుడు అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం, సీతమ్మ సాగర్, తదితర ప్రాజెక్టుల నిర్మాణ విషయంలో ఏపీ ప్రభుత్వం ఎప్పుడూ, అడ్డు పడలేదన్నారు. అలాంటప్పుడు దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ వృథా జలాలను వాడుకుంటామంటే సహకరించాల్సిన అవసరం ఉందని రామానాయుడు చెప్పారు. గడచిన 50 ఏళ్లలో 1.53 లక్షల టీఎంసీల గోదావరి వరద నీరు సముద్రం పాలైపోయిందని, గడచిన ఐదేళ్లలో 20,000 టీఎంసీల నీరు బంగాళాఖాతం పాలయిందన్నారు. ఎగువ రాష్ట్రాల్లో ప్రాజెక్టులు కడితే దిగువ రాష్ట్రం నష్టపోతుంది తప్పితే.. తెలంగాణ ఎడారి అవుతుంది అనడంలో అర్థం లేదని మంత్రి రామానాయుడు అన్నారు.

**నదుల అనుసంధానంతోనే..**

నదుల అనుసంధానంతోనే దేశం సస్యశ్యామలమవుతుందని దివంగత మాజీ ప్రధాని వాజ్ పేయి ఏనాడో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్నది కూడా అదే కార్యక్రమమని చెప్పారు. ఏటా సగటున మూడు వేల టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిసిపోతున్నాయని, అందులో కేవలం 200 టీఎంసీలు మాత్రమే తాము ప్రతిపాదించిన ప్రాజెక్టుకు సరిపోతుందన్నారు. ఈ ప్రతిపాదనకు తక్షణం అంగీకరించి అనుమతులు




ఇవ్వాల్సిన అవసరం ఉందని కేంద్ర జలశక్తి మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు రామానాయుడు చెప్పారు. పోలవరం జాతీయ ప్రాజెక్టులో వివిధ పనులకు సంబంధించి పెండింగులో ఉన్న అనుమతులు వెంటనే వచ్చేలా చూడాలని, 2011లో జారీ చేసిన స్టాప్‌వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా రద్దు చేయాలని, పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువ సామర్థ్యాన్ని ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా 17,500 క్యూసెక్కులకు పెంచి నిర్మిస్తున్నామని, అందుకు అయ్యే వ్యయాన్ని కూడా పోలవరం ప్రాజెక్టు ఖర్చులో చేర్చాలని కోరినట్లు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని కేంద్ర మంత్రికి సీఎం వివరించారన్నారు. వంశధార నది వివాదానికి సంబంధించి ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుల అమలు ఇంకా పూర్తిగా జరగడం లేదని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగుర్తు చేశారన్నారు. నేరడి బ్యారేజ్ నిర్మాణం శ్రీకాకుళం జిల్లాలోని కరువు ప్రాంతాల నీటి అవసరాలకు అత్యవసరమని తెలిపారు. దీనికి అనుమతులు మంజూరు చేయాలని కోరామన్నారు. ఆల్మట్టి ఎత్తు పెంపు వివాదం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున కర్నాటక ప్రభుత్వం దీనిపై ముందుకు వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం నిలువరించాలని పాటిల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరినట్లు జల వనరుల శాఖ మంత్రి రామానాయుడు వెల్లడించారు.

# జనం గడ్డి పెట్టినా జగన్ రెడ్డికి బుద్ధి రాలేదు

- **పీపీపీకి ప్రైవేటీకరణకు తేడా తెలుసుకోవాలి**
- **మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజం**
- **అభివృద్ధిని అడ్డుకుంటామంటే సహించేది లేదని హెచ్చరిక**
- **మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన మంత్రి**

మచిలీపట్నం (చైతన్యరథం): జనం గడ్డి పెట్టినా జగన్ రెడ్డికి ఇంకా బుద్ధి రాలేదని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుండి మంత్రి వినతులు స్వీకరించారు. పలువురి సమస్యలపై అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా నడచుకుంటే జగన్ రెడ్డిని ప్రజలు తరిమి తరిమి కొట్టడం తథ్యమన్నారు. మెడికల్ కాలేజీల అభివృద్ధిపై వైసీపీ నేతలు విషం చిమ్మాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఒకప్పుడు పీపీపీ పద్ధతిలో రోడ్లను అభివృద్ధి చేయడం



వల్లనే నేడు రాష్ట్ర వ్యాప్తంగా రవాణా సదుపాయం పెరిగింది. పరిశ్రమలు వచ్చాయి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరిగాయి. నాడు తీసుకున్న సంస్కరణల కారణంగానే ఇంత స్థాయిలో అభివృద్ధి జరిగింది. తర్వాత వచ్చిన పాలకులు అభివృద్ధిని కొనసాగించారు. కానీ నేడు జగన్ రెడ్డి వైఖరే విధ్వంసం. అధికారంలోకి వస్తే.. పీపీపీ పద్ధతిలో ఆస్పత్రుల అభివృద్ధికి ముందుకొచ్చిన కంపెనీల్ని తరుముతానని బెదిరించడం దుర్మార్గం. జగన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదు. కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ.. పీపీపీ విధానాన్ని సమర్థించింది. పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసినప్పటికీ.. అది ప్రభుత్వ ఆస్తిగానే ఉంటుంది. ఆస్పత్రిని నిర్మించి, నిర్వహించే బాధ్యతలు ప్రైవేటుకు ఇస్తుంటే ఎందుకింత ఏడుపు? మెడికల్ కాలేజీలను వీలైనంత త్వరగా పూర్తి చేయడం ద్వారా ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో విద్యార్థులకు సీట్లు పెరుగుతాయి. పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుంది. ఇంత మేలు జరుగుతున్నందున వాటిని అడ్డుకోవడమే లక్ష్యంగా జగన్ రెడ్డి వ్యవహరిస్తున్నాడు. దొంగ సంతకాలు పెట్టి గవర్నర్‌కి లేఖలిచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాడు. పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తే ప్రైవేటుపరం ఎందుకు అవుతుందో జగన్ రెడ్డి బుర్ర పెట్టి ఆలోచించాలి. ఐదేళ్లపాటు బెదిరింపు ధోరణితో పెట్టుబడులను, పారిశ్రామిక వేత్తల్ని తరిమేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు. కానీ నేడు సీఎం చంద్రబాబునాయుడి దూర దృష్టితో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి. ఆయన కార్యదక్షతకు నిదర్శనంగానే ఎకనమిక్ టైమ్స్ బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వచ్చిందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# జగన్ బతుకంతా ఫేక్ ప్రచారమే

- **పీపీపీకి మద్దతుగా ఢిల్లీలో సంతకాలు**
- **ఇక్కడ వీధుల్లో అబద్ధాల డ్రామాలు**
- **చెడ్డీల కంపెనీని తరిమేసిన జగన్ గూగుల్‌ని తెచ్చాడా**
- **యోగాంధ్రపైనా విషం చిమ్ముతారా?**
- **మాజీమంత్రి దేవినేని మండిపాటు**



అమరావతి (చైతన్యరథం): జగన్ బతుకంతా ఫేక్ ప్రచారమేనని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో దేవినేని మాట్లాడుతూ ఢిల్లీలో వైసీపీ ఎంపీలు చేసే నాటకాలు ఏంటో.. గల్లీలో జగన్ అబద్ధాలు ఏంటో అర్థం కావడం లేదని విమర్శించారు. మెడికల్ కాలేజీలు పీపీపీ విధానంలోనే నిర్మిస్తే బాగుంటుందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పేర్కొంది. వైసీపీ ఎంపీ గురుమూర్తి ఢిల్లీలో పీపీపీ విధానానికి అనుకూలంగా సంతకం చేశారు. విశాఖలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమం గురించి కేంద్ర క్యాబినెట్‌లో ప్రధాని మోదీ మెచ్చుకున్నారు. దానికి అయిన ఖర్చు రూ.60 కోట్లు. ఆ కార్యక్రమంపై కూడా జగన్ అసత్యాలు మాట్లాడుతున్నాడు. పరకామణి చోరీ కేసు చిన్నది అనడంతోనే దేవాలయాలు, హిందువులపై జగన్‌కు ఉన్న గౌరవం ఏంటో అర్థమవుతోంది. చెడ్డీల కంపెనీని పక్క రాష్ట్రాలకు తరి మేసిన జగన్.. గూగుల్‌ను తీసుకొచ్చాడనటం హాస్యాస్పదం. ఎన్నికల ఫలితాల తర్వాత జగన్మోహన్ రెడ్డి కేవలం బెంగళూరు ప్యాలెస్‌కే పరిమితమై, వారానికి రెండు రోజులు చుట్టపు చూపుగా ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నారనివిమర్శించారు. గతంలో తన సలహాదారులు చెప్పిన 175కి 175 సీట్లు వస్తాయనే భ్రమలో ఉండి, తీరా 11 సీట్లకు పరిమితమైనా ఆయనలో మార్పు రాలేదని ఎద్దేవా చేశారు. శాసనసభకు వచ్చి ప్రజల సమస్యలపై పోరాడే ధైర్యం లేక, అబద్ధాలతో కూడిన ప్రెస్ మీట్లు పెడుతూ కాలక్షేపం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాజాగా విజయవాడలో ఆయన చేసిన విన్యాసాల వల్ల సామాన్య ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులతో నరకం చూశారని మండిపడ్డారు. నాడు ఐదేళ్ల పరిపాలనలో శాసనసభకు వెళ్లాలన్నా, సెక్రటేరియట్‌కు వెళ్లాలన్నా వేలాది మంది పోలీసులను పెట్టి, అమరావతి మహిళల టెంట్ల ముందు పరదాలు కట్టుకుని వెళ్లిన పిరికి చరిత్ర జగన్‌ది. అలాంటి వ్యక్తి ఇవాళ తగుదునమ్మా అంటూ గవర్నర్ దగ్గరకు వెళ్తూ తన పెయిడ్ బ్యాచ్‌తో జిందాబాద్‌లు కొట్టించుకోవడం హాస్యాస్పదంగా ఉంది. పదవుల కోసం ఆరాటపడుతూ విష ప్రచారాలు చేస్తే ప్రజలు నమ్మరు. చంద్రబాబు ఇంట్లో పింక్ డైమండ్ ఉందని, దొంగిలించారని నాడు విషప్రచారం చేసి, చివరకు కోర్టులో చెంపలు వేసుకుని కేసు వెనక్కి తీసుకున్నది వాస్తవం కాదా? బెట్టింగుల్లో వ్యక్తి చనిపోతే కూడా రాజకీయ లబ్ధి కోసం తెలుగుదేశం పార్టీ మీద బురద జల్లిన చరిత్ర మీది. ఇవాళ పీపీపీ విధానంపై అబద్ధాలు చెబుతున్నారని దేవినేని దుయ్యబట్టారు.

## సమాధానం చెప్పే ధైర్యం ఉందా?

జిల్లా ఆసుపత్రులు, బోధనా ఆసుపత్రులు ప్రైవేటు భాగస్వామ్యంతో కలిసి పనిచేస్తేనే ప్రభుత్వాలపై భారం తగ్గుతుందని, తక్కువ ఖర్చుతో ఎక్కువ మంది వైద్య విద్యార్థులు తయారవుతారని కేంద్ర ప్రభుత్వం, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, నీతి ఆయోగ్ స్పష్టమైన సిఫారసులు చేశాయి. ఏకంగా 31 మంది ఎంపీలు దీనికి మద్దతుగా సంతకాలు చేశారు. పీపీపీ విధానానికి మద్దతుగా వైసీపీ ఎంపీ గురుమూర్తి ఢిల్లీలో సంతకం చేశారు. తిరిగి పీపీపీ విధానంపై తప్పుడు ప్రచారం చేయడానికి వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలో వైసీపీ ఎంపీలు కేంద్ర మంత్రి దగ్గరకు వెళ్తే, అక్కడ వారికి గడ్డి పెట్టారు. పార్లమెంటరీ స్థాయీ సంఘం నివేదికపై సంతకం పెట్టి, బయట నాటకాలు ఆడుతున్న జగన్ రెడ్డికి దీనిపై సమాధానం చెప్పే ధైర్యం ఉందా? ఇవాళ వైద్య విద్యలో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల పేరుతో ఫీజులు రూ. 12 లక్షల నుండి రూ. 25 లక్షల వరకు పెరిగాయంటే దానికి కారణం జగన్ రెడ్డి హయాంలో తెచ్చిన జీవోలే. సొంత నిర్ణయాలతో ఫీజులు పెంచి, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసిన జగన్, ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. గతంలో చంద్రబాబు నాయుడు పట్టుబట్టి మంగళగిరికి ఎయిమ్స్ ఆసుపత్రిని తీసుకువస్తే, ఐదేళ్ల కాలంలో దానికి కనీసం మంచినీళ్లు ఇవ్వడానికి కూడా జగన్ రెడ్డికి మనసు రాలేదు. చంద్రబాబుకి, కేంద్ర ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే కుట్రతోనే జగన్ అక్కడ కనీస సౌకర్యాలు కల్పించలేదు. ఇంత దుర్మార్గపు మనస్తత్వం ఉన్న వ్యక్తి ఇప్పుడు విద్యార్థులను ఉద్ధరిస్తానంటే ఎవరు నమ్ముతారని దేవినేని ప్రశ్నించారు.

## దిగజారుడు రాజకీయాలు

అత్యంత ఆధునికమైన వైద్యం అందించడానికి, వైద్య సీట్లు పెంచడానికి ప్రభుత్వం పీపీపీ విధానంతో ముందుకెళ్తుంటే, అడ్డంకులు సృష్టిస్తూ జగన్ రెడ్డి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాడు. ఆయన మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే ఎన్టీఆర్ వైద్యసేవ కింద దాదాపు రూ. 6,000 కోట్లు ఖర్చు చేసింది. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా గత 18 నెలల్లోనే 90 వేల మందికి పైగా బాధితులకు రూ. 900 కోట్ల నుండి రూ. 1,000 కోట్లు అందజేసి సీఎం చంద్రబాబు నాయుడు అండగా నిలిచారు. మరి ఐదేళ్ల జగన్ పాలనలో ఇలాంటి సాయం చేయడానికి ఎందుకు మనసు రాలేదని జనం నిలదీస్తున్నారు. 108, 104 సేవలు పీపీపీ విధానంలో నడుస్తున్నప్పుడు, ఇప్పుడు కొత్తగా మెడికల్ కాలేజీల విషయంలో పీపీపీ అంటే.. అమ్మేస్తున్నారు అని అబద్ధాలు చెప్పడం ఎంతవరకు సమంజసమని దేవినేని ధ్వజమెత్తారు.

## యోగాంధ్రపైనా విషం..

రాష్ట్రానికి జీవనాడి వంటి పోలవరం ప్రాజెక్టును జగన్ తన అహంకారంతో, తెలివితక్కువ నిర్ణయాలతో నాశనం చేశారు. రివర్స్ టెండరింగ్ పేరుతో సమయం వృథా చేసి, డయాఫ్రం వాల్ దెబ్బతినడానికి కారణమయ్యారు. ప్రాజెక్టును ఏళ్ల తరబడి వెనక్కి నెట్టారు. ఐదేళ్లు తాడేపల్లిలో ముక్కు మూసుకుని కూర్చున్న జగన్, ఇప్పుడు ప్రాజెక్టు పనులు పరుగులు పెడుతుంటే భరించలేక కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. విశాఖపట్నంలోని రుషికొండను బోడికొండగా మార్చి, తన కుటుంబం కోసం మూడు బ్లాకులు, కార్యాలయం కోసం మిగతా భవనాలు కట్టుకున్నారు. దీనికోసం దాదాపు రూ. 463 కోట్లు ప్రజాధనాన్ని ఖర్చు చేసి, ఇప్పుడు కేవలం రూ. 230 కోట్లే ఖర్చు అయిందని అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటు. బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చుని అమాయక ప్రజలను రెచ్చగొట్టాలని చూడటం జగన్ కుతంత్రాల్లో భాగమేనన్నారు. భారతీయ సంస్కృతికి ప్రతీక అయిన యోగాపై కూడా జగన్ తన కడుపుమంటను బయటపెట్టుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్‌ను యోగాంధ్రప్రదేశ్‌గా మార్చాలని సంకల్పించి, యోగా డేను ఇక్కడ నిర్వహించే అవకాశం ఇస్తే, దానిపై కూడా విషం చిమ్మడం దుర్మార్గమన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులతో మంత్రి లోకేష్ నేతృత్వంలో అద్భుతంగా యోగా కార్యక్రమాలు జరిగితే, వాటిపై అవాకులు చవాకులు పేలడం జగన్ అజ్ఞానానికి నిదర్శనమని దేవినేని విమర్శించారు.

## కడుపుమంటతో కుట్రలు


జగన్ రెడ్డి ఇప్పటికైనా తన అబద్ధాలను, విష ప్రచారాలను మానుకోవాలి. ప్యాలెస్ రాజకీయాలు ఇక సాగవు. 164 సీట్లతో కూటమిని ప్రజలు గెలిపించింది పరిపాలన చేయడానికి. కేవలం 11 సీట్లకే పరిమితమైన జగన్ రెడ్డికి అసలు ప్రశ్నించే హక్కు లేదు. శాసనసభకు వచ్చి చర్చించకుండా, బయట ఉండి ప్రభుత్వంపై అవినీతి, దోపిడీ అని అబద్ధాలు ప్రచారం చేయడం సిగ్గుచేటు. 16 నెలలు జైల్లో ఉండి, ఇప్పటికీ 23 కేసుల్లో ముద్దాయిగా ఉన్న జగన్, ఇతరులను జైలుకు పంపుతానని మాట్లాడటం హాస్యాస్పదం. పులివెందుల మెడికల్ కాలేజీ కోసం రూ. 481 కోట్లు ఖర్చు చేసిన జగన్, మార్కాపురం, ఆదోని, పాడేరు లాంటి వెనుకబడిన ప్రాంతాల కాలేజీలకు ఎందుకు నిధులు ఇవ్వలేదు? గిరిజన ప్రాంతాల్లో భూసేకరణ కూడా పూర్తి చేయకుండానే కట్టేశాం అని అబద్ధాలు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పీజీ కోర్సులకు ఇచ్చిన రూ. 700 కోట్లను కూడా సద్వినియోగం చేయకుండా కాలేజీలను నిర్వీర్యం చేశారు. పీపీపీ విధానం అంటే కాలేజీలు అమ్మేయడం కాదని, ఇది కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్, పార్లమెంటరీ కమిటీలు సూచించిన మేలైన పద్ధతి. గతంలో బెజవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో కార్డియాలజీ డిపార్ట్‌మెంట్‌ను పీపీపీకి ఇచ్చింది జగన్ కాదా? ఇప్పుడు మాత్రం కాలేజీలు అమ్మేస్తున్నారని, సీట్లు అమ్మేస్తున్నారని తప్పుడు కూతలు కూయడం తగదు. పీపీపీ విధానం ద్వారానే అదనంగా 220 మెడికల్ సీట్లు పెరుగుతున్నాయి. పేద బిడ్డలు డాక్టర్లు కావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్య సేవ, ఆయుష్మాన్ భారత్ ద్వారా కార్పొరేట్ వైద్యం అందుతుంటే, తట్టుకోలేక జగన్ మళ్ళీ కుట్రలు చేస్తున్నారు. ప్రజలు, మేధావులు ఈ వాస్తవాలను గమనించి జగన్ మోసపూరిత మాటలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. నాడు ఉమ్మడి రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాల వల్లే నేడు మన బిడ్డలు ప్రపంచ దేశాల్లో ఐటీ రంగంలో రాణిస్తున్నారు. రెవెన్యూ డివిజన్‌కు ఒక ఇంజనీరింగ్ కాలేజీ, జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని తీసుకురావడం వల్ల లక్షలాది మంది యువత ఐటీ రంగంలో రాణిస్తున్నారు. చంద్రబాబు హయాంలో నీతి ఆయోగ్ ర్యాంకింగ్స్‌లో వైద్య ఆరోగ్య రంగంలో ఆంధ్రప్రదేశ్ 4వ స్థానంలో ఉంటే, జగన్ ఐదేళ్ల పాలనలో దానిని 10వ స్థానానికి దిగజార్చారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రస్తుతం రూ. 53 వేల కోట్ల పైచిలుకు పనులు జరుగుతున్నాయి. 16 వేల మంది సిబ్బంది అహోరాత్రులు శ్రమిస్తున్నారు. త్వరలోనే ఈ సంఖ్య 30 వేలకు చేరబోతోంది. ఇవన్నీ చూసి ఓర్వలేక జగన్ తన సాక్షి పత్రిక ద్వారా విషం చిమ్ముతున్నారు. విశాఖలో లక్షల కోట్ల పెట్టుబడులు, 4.5 లక్షల ఉద్యోగాల కల్పనపై కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో స్పష్టత వచ్చినా, జగన్ తన ప్యాలెస్‌లో కూర్చుని టీవీలు పగలగొట్టుకుంటూ కడుపుమంటతో రగిలిపోతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు నాయుడుకి ఎకనామిక్ టైమ్స్ నుంచి బిజినెస్ రిఫార్మర్ అవార్డు వస్తే, దానిని కూడా తట్టుకోలేక జగన్ విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని మంచిని అభినందించడం నేర్చుకోవాలని హితవు పలికారు. తాడేపల్లి ప్యాలెస్‌లో లేదా లోక్ భవన్ ముందు పరదాలు కట్టుకుని మాట్లాడటం కాదు, ధైర్యం ఉంటే మీడియా అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని జగన్‌కు సవాల్ విసిరారు. ప్రజలు జగన్ నాటకాలను ఇకపై సహించబోరని, వాస్తవాలను తెలుసుకుంటున్నారని దేవినేని స్పష్టం చేశారు.

### గర్భిణులు, బాలింతలు, చిన్నారుల..

# ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- **సేవల్లో వేగం, పారదర్శకత కోసం అంగన్వాడి మహిళలకు స్మార్ట్ ఫోన్లు**
- **సీఎం చంద్రబాబు పాలనలోనే అంగన్వాడీ కార్యకర్తలకు గౌరవం, ఆర్థిక భద్రత**
- **మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

తూర్పు నాయుడుపాలెం (చైతన్యరథం): గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, అందులో భాగంగా అంగన్‌వాడీ వ్యవస్థలో ప్రభుత్వం స్మార్ట్ టెక్నాలజీని ప్రవేశపెట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం ప్రకాశం జిల్లా తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ ఐసీడీఎస్ సిబ్బందికి మంత్రి 5జీ స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సేవల్లో వేగం, పారదర్శకతకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అందులో భాగంగా అంగన్ వాడీ సిబ్బందికి స్మార్ట్ ఫోన్లను అందిస్తున్నామన్నారు. వీటి సహకారంతో పిల్లల పోషణ, తల్లుల ఆరోగ్య పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు డిజిటల్ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 58,204 అంగన్వాడీ కార్యకర్తలకు సెల్ ఫోన్ల పంపిణీకి రూ.75 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే అంగన్వాడీ సిబ్బంది వేతనాలు పెరిగాయన్నారు. గతంతో పోలిస్తే అంగన్వాడీ కార్యకర్తలకు గౌరవం, ఆర్థిక భద్రత పెరిగిందన్నారు. రాష్ట్రంలో 5 వేల మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాల స్థాయికి అప్‌గ్రేడ్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు మెరుగుపర్చడంపై ప్రత్యేక దృష్టి



సారించామన్నారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి డా. స్వామి తెలిపారు.

# కోటి సంతకాల పేరుతో జగన్ డ్రామాలు

- పీపీపీపై వైసీపీ నేతల అబద్ధాలు
- ఢిల్లీలో మద్దతు.. ఇక్కడ మాత్రం నాటకాలు
- మెడికల్ కాలేజీలపై ఐదేళ్ల పాలనలో అంతులేని నిర్లక్ష్యం, నేడు మొసలి కన్నీరు
- శాప్ ఛైర్మన్ రవినాయుడు ధ్వజం



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి చేస్తున్న హడావిడి చూస్తుంటే అది రాజకీయ పోరాటంలా లేదు, ఒక భారీ బడ్జెట్ సినిమా షూటింగ్‌లా ఉందంటూ ప్రజలు నవ్వుకుంటున్నారని శాప్ ఛైర్మన్ రవి నాయుడు ఎద్దేవా చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రవినాయుడు మాట్లాడుతూ.. ఆస్కార్ అవార్డులు ఇచ్చే వారు జగన్ నటనను చూస్తే, ఆయనకు అంతకంటే పెద్ద అవార్డు ఏదైనా ఉంటే ఇవ్వాలని భావిస్తారని చురకలు వేశారు. కోటి సంతకాలు అంటూ మూటలు కట్టి, పెద్ద పెద్ద వాహనాల్లో ప్రదర్శిస్తూ జగన్ ఒక పెద్ద నాటకానికి తెరలేపారు. అసలు ఆ మూటల్లో ఉన్నవి సంతకాలేనా? ఏ నియోజకవర్గంలో, ఏ బూత్ లెవల్‌లో సంతకాలు తీసుకున్నారో చెప్పే ధైర్యం జగన్‌కు ఉందా? నియోజకవర్గానికి లక్ష సంతకాలు అంటున్న జగన్, కనీసం ఆయన వెంట తిరిగే కార్యకర్తలతో కూడా సంతకాలు పెట్టించలేకపోయారు. కేవలం డ్రోన్ కెమేరాలతో విజువల్స్ క్రియేట్ చేసి ఏదో జరిగిపోతోందని బిల్డప్ ఇస్తున్నారని రవినాయుడు ఆక్షేపించారు.

**ఢిల్లీలో మద్దతు.. ఇక్కడ డ్రామాలు**

ఢిల్లీలో వైసీపీ ఎంపీ గురుమూర్తి పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలో పీపీపీ విధానానికి మద్దతుగా సంతకం చేస్తారు.. కానీ ఇక్కడ జగన్ మాత్రం డ్రామాలు ఆడుతారు. జగన్మోహన్ రెడ్డి తన రాజకీయ లబ్ధి కోసం దేశవ్యాప్తంగా అమలవుతున్న విధానాలను కూడా వక్రీకరిస్తున్నారు. పీపీపీ విధానం అనేది కేవలం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితం కాదు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దేశవ్యాప్తంగా ఇదే విధానాన్ని ప్రోత్సహిస్తున్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా ఈ విధానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరి ఢిల్లీలో కేంద్రం ముందు తలవంచి వచ్చిన వైసీపీ ఎంపీలు, ఇక్కడ ప్రజల ముందు నీతులు చెప్పడం విడ్డూరం. పీపీపీ ద్వారా కాలేజీలు కట్టే వారిని జైల్లో పెడతామని జగన్ అంటున్నాడు.. అంటే పీపీపీని సమర్థిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని, పార్లమెంటరీ కమిటీని కూడా జైల్లో పెడతారా అని రవినాయుడు ప్రశ్నించారు.

**నాడు సర్వనాశనం..నేడు మొసలి కన్నీరు**

విద్య, వైద్య వ్యవస్థలను ఐదేళ్ల పాలనలో సర్వనాశనం చేసిన జగన్మోహన్ రెడ్డి, ఇప్పుడు పీపీపీ విధానంపై మొసలి కన్నీరు కారుస్తూ విద్యార్థులను, యువతను రెచ్చగొట్టాలని చూస్తున్నారు. విద్యార్థి, యువజన సంఘాల నాయకులు.. జగన్ ఆడుతున్న ఈ రాజకీయ డ్రామాను గమనించాలి. ఆయన వేస్తున్న ట్రాప్‌లో పడొద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. కొన్ని విద్యార్థి సంఘాలకు సూటిగా ఒక ప్రశ్న వేస్తున్నా. రాష్ట్రంలో జీవో 107, జీవో 108లను తీసుకువచ్చి, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసింది ఎవరు.. అది జగన్మోహన్ రెడ్డి కాదా? ఈ జీవోల ద్వారా ఫీజులు పెంచి, సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల పేరుతో సామాన్యులకు వైద్య విద్య అందకుండా చేసిన పాపం జగన్‌ది కాదా? కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులు వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారు. వారు ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని రవినాయుడు హితవు పలికారు.

జగన్ ముందు ఆయన సొంత నియోజకవర్గం పులివెందులలో ఏం జరుగుతుందో చూసుకోవాలి. అక్కడ మీ జడ్పీటీసీలే మీ మాట వినడం లేదు. మొన్ననే 300 మంది నాయకులు మీ పార్టీకి గుడ్ బై చెప్పి వెళ్ళిపోయారు. పులివెందులలోనే మీకు పుట్టగతులు లేని పరిస్థితి వస్తుంటే, ఇంకా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తానంటే ఎవరూ నమ్మరు. వచ్చే ఎన్నికల్లో మీరు గెలవడమే కష్టం, ఇక మీరు అరెస్టులు చేస్తామనడం, జైలుకు పంపుతామనడం హాస్యాస్పదంగా ఉంది. జగన్ హయాంలో 104, 108 వాహనాలకు డీజిల్ పోయించలేని, రిపేర్లు చేయించలేని దారుణ పరిస్థితి నెలకొంది. పేదలకు అత్యవసర వైద్యం అందకుండా చేసిన జగన్, ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉంది. జగన్ పాలనలో అద్భుతంగా వైద్యం అందించామని చెప్పుకున్నారు. మరి సొంతపార్టీ నేతలకే నమ్మకం లేక.. జగన్ కేబినెట్ మంత్రులు పలువురు చికిత్స కోసం హైదరాబాద్, బొంబాయి, బెంగళూరు ఎందుకు వెళ్లారో చెప్పాలని రవినాయుడు ప్రశ్నించారు.

**యువత, విద్యార్థి సంఘాలు ఆలోచించాలి**

విద్యార్థులపై మీకు నిజంగా ప్రేమ ఉంటే మెడికల్ కాలేజీలు పూర్తయ్యేవి కదా. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు తన తండ్రి ఆద్యుడని చెప్పుకునే జగన్, అధికారంలోకి వచ్చాక 77 జీవో తీసుకువచ్చి సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులకు రీయింబర్స్‌మెంట్ రద్దు చేశారు. దీనివల్ల వేలాది మంది విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీల్లో ఆగిపోయాయి. కోర్సులు పూర్తయినా చేతిలో సర్టిఫికెట్లు లేక, ఉద్యోగాలు రాక విద్యార్థులు అనుభవించిన బాధలకు జగన్ సమాధానం చెప్పాలి. పీపీపీ విధానం ద్వారా అదనంగా 220 మెడికల్ సీట్లు వస్తుంటే, పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుంటే జగన్ ఎందుకు ఓర్వలేకపోతున్నారు? రాష్ట్రం ఇప్పుడు ఇప్పుడే గాడిన పడుతుంటే, మళ్ళీ విద్యా వ్యవస్థను అస్థిరపరచాలని చూస్తున్నారు. దీనిపై యువత, విద్యార్థి సంఘాలు ఆలోచించాలి. విద్యా, వైద్య రంగాన్ని నాశనం చేసిన వ్యక్తి మాటలు నమ్మి భవిష్యత్తును పాడుచేసుకోవద్దు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా నిలవాలని రవినాయుడు కోరారు.

**జగన్ చేసింది 18 శాతం పనులే**

వైద్య విద్యను, పేదలకు దక్కాల్సిన వైద్య సేవలను జగన్మోహన్ రెడ్డి ఏ విధంగా గాలికి వదిలేశారో ఆయన ప్రాధాన్యతలను చూస్తేనే అర్థమవుతోంది. పేదల పక్షపాతిని అని చెప్పుకునే జగన్, తన విలాసాల కోసం వందల కోట్లు వెచ్చించి రాజభవనాలు కట్టుకున్నారే తప్ప, పేద విద్యార్థుల కోసం ఒక్క మెడికల్ కాలేజీని కూడా పూర్తి చేయలేకపోయారు. తాడేపల్లి ప్యాలెస్ కట్టడానికి మీకు ఎంత సమయం పట్టింది? విశాఖపట్నంలోని రుషికొండ ప్యాలెస్‌ను ఎన్ని రోజుల్లో పూర్తి చేశారు? రుషికొండపై మీరు, మీ సతీమణి ఉండటానికి నిర్మించుకున్న వేగంగా రాజమహల్ కట్టించుకున్న జగన్.. దాని పక్కనే ఉన్న నర్సీపట్నం మెడికల్ కాలేజీని ఎందుకు పూర్తి చేయలేకపోయారు? మీకు నిజంగా వైద్య విద్యార్థుల మీద ప్రేమ ఉంటే, పేద ప్రజల ఆరోగ్యంపై చిత్తశుద్ధి ఉంటే ఈపాటికి ఆ కాలేజీ పూర్తయ్యేది కాదా? మెడికల్ కాలేజీల విషయంలో జగన్ చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలు. జగన్ హయాంలో మెడికల్ కాలేజీ నిర్మాణంలో పూర్తయింది కేవలం 18 శాతం పనులు మాత్రమే. అది కూడా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే ఆ మాత్రం పనులు జరిగాయి. మీ లెక్కల ప్రకారం చూస్తే ఆ కాలేజీలు పూర్తి కావడానికి మరో 10 ఏళ్లు పడుతుంది. కేంద్రం ఇచ్చిన నిధులతో అరకొర పనులు చేసి, తానేదో అద్భుతం సృష్టించినట్లు జగన్ పెద్ద నాటకం ఆడుతున్నారు. గతంలో పింక్ డైమండ్ అని, బాబాయ్ హత్య అని, కోడికత్తి అని, గులకరాయి అని ఇలా ఎన్నో డ్రామాలు ఆడిన జగన్ చరిత్రను ప్రజలు మర్చిపోలేదు. జగన్మోహన్ రెడ్డి ఇకనైనా నాటకాలు ఆపాలి. సంతకాల మూటలు కట్టి, వాహనాల మీద వేసి, 10 డ్రోన్లు, 20 కెమేరాలతో మీరు చేసిన షో చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. డ్రోన్లతో ఆకాశం నుంచి ఫోటోలు తీస్తే అబద్ధం నిజం అయిపోదు. పది డ్రోన్లు పెట్టి షూటింగ్ చేస్తే కోటి సంతకాలు అయిపోవు. పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం పీపీపీ విధానంతో ముందుకు వెళ్తుంటే, మీరు మాత్రం కెమేరాల ముందు ఫోజులు ఇస్తూ పబ్లిసిటీ పిచ్చితో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు. ప్రజలకు వాస్తవాలు తెలుసు, మీ డ్రోన్ కెమేరా ట్రిక్కులు ఇక సాగవు. రాష్ట్రం బాగు కోసం, పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం తీసుకొస్తున్న పీపీపీ విధానాన్ని ప్రజలు, విద్యార్థి సంఘాలు స్వాగతిస్తున్నాయని రవినాయుడు స్పష్టం చేశారు.

# సంక్షేమంతో పాటు అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

- 18 నెలల్లోనే ఎన్నికల హామీల అమలు
- రాజకీయాలకు అతీతంగా విద్యారంగంలో సంస్కరణలు
- అద్దంకి నియోజకవర్గంలో విద్యార్థులకు ఉచితంగా 5,542 సైకిళ్ల పంపిణీ
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అద్దంకి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ 18 నెలల్లోనే అమలు చేశామన్నారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం బల్లికురవ మండలంలోని వైదన గ్రామంలో సహచర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామితో కలిసి శుక్రవారం మంత్రి గొట్టిపాటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా రూ.73 లక్షలతో ఆధునీకరించిన సాంఘిక, సంక్షేమ బాలుర వసతి గృహాన్ని మంత్రులిద్దరూ ప్రారంభించి సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఆ తరువాత వైదన గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన డ్రైనేజీ కాలువలను ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ పాఠశాలలో రూ.10 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. అదే గ్రామంలో దాతల సహకారంతో రూ.50 లక్షలతో నిర్మించిన ముస్లిం కమ్యూనిటీ హాలును ప్రజలకు అంకితం చేశారు. వైదన జిల్లా పరిషత్ పాఠశాలలో 199 మంది విద్యార్థులకు దాతల సహాయంతో ఉచితంగా సైకిళ్లను మంత్రులు గొట్టిపాటి, డోలా అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ., మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకు వచ్చామని తెలిపారు. దూరం ఎక్కువగా ఉండే కారణంతో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని.., అద్దంకి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 5,542 మంది ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజ్ విద్యార్థినీ, విద్యార్థులకు దాతలు ఎస్ఆర్ఆర్, అసిస్ట్ సేవా సంస్థ నిధులతో సైకిళ్లను ఉచితంగా అందించామని ఆయన తెలిపారు. రాజకీయాలకు సంబంధం లేకుండా, రాజకీయ నాయకుల పేర్లు, పార్టీ గుర్తులు లేకుండా విద్యార్థులందరికీ యూనిఫార్ములు, బ్యాగులు, పుస్తకాలతో పాటు షూలు కూడా పంపిణీ చేశామన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా, ప్రతి పాఠశాలలోనూ మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. టీచర్ల కొరత తీర్చేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు మెగా డీఎస్సీ ద్వారా ఒకేసారి 16,300 ఉపాధ్యాయ పోస్టులను కూటమి ప్రభుత్వంలో భర్తీ చేశామని వెల్లడించారు. పిల్లలందరూ కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలని మంత్రి గొట్టిపాటి ఆకాంక్షించారు. అదే విధంగా వార్డెన్లు అందరూ విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలని హితవు పలికారు.

వైదనలో అంగన్ వాడీ సభ్యులకు 5జీ ఫోన్లను మంత్రులు గొట్టిపాటి, డోలా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ., సాంఘిక, సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎస్సీ హాస్టల్స్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ., సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. పెన్షన్లు, ఉచిత బస్, రైతుకు ఆర్థిక సహాయం, పిల్లల చదువులకు చేయూత వంటివి ఎన్నో చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలోనూ రహదారులు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది రూపాయిల ప్రజాధనంతో నిర్మించిన రోడ్లను దమ్ము ట్రాక్టర్లతో తొక్కించేస్తున్నారని, దీనితో సంవత్సరానికే రోడ్లు ధ్వంసం అవుతున్నాయని మంత్రి గొట్టిపాటి అసహనం వ్యక్తం చేశారు. వాటికి రబ్బరు తొడుగులు వేసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధితో పాటు, ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన విధ్వంసం గురించి కూడా ప్రజలు ఆలోచించాలని మంత్రి గొట్టిపాటి కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి ప్రభువు ఆశీస్సులుండాలి

**- సెమీ క్రిస్టమస్ వేడుకల్లో మంత్రి పార్థసారథి**



నూజివీడు (చైతన్యరథం): త్యాగం, ప్రేమ, కరుణ బోధనలు ద్వారా విశ్వమానవాళికి ఏసు ప్రభువు చక్కని శాంతిమార్గం వేసారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా నూజివీడులోని మంత్రి పార్థసారథి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సెమీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక అతిథిగా హాజరైన మంత్రి.. ఫాదర్లు, మత పెద్దలకు, సోదర, సోదరీ మణులకు కూటమి నాయకులకు, కార్యకర్తలకు క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు. మొదట మంత్రికి ఘనంగా స్వాగతం పలికిన చర్చి ఫాదర్లు, సిస్టర్లు వాక్యం చదివిన అనంతరం కేక్ ను కట్ చేసి అందరికీ అందజేశారు. ఈ సందర్భంగా స్నేహ రైట్స్ బి.నగేష్ రావు ఆధ్వర్యంలో 30 మంది నిరుపేదలకు 17 రకాలు నిత్యవసర సరుకులను మంత్రి అందజేశారు. అనంతరం మంత్రి పార్థసారథి మాట్లాడుతూ మునుపెన్నడు లేని విధంగా క్రిస్టియన్ సోదరులు అభివృద్ధి, సంక్షేమానికి రూ 150 కోట్లు అదనంగా కేటాయించామనిన్నారు. జెరూసలేం యాత్రకు, విదేశీ విద్యను అభ్యసించడా నికి మరిన్ని నిధులు కేటాయించామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అందుకు తన వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. క్రైస్తవ కుటుంబాలు మంచి ప్రేమ, ఆప్యాయతలు కలవారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. దేవుడు దృష్టిలో మానవులంతా సమానం అన్నారు. దేవుని మార్గంలో నడిస్తే అందరూ ఆరోగ్యంగా, అభివృద్ధి చెందుతారని అన్నారు. అన్ని వర్గాలు ప్రజలకు న్యాయం చేసే ప్రభుత్వాన్ని కూడా ఆశీర్వదించాలని మత పెద్దలను, ఫాదర్లను కోరారు. గతంలో 255 క్రైస్తవ మందిరాలకు బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వం కూడా మన ప్రజా ప్రభుత్వమేనని తెలిపారు. గతంలో క్రిస్టియన్ సోదరులకు అనేక అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ఇచ్చింది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అని తెలిపారు. ప్రభువు ఆశీస్సులతో రాష్ట్రం, నియోజకవర్గం అంతా ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో జీవించాలని, అందరి జీవితాల్లో చీకటి తొలగిపోయి వెలుగులు నింపాలని, విజయాలు సిద్ధించాలని ఏసు ప్రభువును కోరానన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్లు, సిస్టర్స్, చర్చి పెద్దలు ఇళయరాజా, రమేష్, పట్టణ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, క్రైస్తవ సోదర, సోదరీమణులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పెట్టుబడులకు సిద్ధం

**- బ్రిటీష్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ బృందం సంసిద్ధత**

**- మంత్రి కొల్లు రవీంద్రతో భేటీ**

విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలో మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం లక్ష్యంగా బ్రిటీష్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రతినిధుల బృందం శుక్రవారం విజయవాడలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సయిజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్రని కలిసింది. రాష్ట్రంలో కర్బన ఉద్గారాల నివారణ, పర్యావరణ పరిరక్షణ రంగంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని, వాటిలో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అదే సమయంలో రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి, ముఖ్యంగా మచిలీపట్నం పరిసరాల్లో బీచ్ టూరిజం అభివృద్ధికి నెథర్లాండ్స్‌కు చెందిన ప్రతినిధులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రెన్యూవబుల్ ఎనర్జీ రంగం, తయారీ రంగం, క్రిటికల్ మినరల్స్ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం నుండి తోడ్పాటు అందించాలన్నారు. రాష్ట్రంలో విస్తారమైన మత్స్య సంపద ఉన్నప్పటికీ.. ఆదాయం సరిగా లేదని, మత్స్య రంగంలో విలువ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని వారికి మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. స్థానిక యువతకు మత్స్య రంగంలో ఉపాధికి కల్పించాలన్నారు. ఈ మేరకు ఫిషరీస్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో యువతకు శిక్షణ అందించడం ద్వారా ఆక్వాలో ఏపీని దేశానికి ఆదర్శవంతంగా మారుస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించేలా పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కోస్టల్ టూరిజం, సోలార్, ఉప్పు నీటి నుండి మంచి నీరు తయారీ వంటి అంశాలపై కేస్ స్టడీ తయారు చేయాలని మంత్రి సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పినట్లుగా స్మార్ట్ వర్క్ చేయడం ద్వారా ఉద్యోగ, ఉపాధితో పాటుగా.. మెరుగైన ఆదాయమూ సాధించుకునే వెసులుబాటు ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో యూరో ఎంటర్‌ప్రెన్యూర్ బ్యాంక్ ప్రతినిధి జయకుమార్, సైబస్ బయోటెక్ ఇండియా ఎండీ డా.నగేష్, బ్రిటీష్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రతినిధి దుర్గా రవీంద్రన్, అమస్టర్ డాం ఫార్మా స్టడీస్, పిలిప్స్ సంస్థ ప్రతినిధి రష్మీ, తదితరులు ఉన్నారు.

# అవినీతికి ఆస్కారం లేకుండా పని చేయండి

**- వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్ల సమస్యలను పరిష్కరిస్తాం**

**- సంఘాల నేతలకు రెవెన్యూ మంత్రి అనగాని హామీ**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వీఆర్వో అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ వీఆర్ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ, ఎపీ గ్రామ సర్వేయర్ల అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వివరించారు. తమకు ప్రమోషన్లు ఇవ్వాలని మూడు సంఘాల వారు కోరారు. దీనిపై అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి అనగాని హామీ ఇచ్చారు. వీఆర్వో అసోసియేషన్ నాయకులు రవీంద్ర మాట్లాడుతూ తమకు రోజూ గ్రామ సచివాలయాల కెళ్లి హాజరు వేయించుకోవడం సమస్యగా ఉందని, తాము ఎక్కడ పనిలో ఉంటే అక్కడ నుండే హాజరు వేసే విధంగా వెసులుబాటు కల్పించాలని కోరారు.

అదే విధంగా రెవిన్యూ శాఖ విధుల్లో ఉన్నప్పుడు కూడా వేరే విధులు చేయాలని గ్రామ సచివాలయాల అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, దీని వల్ల రెవెన్యూ శాఖ పనిని సరిగ్గా చేయలేకపోతున్నామని తెలిపారు. తమకు గ్రామ సచివాలయాల్లో ఒక కంప్యూటర్ ను ఏర్పాటు చేస్తే ఇక ఈ ఆఫీస్ ద్వారా మాత్రమే రోజువారీ విధులు నిర్వహిస్తామని కోరారు. సర్వేయర్ల అసోయేషన్ నాయకులు మాట్లాడుతూ తమను టెక్నికల్ పోస్టులుగా గుర్తించాలని కోరారు.

ఈ అంశాలపైన రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ తో చర్చించి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటానని మంత్రి అనగాని వారికి హామీనిచ్చారు. అయితే వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్లు అందరూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. అవినీతికి సంబంధించి ఆరోపణలు వస్తున్నాయని, దానికి అస్కారంగా లేకుండా పని చేయాలన్నారు. రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసం మీ దగ్గరికి వచ్చే ప్రజలను సంతృప్తి పరిచేలా పని చేయాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు.

# పేద విద్యార్థుల విద్య, ఆరోగ్యం, సంక్షేమంపై..

**- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ప్రత్యేక శ్రద్ధ**

- **కూటమి ప్రభుత్వంలో సాంఘిక సంక్షేమ శాఖలో విప్లవాత్మక మార్పులు**
- **రూ.143 కోట్లతో హాస్టళ్లకు మరమ్మతులు**
- **దాతల సహకారంతో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటికి అభినందనలు**
- **మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**



బల్లికురవ (చైతన్యరథం): పేద విద్యార్థుల విద్య, ఆరోగ్యం, సంక్షేమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం బల్లికురవ మండలంలోని వైదన గ్రామంలో మంత్రులు డా.డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా రూ.73 లక్షలతో ఆధునీకరించిన సాంఘిక, సంక్షేమ బాలుర వసతి గృహాన్ని మంత్రులిద్దరూ ప్రారంభించి సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ...సాంఘిక, సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సాంఘిక సంక్షేమ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని, చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రూ.143 కోట్లతో హాస్టళ్లకు మరమ్మతులు చేశామన్నారు. పేద విద్యార్థుల విద్య, ఆరోగ్యం, సంక్షేమంపై సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. విద్యార్థులకు ఇచ్చే యూనిఫామ్, స్కూల్ బ్యాగ్ నుంచి పుస్తకాల వరకు ప్రతిదాన్నీ మంత్రి లోకేష్ స్వయంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒకరు ఉద్యోగం సాధించాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పమమని మంత్రి స్వామి అన్నారు. దాతల సహకారంతో అద్దంకి నియోజకవర్గంలో 5 వేల మందికిపైగా విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కి ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అభినందనలు తెలిపారు.

# గోదావరి పుష్కరాలకు.. ఇప్పటి నుండే తగిన కార్యాచరణ

**- అధికారులకు సీఎస్ విజయానంద్ ఆదేశం**

*అమరావతి (చైతన్యరథం): 2027, జూన్ 26 నుండి జూలై 7వతేదీ వరకు 12 రోజుల పాటు జరగనున్న గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటి నుండే ఆయా శాఖలు, జిల్లాల వారీగా తగిన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని కార్యదర్శులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గోదావరి పుష్కరాలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యదర్శుల కమిటీ సమావేశం శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సీఎస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి పుష్కరాల సహ్నహక ఏర్పాట్లకు సంబంధించి ఇది మొదటి ప్రాథమిక సమావేశం అయినందును ఇప్పటి నుండే తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయిలో మంత్రుల బృందాన్ని, కార్యదర్శుల బృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ జి.వీరపాండ్యన్‌ను ప్రభుత్వం ప్రత్యేక అధికారిగా నియమించిందని తెలిపారు. జిల్లా స్థాయిలో కూడా ఆయా శాఖల అధికారులతో జిల్లా కమిటీలను కూడా ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు పనుల పర్యవేక్షణకు చర్యలు తీసుకోవాలని కలక్టర్లకు సూచించారు. ఇప్పటినుండే ఆయా జిల్లాల వారీగా, స్నాన ఘట్టాల వారీగా, శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై మైక్రో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా స్నాన ఘట్టాలను గుర్తించడం, తాగునీరు, పారిశుద్ధం,రవాణా, వైద్య శిబిరాలు, భద్రత, జనసమూహ నిర్వహణ, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర సేవలను సమన్వయం చేయడం వంటి అంశాలపై వివరణాత్మక డిపిఆర్‌లను సిద్ధం చేసి పంపడం వంటి చర్యలు చేపట్టాలని కలక్టర్లను ఆదేశిచారు. వివిధ కారణాల వల్ల 2027లో జరిగే పుష్కరాలకు రెట్టింపు స్థాయిలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అందుకనుణంగా తగిన ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. మన రాష్ట్రంలో గోదావరి నది అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రవేశించి ఏలూరు, తూర్పు గోదావరి, కాకినాడ, పశ్చిమ గోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల మీదగా ప్రవహిస్తుందని ఈ ఆరు జిల్లాల్లో వివిధ స్నాన ఘట్టాల వద్ద భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందన్నారు. గోదావరి పుష్కరాలను విజయవంతం చేసేందుకు దేవాదాయ, నీటిపారుదల, రెవెన్యూ, పోలీస్, ఆర్అండ్‌బీ, పురపాలక, పట్టణాభివృద్ధి, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ట్రాన్స్‌కో, మత్స్య, అగ్నిమాపక, ఎపిఎస్ఆర్టీసి, రైల్వే, పర్యాటక, సమాచార పౌర సంబంధాలు, విపత్తుల నిర్వహణ, తదితర శాఖలు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. రానున్న గోదావరి పుష్కరాల జన సమూహాల నిరంతర పర్యవేక్షణకు ఐటి,ఆర్టీజిఎస్ ల ద్వారా తగిన సాంకేతికతను సిద్ధం చేయాలని చెప్పారు.ముఖ్యంగా ఏఏ తేదీల్లో అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందో ఆతేదీల్లో జన సమూహ సమర్ధనిర్వహణకు తగిన ప్రణాళికు సిద్ధం చేయాలని సిఎస్ విజయానంద్ అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం ప్రధాన కేంద్రంగా గోదావరి పుష్కరాలు జరగనున్నందున మహా కుంభమేళాలో ఏర్పాటు చేసిన విధంగా వివిధ ప్రాంతాలను గుర్తించి అక్కడ తాత్కాలిక టెంట్ సిటీలు ఏర్పాటు చేసి అధిక సంఖ్యలో భక్తులకు తాత్కాలిక వసతి కల్పనకు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి ప్రతి జిల్లాల్లో జెసి స్థాయి అధికారిని ప్రత్యేకంగా ఇన్చార్జిగా నియమించాలని, ప్రతి జిల్లాకు ఒక సవివర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయాలని కలెక్టర్లకు సీఎస్ విజయానంద్ సూచించారు. ఈసమావేశంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి హరి జవహర్‌లాల్, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఆర్టీజిఎస్ సిఇఒ ప్రఖర్ జైన్, జలవనరుల శాఖ సిఇ శేషు బాబు, తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే వర్చువల్ గా ముఖ్య కార్యదర్శులు ఎస్ సురేష్ కుమార్, శశి భూషణ్ కుమార్, ఆర్టీసి ఎండి ద్వారకా తిరుమల రావు, శాంతి భద్రతల ఎడిజి మధుసూదన్ రెడ్డి, ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ కెఎస్.విశ్వనాధన్, ఎపిటిడిసి ఎండి ఆమ్రపాలి, ఇతర శాఖల కార్యదర్శులు, అధికారులు, ఆరు జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.*



# ప్రజాదర్బార్ దరఖాస్తులన్నీ పరిష్కరించాల్సిందే

## ఎమ్మెల్యే, రాష్ట్రఎస్టీ సంక్షేమ కమిటి చైర్‌పర్సన్ మిరియాల శిరీషదేవి



రంపచోడవరం, (చైతన్యరథం): ప్రజా దర్బార్ లో వచ్చిన ప్రతీ దరఖాస్తు పరిష్కారం చేయడంలో అధికార యంత్రాంగం చిత్త శుద్ధితో పని చేయాల్సిందే అని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి అన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో శుక్రవారం మండలం పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్ అధ్యక్షతన ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. ప్రజా దర్బార్ లో ఏదే సమస్యలు పై దరఖాస్తులు అందినాయో వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చేయాలని అధి కారులకు ఆదేశించారు. పరిష్కారం త్వరగా కాని సమస్యలు ఉంటే దానికి గల కారణాలు దరఖాస్తు దారులకు తెలియజేయాలన్నారు. ఎప్పటికి పూర్తి అవుతుందో దానికి గల కారణాలు ఏంటో అన్ని దరఖాస్తుదారులకు సవి నయంగా తెలియజేయలేని సూచించారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్యవారధులు గా కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువచ్చేలా వ్యవహరించాలని సూచించారు. అలాగే ప్రజా దర్బార్ లో తన దృష్టికి వచ్చిన పలు సమస్యలు వెంటనే పరిష్కారం చేశారు. కొన్ని సమస్యలు సంబంధించిన అధికారులకు ప్రతిపాదనల కోసం సిఫార్సు చేశారు. రహదారి నిర్మాణం కోసం అటవీశాఖ అడ్డంకులు తొలగించాలని కోట గ్రామస్తులు కోరారు. విద్యుత్ సౌకర్యం కొరకు, రంపచోడవరం డివిజనల్ పరిధిలో గల జీసీసీ హమాలీలకు రావాల్సిన బకాయి వేతనాలు ఇప్పించాలని కోరారు. రాజవొమ్మంగి మండలం నుండి పలు గ్రామాలకు బీటీ రోడ్లు కావాలని కోరారు. కొందరు ముఖ్యమంత్రి సహాయనిధి కొరకు దరఖాస్తు చేయగా స్పందించిన ఆమె పరిష్కారం అయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, చైర్మన్ లోతా లక్ష్మణరావు, వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, ఎటపాక మండల తెదేపా అధ్యక్షులు బొల్లా పుల్లయ్య, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు,. అరకు పార్లమెంట్ కార్యదర్శి పెనుబల్లి సాయిబాబు, సొసైటీ చైర్మన్ మాచినేని రాజేష్, సీతపల్లి దేవస్థానం గుడి సభ్యులు సిద్ధా వెంకన్నదొర,జనసేన ప్రతినిధి పాపోలు శ్రీనివాస రావు, రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యులు షేక్ చోటు, నియోజకవర్గం తెదేపా ఎస్టీ విభాగం అధ్యక్షులు పండా చెల్లన్న దొర, మాజీ సర్పంచ్ నిరంజనీ దేవి , గడేసుల రంజిత్, తెదేపా సీనియర్ నాయకులు అడబాల బాపిరాజు, రైతు సంఘం నాయకులు చంద్ర రఘు, బూత్ ఇంచార్జి సతీష్ కుమార్, రంపచోడవరం ఇంచార్జి తహసీల్దార్ అల్లు సత్యనారాయణ, రంపచోడవరం ఎంపీడీఓ ప్రసాద్ కన్నారం గ్రామ కమిటీ ప్రతినిధి నాగు, కూనవరం తెలుగు యువత నాయకులు గడేసుల రంజిత్, డి.శ్రీహరి, పలు ప్రభుత్వశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం పట్టణం 19వ డివిజన్ కు చెందిన వైసీపీ నాయకులు, సోము మురళి, సోము మాధవితో పాటు సుమారు 300 కుటుంబాల వారు పార్టీ కార్యాలయంలో శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా పార్టీలోకి ఆహ్వానించారు.

# దర్శి ఆర్టీసీ డిపోకు స్థలం కేటాయించండి

## కలెక్టర్‌ను కోరిన దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, (చైతన్యరథం): ఒంగోలులోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శు క్రవారం సాయంత్రం దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ జిల్లా కలెక్టర్ పి. రాజాబాబుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమ్ములు పురోగతిని సమీక్షించారు. నియోజకవర్గ కేంద్రమైన దర్శిలో ఆర్టీసీ డిపో అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. అందుకు అవసరమైన స్థలం మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికే రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డిని ఆర్టీసీ డిపోకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరడం జరిగిందని అందుకు అవసరమైన స్థల కేటాయింపు అవసరమని ఆయన వివరించారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ రాజాబాబు సానుకూలంగా స్పందించి స్థానిక రెవిన్యూ సిబ్బందితో డిపోకు అనువుగా ఉండే ప్రభుత్వ స్థలాన్ని అన్వేషిస్తామని హామీ ఇచ్చినట్లు వారు వివరించారు. అదేవిధంగా ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు దర్శి పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీల అమలు, నిధుల మంజూరు పనుల పురోగతి తదితరాంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. తూర్పు వీరాయపాలెంలో పట్టాల పంపిణీ, ఇళ్ల స్థలాల కేటాయింపు, అభివృద్ధి కార్యక్రమాల అమలును కలెక్టర్ ఈ సందర్భంగా పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులు, నిధుల మంజూరు పై కూడా చర్చించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని ఎస్సీ ఎస్టీ కాలనీలా రోడ్లు మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధుల మంజూరు అంశాలు కూడా ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ గారు కలెక్టర్ గారికి విన్నవించారు. అదేవిధంగా దర్శి మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్ల ఏర్పాటుకు అవసరమైన నిధులు మంజూరు పనుల ప్రారంభం, సంక్షేమ పథకాల అమలు, సిబ్బంది కొరత తదితర అంశాలపై కలెక్టర్ తో డాక్టర్ లక్ష్మీ, తెలుగుదేశం పార్టీ యువ నేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్ దీర్ఘంగా మాట్లాడారు.



# ప్రజాసమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

## ప్రజాదర్బార్‌లో పాల్గొన్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి



ఏలూరు, (చైతన్యరథం): సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరువచేయాలనే ధ్యేయంతోనే తాను అవిశ్రాంతంగా శ్రమిస్తున్నానని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ఇదేక్రమంలో ప్రభుత్వాధినేతల ఆలోచనలు, సూచనలను క్రోడీకరించుకుంటూ ప్రజాసమస్యలకు వేగవంతమైన పరిష్కారాలు చూపేందుకు ప్రత్యేక దృష్టితో ముందుకెళ్తున్నానని వ్యాఖ్యానించారు. ఏలూరు పవర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శు క్రవారం కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని లక్ష్యసాధన దిశగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. తమ సమస్యలకు త్వరితగతిన పరిష్కారాలు లభిస్తాయనే నమ్మకంతో ప్రజాదర్బార్ కార్యక్రమానికి ప్రజలు పోటెత్తారు. ప్రస్తుతం ఎమ్మెల్యే చంటి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కావడంతో ప్రజలకు ఆయన మీదున్న నమ్మకం మరింత రెట్టింపయ్యిందనేందుకు ఈ కార్యక్రమం ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కాగా వచ్చిన ప్రతిఒక్కరిని ఎమ్మెల్యే చంటిఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను సావధానంగా తెలుసుకున్నారు. అనంతరం అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు, ప్రజాసమస్యల పరిష్కారానికి తాము చేపడుతున్న చర్యలతో అన్నింటా స్పష్టమైన మార్క్ కనిపిస్తుందన్నారు. ఇదేక్రమంలో రానున్న రోజుల్లో సమర్థవంతంగా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసి చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్సెమ్మార్ పెదబాబు, టిడిపి నగర కార్యదర్శి రెడ్డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కొవ్వూరులో ప్రజాదర్బార్

కొవ్వూరు , (చైతన్యరథం): కొవ్వూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజా దర్బార్ కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యుడు ముప్పిడి వెంకటేశ్వరరావునిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలతో వినతి పత్రాలను అందించారు. వారి సమస్యల తక్షణ పరిష్కారం దిశగా సంబంధిత అధికారులకు ఫోన్ చేసిన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో టుమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మద్దిపట్ల శివరామ కృష్ణ, అర్జీల రామకృష్ణ, సూరపని చిన్ని, బెతిన నారాయణ, సూర్యదేవర రంజిత్, కాంతరాజు, శివగారు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

## కాకినాడ శాసనసభ్యుడు వనమాడి కొండబాబు




కాకినాడ, (చైతన్యరథం): ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలకు వెనువెంటనే పరిష్కార చర్యలు చేపట్టేందుకే ప్రజా దర్బార్ నిర్వహించడం జరుగుతోందని కాకినాడ సిటీ శాసనసభ్యుడు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. జగన్నాధపురం శాసనసభ్యుడి క్యాంపు కార్యాలయంలో శు క్రవారం శాసనసభ్యుడు వనమాడి కొండబాబు ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. ప్రతి ఒక్కరి అర్జీని స్వయంగా స్వీకరించిన కొండబాబు వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, గ ృహ నిర్మాణ అనుమతులు, కొత్త పెన్షన్లు వంటి అంశాలకు సంబంధించిన అర్జీలు రావడంతో, వెంటనే రెవెన్యూ అధికారులతో చర్చించి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టారు. ఇతర విభాగాలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులకు సూచనలు ఇవ్వగా, ఎక్కువశాతం సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం చేశారు. ప్రజా సమస్యలను సాంకేతిక, ఆర్థికపరంగా పరిశీలించి వేగంగా పరిష్కరించేందుకు పని చేస్తానని ప్రజలకు కొండబాబు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# తూర్పుగోదావరి జిల్లాలో మంత్రి లోకేష్‌కు అఖండ స్వాగతం

రాజమహేంద్రవరం, (చైతన్యరథం): బూరుగుపూడి జంక్షన్ వద్ద మంత్రి లోకేష్‌కు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో గజమాలతో టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. గాడాల గ్రామంలో మంత్రి లోకేష్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం చెప్పారు. రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్వారీ మార్కెట్ జంక్షన్ వద్ద ఘన స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పార్టీ జెండాలు, డప్పులు, బాణా సంచాలతో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. టీడీపీ నాయకులు రాజమండ్రి లాలాచెరువు జంక్షన్ లో మంత్రి నారా లోకేష్‌కు ఘనస్వాగతం చెప్పారు. టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు ప్రతిఒక్కరినీ మంత్రి లోకేష్ ఆప్యాయంగా పలకరించి ఫోటోలు దిగారు.

# గిరిజనులకు పట్టాలిచ్చి న్యాయం చేయండి

## కలెక్టర్‌ను కోరిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా




ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలానికి చెందిన మర్రివీడు, జె. అన్నవరం, తూర్పు లక్ష్మీపురం గ్రామాల గిరిజనులు ఎదుర్కొంటున్న ఆర్.ఓ.ఎఫ్.ఆర్ (హక్కుల గుర్తింపు) డి పట్టాల సమస్యలపై ప్రజా దర్బారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శ్రీ శుభమ్ నొక్వాల్ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి తమకు ఆర్.ఓ.ఎఫ్.ఆర్ డి పట్టాలు మంజూరు చేయాలని గిరిజనులు అధికారులను కోరారు. భూములపై హక్కులు ఉన్నప్పటికీ పట్టాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు విన్నవించారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ, గిరిజనుల సమస్యలను సాధ్యాసాధ్యాల మేరకు సమగ్రంగా పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా పట్టాలు మంజూరు చేయాలని అధికారులను కోరారు. అధికారులు మాట్లాడుతూ, సంబంధిత భూములపై సమగ్ర విచారణలు నిర్వహించి అర్హత ఉన్న గిరిజనులకు ఆర్.ఓ.ఎఫ్.ఆర్ డి పట్టాలు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.



నల్లజర్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించిన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

# శనివారపు పేట కాజ్‌వే వద్ద బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

## ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టీకరణ



ఏలూరు, (చైతన్యరథం): పరిసర ప్రాంతాల ప్రజలకు చిరకాల వాంఛగా మిగిలిన శనివారపు పేట కాజ్‌వే వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఆర్థికపరమైన ఆమోదం లభించిందని, వచ్చేనెలలోనే టెండర్లు పిలవడం, పనులు ప్రారంభం జరుగుతాయని, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. తన పర్యటనలో భాగంగా ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం తెలిపి ప్రస్తుతం నిధుల విడుదలకు మార్గం సుగమం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎంతో ప్రతిష్టాత్మకమైన బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంపిక కావడం కూటమి ప్రభుత్వానికి ఎంతో గర్వకారణమని బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరు పవర్ పేటలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. నగరాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరిస్తూనే, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి, ఇతర నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామని, ప్రజలకు మరిన్ని మేళ్ళు చేయాలన్నదే తమ అంతిమ లక్ష్యమని ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానంగా నియోజకవర్గంలోని రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి 54కోట్ల, 86లక్షల రూపాయల భారీ నిధులను వివిధ గ్రాంట్ల ద్వారా మంజూరు చేయించి, కొన్ని పనులు పూర్తిచేసి, మెరుగైన రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు పూర్తిచేశామన్నారు. అలాగే నగర ప్రజలు వేయికళ్ళతో ఎదురుచూస్తోన్న శనివారపు పేట బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన ఆర్థికపరమైన ఆమోదం లభించిందన్నారు. త్వరలోనే శంకుస్థాపన జరగనుందన్నారు. ఇక ఏలూరుకు చుట్టుపక్కల ఉన్న విలీన పంచాయతీల్లోని ప్రజలకు గోదావరి జలాలను త్రాగునీరుగా అందించేందుకు అమృత్ - 2 పథకంలో భాగంగా 143 కోట్ల రూపాయలతో వివిధ పనులు చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి ఈ పనులు పూర్తిచేస్తామన్నారు. 148 కోట్ల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీల అభివృద్ధికి టెండర్లను ఆహ్వానించామన్నారు. నిధులనన్నింటినీ సమీకృతం చేసుకుంటూ ఏలూరు నగరాభివృద్ధికి అగ్రతాంబూలం ఇస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఏలూరును అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కాగా వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్నారంటూ వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే బడేటి చంటి మండిపడ్డారు. పీపీపీ విధానమంటే అందరి సమష్టి కృషికి ప్రతీక అన్నారు. తద్వారా వచ్చే ఫలాలు అందరికీ సమానంగా దక్కుతాయన్నారు. వైద్య విద్య అంటే ఏంటో ముందు అవగాహన చేసుకుని విమర్శలు చేయాలని జగన్‌కు సూచించిన ఎమ్మెల్యే చంటి,,, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సకల సదుపాయాల కల్పనే లక్ష్యంగా పిపిపి విధానాన్ని అమలు చేస్తున్నామనే విషయాన్ని గ్రహించాలని హితవు పలికారు. ఈ నిర్ణయం ప్రతిభ కలిగిన వైద్య విద్యార్థులకు మేలు చేసేదేనంటూ పేర్కొన్నారు. కోటి సంతకాల పేరుతో ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేశారంటూ ధ్వజమెత్తారు. సమావేశంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఈడా చైర్మన్ పెద్దిబోయిప శివప్రసాద్, ఎఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, డిప్యూటి మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్సెమ్మార్ పెదబాబు, మాజీ వైస్ ఎంపీపీ లంకపల్లి మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

# యువనేత మంత్రి నారా లోకేష్ ఔదార్యం

## ఆత్మకురులోని క్రీస్తు కరుణాలయం ఏఈఎల్సీ చర్చికి సొంత నిధులతో గ్రానైట్ అందజేత



మంగళగిరి రూరల్, (చైతన్యరథం): మంగళగిరి మండలం ఆత్మకురులో నూతనంగా నిర్మిస్తున్న క్రీస్తు కరుణాలయం ఏఈఎల్సీ చర్చికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో గ్రానైట్ సమకూర్చారు. చర్చి ఫ్లోరింగ్‌కు అవసరమైన రూ. 14 లక్షల విలువ చేసే గ్రానైట్‌ను తన సొంత నిధులతో కొనుగోలు చేయించి శుక్రవారం స్థానిక నాయకులు ద్వారా చర్చి నిర్వాహకులకు అందజేయించారు. చర్చి నిర్మాణానికి గ్రానైట్ అందించాలని స్థానిక నాయకుల ద్వారా నిర్వాహకులు, సంఘ పెద్దలు, చర్చి నిర్మాణ కమిటీ సభ్యులు మంత్రి నారా లోకేష్‌ను కోరగా స్పందించిన ఆయన రూ. 14 లక్షలు వెచ్చించి గ్రానైట్ ను పంపించారు. సంఘ పెద్దలు, చర్చి నిర్మాణ కమిటీ సభ్యులు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ జొన్నకూటి ఏసురత్నం, సంఘ పెద్దలు మాట్లాడుతూ అడిగిన వెంటనే మంత్రి నారా లోకేష్ రూ. 14 లక్షల విలువైన గ్రానైట్ ను కొనుగోలు చేసి ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ప్రార్థన మందిరాలు నిర్మించడం వల్ల ఆధ్యాత్మిక నెలకొంటుందని వారు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందే చర్చి నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తానని మాట ఇచ్చారని ఆ మాట ప్రకారమే గ్రానైట్ అందజేసి మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. మంత్రి నారా లోకేష్ యేసుక్రీస్తు కృపతో నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు జాలాది రత్నకుమార్, జాలాది విజయేంద్రరావు, జాలాది శివయ్య, జంగం విజయభాస్కర్, యర్రమాల అహరోను, వేమూరి ఫ్రాన్సిస్, దారా గాబ్రియేలు, కొమ్మూ జ్యోతిరాజు, చర్చి నిర్మాణ కమిటీ సభ్యులు కొమ్మూ నాగేశ్వరరావు, పాకనాటి నల్లయ్య, కాబోతు శేకర్, వేమూరి నాగరాజు, కొమ్మూ సుకుమార్, జాలాది రాజశేఖర్, శనం మాణిక్యరావు, జాలాది జానుబాబు, జాలాది రవికుమార్, జాలాది ప్రభాకర్ రావు, కుంచకర అశోక్, కనికళ్ళ చిరంజీవి, గ్రామ పార్టీ అధ్యక్షులు తాటి వెంకట్రావు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు సీఎం సహాయనిధి తోడ్పాటు

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్

పెనమలూరు, (చైతన్యరథం): పేదవారికి,ఆర్థికంగా తోడ్పాటు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపకరిస్తుందని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు. పెనమలూరు నియోజకవర్గం పోరంకి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 19 మందికి 7లక్షల78వేల 285 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పేద బడుగు వర్గాల ప్రజలు,హాస్పిటల్ వెళ్లి నగదు చెల్లించిన పేదవారికి అండగా ఉండాలనే ఉద్దేశ్యంతోముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం చేయడం వల్ల ఆయా వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని కొనియాడారు. గడచిన 18 నెలలో 1142 మందికి 10 కోట్ల 36 లక్షల రూపాయల మేర పేదవారికి ఆర్థిక సహాయం చేయడం సంతోషంగా భావిసున్నానన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పాలనాదక్షుడు సీఎం చంద్రబాబు

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన టీడీపీ నాయకులు




అవనిగడ్డ, (చైతన్యరథం): ప్రియతమ ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రదాత నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మక "బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ – 2025"అవార్డుకు ఎంపికైన సందర్భంగా అవనిగడ్డ నియోజకవర్గంలో రాజీవ్ గాంధీ సెంటర్లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తదుపరి నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక రంగంలో మునుపెన్నడూ లేని అభివృద్ధి సాధిస్తూ యువతకు ఉద్యోగ కల్పనలో మెరుగైన ఫలితాలు సాధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, యువనేత మండలి వెంకట్రామ్, చిలకలపూడి పాపారావు, కూటమి చెందిన నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో సకాలంలో సమస్యల పరిష్కారం

## చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వెల్లడి

చిలకలూరిపేట, (చైతన్యరథం): కూటమిప్రభుత్వంలో సంక్షేమ పథకాల అందజేతలో అర్హులకు అన్యాయం జరగదని, గత ప్రభుత్వంలా మోసకారీ సంక్షేమంతో ప్రజల్ని దగా చేయడం ఉండదని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ప్రజా దర్బార్) నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. ప్రజలు తాము అందించే అర్జీలను కూడా సంబంధిత ప్రభుత్వ విభాగాలకు నేరుగా పంపించేలా మనమిత్ర యాప్ ను వినియోగించుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవడం వల్ల సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని ప్రత్తిపాటి సూచించారు. ప్రజల సమస్యల్ని రియల్ టైమ్ లో వేగంగా పరిష్కరించి, వారి సంతృప్తి స్థాయిని పెంచాలన్న లక్ష్యంతో చంద్రబాబు అన్ని శాఖల్ని సాంకేతికత వైపు మళ్లించే దిశగా వినూత్న ఆలోచనలు చేస్తున్నారన్నారు.

### పింఛన్ల కేటాయింపులో కలెక్టర్లకు వెసులుబాటు.. అర్హులకు మేలు

పింఛన్లకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు అందుతాయని, అనర్హుల తొలగింపులో మాత్రం ప్రభుత్వం కచ్చితంగా వ్యవహరిస్తుందని ప్రత్తిపాటి తెలిపారు. గత ప్రభుత్వంలో దివ్యాంగుల పింఛన్ల పంపిణీలో అవకతవకలు జరిగినందునే, కూటమి ప్రభుత్వం వాటి పునఃపరిశీలనపై దృష్టి పెట్టిందన్నారు. సామాజిక పింఛన్ల కేటాయింపులో జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం కొంత వెసులుబాటు ఇచ్చిందని, దానివల్ల దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కేన్సర్ బాధితులు, దివ్యాంగులకు మేలు జరుగుతుంద న్నారు. ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధుల్ని సక్రమంగా అన్నివార్డుల్లో అభివృద్ధి పనులకు కేటాయిస్తున్నామని, కాస్త అటూ ఇటూగా పట్టణవ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజ్ లు, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనాపనులు వీలైనంత త్వరగా పూర్తిచేస్తామన్నారు. టిడ్కో గృహ సముదాయంలో మౌలిక వసతులు కల్పన చాలావరకు పూర్తయిందని, ఇళ్లు పొందినవారు విధిగా నివాసముండాల్సిందేనని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, టీడీపీ నాయకులు కనమర్లపూడి రమేష్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# వైద్య కళాశాలలపై వైసీపీ విషప్రచారం

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా పరిటాల శ్రీరామ్ ధ్వజం



ధర్మవరం, (చైతన్యరథం): మెడికల్ కళాశాలల విషయంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మడం లేదని.. ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం టీడీపీ కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన 7మందికి 4లక్షల 79వేల రూపాయల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న వారు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, పరిటాల శ్రీరామ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవలు అందక ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం కోసం భారీగా ఖర్చులు పెట్టుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నట్లు తెలిపారు. వైద్యం విషయంలో ఎవరూ ఇబ్బంది పడకూడదన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్దేశ్యం అన్నారు. ఇందుకోసం ఎన్టీఆర్ వైద్య సేవల్ని విస్తృతం చేయడంతోపాటు మెడికల్ కళాశాలల్ని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. అయితే పీపీపీ మోడల్ అంటే ప్రైవేట్ పరం అన్నట్లుగా వైసీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీకి అంత చిత్తశుద్ధి ఉంటే వారి ప్రభుత్వ హయాంలో ఎందుకు వాటిని పూర్తి చేయలేదని నిలదీశారు. వైద్యం, వైద్య విద్య అందరికీ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

### ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించినఎమ్మెల్యే ముత్తుముల



గిద్దలూరు, (చైతన్యరథం): ప్రజా సమస్యల ప్రజా వేదిక "ప్రజాదర్బార్" అని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గిద్దలూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజాదరార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో తెలియచేశారు. నివాస స్థలాలు, పక్కా గృహాలు దివ్యాంగ పెన్షన్లు, సామాజిక పెన్షన్లు, పొలాలకు విద్యుత్ సమస్యలు, గ్రామాల్లోని సమస్యల పై ప్రజలు ఎమ్మెల్యేకు అర్జీలు అందచేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేస్తుందని అందులో భాగంగానే ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా వారి సమస్యల పరిష్కారానికి తాామున్నామంటూ ప్రజా దర్బార్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్న ప్రతీ శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమంలో తమకు తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటామన్నారు.

# సాగునీటి కాలువల మరమ్మతుల్లో ప్రమాణాలు పాటించండి

### కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



కోవూరు, (చైతన్యరథం): వ్యవసాయానికి నీరే ప్రాణాధారమని ఆయకట్టు పరిధిలోని చివరి ఎకరాకు నీళు చేరాలంటే సాగునీటి కాలువలు బాగుండాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. నెల్లూరు నగరం మాగుంట లేఔట్ లోని ఆమె నివాసంలో నియోజకవర్గ పరిధిలోని సాగునీటి సంఘ అధ్యక్షులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. రానున్న రబీ సందర్భంగా సాగునీటి కాలువల నిర్వహణపై ఆమె సాగునీటి సంఘ డైరెక్టర్లు, అధ్యక్షులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ పంట పొలాలకు నీళ్లు చేర్చడంలో అధికారులు, రైతులకు మధ్య సాగునీటి సంఘ అధ్యక్షులే వారధులన్నారు. కనిగిరి రిజర్వాయర్ పరిధిలోని సదరన్ ఛానల్, ఈస్ట్రన్ ఛానల్, కొత్త వవ్వేరు ఛానల్, పైడేరు ఎస్కెప్ ఛానల్, యలమంచిపాడు చానల్స్ కు సంబంధించి ఎక్కడెక్కడ గండ్లు పడ్డాయో, ఎక్కడెక్కడ పూడిక పేరుకు పోయిందో గుర్తించి మరమత్తులు చేయించాలని ఆదేశించారు. కాలువల్లో గుర్రపుడెక్క తొలగింపు, పూడిక తీత కాలువ గట్లు పటిష్టం చేయడంపై ప్రధానంగా దృష్టి పెట్టాలని కోరారు. సాగునీటి కాలువల మరమ్మత్తుల పనులలో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని సూచించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం వెచ్చిస్తున్న ప్రతి రూపాయి సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిధుల వినియోగంలో పారదర్శకత ఉంటేనే ప్రజల్లో మనపై నమ్మకం పెరుగుతుందన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పెన్నా డెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డి, ఇరిగేషన్ అధికారులు, సాగునీటి సంఘ చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.



# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం!

ప్రొద్దుటూరు, (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలు "ప్రజా దర్బార్" నిర్వహించి ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తూ సమస్యలను తెలుసుకుంటూ త్వరితగతిన పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేలా చూడటం ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం మా ప్రధాన బాధ్యత అని అన్నారు. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తి లేదన్నారు.



యర్రగొండపాలెం ఎంపీడీవో కార్యాలయంలో అంగన్వాడీ ఉద్యోగులకు 5జీ స్మార్ట్ ఫోన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జ్ గూడూరి ఎరిక్సన్ బాబు, ఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బా రావు, యర్రగొండపాలెం మండల అధ్యక్షులు చిట్యాల వెంగళ రెడ్డి, శ్రీనివాస్, అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు



గంగాధర్ నెల్లూరు మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరించి, వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన ప్రభుత్వ విప్ గంగాధర్ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్



పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యలపై అర్జీదారులనుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



బంగారుపాళ్యం మండల ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్

# శాంతి మార్గం, ప్రేమతత్వమే క్రీస్తు సందేశం : మంత్రి నారాయణ సతీమణి రమాదేవి




నెల్లూరు, (చైతన్యరథం): క్రీస్తు సూచించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ ప్రేమ నిండిన మనసుతో జీవించాలని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి పిలుపునిచ్చారు. గోమతీ నగర్‌లోని మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో ప్రీ క్రిస్మస్ సంబరాలను మంత్రి సతీమణి రమాదేవి ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పొదలకూరు చర్చి సిబ్బంది చేసిన పరివర్తన నాటక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆసక్తిభరితంగా సాగాయి. శాంతా క్లాక్ తాత వేషధారణ చిన్నారులను ఆకట్టుకుంది. అద్భుతమైన ప్రదర్శన చేసి అందరినీ అబ్బురపరిచిన చిన్నారులను పొంగూరు రమాదేవి అభినందించారు. ఈ సందర్భంగా క్రైస్తవ మతపెద్దలు క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించి, ప్రత్యేకప్రార్థనలు చేశారు. కాండిల్స్ వెలుగులో కేక్ కట్ చేసిన రమాదేవి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. 2026 క్రిస్టియన్ క్యాలెండర్ ను ఆమె ఆవిష్కరించారు. క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ కానుకలు అందజేశారు. అనంతరం రమాదేవి ప్రసంగిస్తూ క్రిస్మస్ అంటే మానవాళికి శాంతి ,కరుణ పంచే దేవుడు భూమిమీదకు వచ్చిన రోజు అని తెలిపారు. నీతో పాటు నీ పొరుగువారిని ప్రేమించమనేది క్రీస్తు బోధనగా ఆమె పేర్కొన్నారు. తన అత్తయ్య కూడా ఇరుగు చల్లన, పొరుగు చల్లన అని పూజలు చేసేవారనీ , తనకూ అలాగే అలవాటు చేసారని గుర్తు చేశారు. క్రీస్తు సూచించిన శాంతిమార్గంలో ప్రేమతత్వంతో పయనిద్దామని పిలుపునిచ్చారు. ఈ ప్రిక్రిస్మస్ వేడుకల్లో డాక్టర్ మల్లి దొరసాని, ఐఆర్ఎస్ అధికారి ఉషాకిరణ్,క్రిస్టియన్ మత పెద్ద డేవిడ్ దయాసాగర్‌లు తమ సందేశాన్ని ఇచ్చారు.

# కదిరిలో ప్రజాదర్బార్‌కు విశేషస్పందన

## అర్జీలు స్వీకరించిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



కదిరి, (చైతన్యరథం): నియోజకవర్గంలోని కదిరి రూరల్ కుమ్మరవాండ్ల పల్లి గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కదిరి శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభించింది. ప్రజాదర్బార్‌కు కుమ్మరవాండ్లపల్లి గ్రామ పంచాయతీ ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గత ప్రభుత్వంలో సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వారిని బారికేడ్లతో నిలువరించి అనేక ఇబ్బందులకు గురిచేశారు. నేడు ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరినీ నేరుగా కలిసి విజ్ఞప్తులను స్వీకరించడంతో పాటు చిన్న చిన్న సమస్యలను అక్కడికి అక్కడే అధికారులకు చెప్పి పరిష్కరించారు. కొన్ని సమస్యల పరిష్కారానికి అధికారులకు తెలియజేసి ప్రజాదర్బార్ గ్రీవెన్స్ లో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని డిపార్ట్మెంట్లకు చెందిన అధికారులు, రూరల్ మండల నాయకులు కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం

## ప్రజా దర్బార్‌లో ధర్మవరం తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్



ధర్మవరం, (చైతన్యరథం): 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా నియోజవర్గంలో అవసరం ఉన్న చోట సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం పట్టణం ఎర్రగుంట సర్కిల్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు శ్రీరామ్‌కు తమ సమస్యలు చెప్పుకుని అర్జీలు ఇచ్చారు. ప్రతి ఒక్కరితో ఆయన ఓపిగ్గా మాట్లాడి సమస్యలు ఉన్నారు. ముఖ్యంగా ధర్మవరం పట్టణం, రూరల్ ప్రాంతాల్లో రెవెన్యూ సమస్యలను శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. కొంతమంది వ్యక్తిగత సమస్యలను కూడా వినతుల రూపంలో పరిటాల శ్రీరామ్ కు అందజేశారు. కొన్ని సమస్యలకు అక్కడిక్కడే పరిష్కారమయ్యేలా అధికారులతో మాట్లాడారు. మరికొన్నింటికి నిర్ణీత గడువులోగా పరిష్కారమయ్యే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీల్లో సిసి రోడ్లు, సీసీ డ్రైన్స్ సమస్య అధికంగా ఉందని కొందరు కార్యకర్తలు చెప్పగా, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా యుద్ధ ప్రాతిపదికన వాటిని నిర్మించేలా చూస్తామన్నారు. అత్యవసరమున్న కాలనీల్లో కొత్తగా డ్రైనేజీలు కూడా నిర్మిస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులతో శ్రీరామ్ వ్యక్తిగతంగా మాట్లాడుతూ వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ప్రజాక్షేత్రంలోనే ఉండాలని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజా దర్బార్ లో ప్రజలు ఇచ్చిన వినితులన్నింటిని సంబంధిత అధికారులకు అందజేస్తామని.. సమస్యల పరిష్కారంలో ఎక్కడా రాజీ ఉండదని శ్రీరామ్ స్పష్టం చేశారు.

# పుట్టపర్తి అభివృద్ధికి వైసీపీ మోకాలడ్డు



పుట్టపర్తి, (చైతన్యరథం): పార్టీలకతీతంగా పుట్టపర్తి అభివ ృద్ధి చేయాలనుకున్నా.అభివ ృద్ధి చేయాలనే ఉద్దేశం వైసీపీకి ఏమాత్రం లేదని పుట్టపర్తి మున్సిపల్ అత్యవసర సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పుట్టపర్తి మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి వైసీపీ చైర్మెన్ వచ్చారు. సంతకం చేసి వెళ్లారు. మిగతా వైసిపి పాలకవర్గ సభ్యులు సమావేశం నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోవడం చాలా బాధ వేసిందన్నారు. అభివ ృద్ధి చేయాలని ఆలోచనతో పార్టీలకతీతంగా ముందుకు పోతున్నా..ప్రజల సమస్యలపై వైసీపీ ప్రజా ప్రతినిధులకు ఎక్కడా చిత్తశుద్ధి లేదనీ ప్రజలకు అర్థం అవుతోంది.అక్కడ అసెంబ్లీకి రారు...ఇక్కడ మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి చైర్మెన్ మాత్రం తూతూ మంత్రంగా వచ్చి మిగతా సభ్యులు మొహం చాటేశారు.ప్రజల సమస్యలపై వైసీపీ ప్రజా ప్రతినిధులకు చిత్త శుద్ధి ఏది?అని ప్రశ్నిస్తున్నామనకు ప్రజలు ఓట్లు వేసింది ఉత్తిగా జీతాలు తీసుకోవడానికి కాదు.. ...ప్రజల సమస్యల తీర్చడానికి ప్రజలు ఎన్నికల్లో ఎన్నుకున్నారు. మనకు ఎంతో బాధ్యతాయుతమైన పదవులు కట్టబెట్టారు. ఇవి తీర్చలేకపోతే మనకు ఈ పదవులెందుకు అని ఆ పార్టీ నేతలను సూటిగా అడుగుతున్నా. ప్రజల సమస్యల కోసం శాసన సభ వేదికగా ప్రభుత్వం ద ృష్టికి తీసు కెళ్ళే బాధ్యతను ప్రజలు ఇచ్చారు. గెలుపొందిన ఆ 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో అడుగు పెట్టడానికి కూడా జంకుతున్నారు.అలాగే పుట్టపర్తి మున్సిపాలిటీ అభివ ృద్ధికి వైసీపీ పాలకవర్గం కూడా అడుగున అడ్డు పడుతోంది.పుట్టపర్తి మున్సిపాలిటీలో ఎన్నడూ లేనంతగా రెండు మసాల్లోనే 15 కోట్లతో అభివ ృద్ధి పనులు చేపట్టాం.సత్యసాయి బాబా ఆశీస్సులతో పుట్టపర్తిలో కనీవిని ఎరగని రీతిలో సత్యసాయి బాబా 100వ బర్తడే వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం,సత్యసాయి ట్రస్ట్ ,ప్రజల సహకారంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుపుకున్నాం. బాబా వేడుకలకు ప్రపంచ దేశాల నుంచి లక్షలాదిమంది భక్తులతో పాటు పలువురు ప్రముఖులు రాష్ట్రపతి ,ఉపరాష్ట్రపతి ,ప్రధాని ,పలువురు న్యాయమూర్తులు ,ముగ్గురు ముఖ్యమంత్రులు, గవర్నర్లు,కేంద్ర మంత్రులు, డిప్యూటీ సీఎం లు,రాష్ట్ర మంత్రులు, పలువురు సెలబ్రిటీలు కూడా పుట్టపర్తి కి తరలి వచ్చారు. పుట్టపర్తి అభివ ృద్ధి చేయాలనే సంకల్పం తో బాబా ఆశీస్సులతో ,ప్రజల సహకారతో ముందుకు పోతున్నా.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పుట్టపర్తి నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివ ృద్ధి వైపు పయనిస్తున్నామన్నారు.



ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌కు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సహచర పార్లమెంట్ సభ్యులతో కలిసి స్వాగతం పలికిన హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారధి, సహచర పార్లమెంట్ సభ్యులు

# సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

## ఆలూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు, (చైతన్యరథం): నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి వైకుంఠంజ్యోతి నివాసంలో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమం విశేష స్పందనతో విజయవంతంగా జరిగింది. నియోజకవర్గంలోని మూలమూలల నుండి వందలాది మంది ప్రజలు విచ్చేసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. పెన్షన్లు, రేషన్ కార్డులు, సాగునీరు, స్థానిక సమస్యలపై వచ్చిన అర్జీలను వైకుంఠం జ్యోతి స్వయంగా స్వీకరించారు. ప్రతి అర్జీని పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేసిన కార్యకర్తలకు, అభిమానులకు మరియు నియోజకవర్గ ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.




# ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

పత్తికొండ, (చైతన్యరథం): శ్యామ్ కుమార్ పత్తికొండ పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలు, వినతిపత్రాలను ఎమ్మెల్యే ి నేరుగా అందజేశారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పెన్షన్లు, గృహ నిర్మాణం, ఉపాధి హామీ, విద్యుత్, భూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు తమ సమస్యలను వివరించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని ఎమ్మెల్యే శ్యామ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజలతో నేరుగా మమేకమై వారి అవసరాలను తెలుసుకోవడమే ప్రజాదర్బార్ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు



# ఉద్రిక్తతల అనంతరం ఆటవిడుపు

**- స్పీకర్ తేనీటి విందుకు విపక్ష ఎంపీలు**



న్యూఢిల్లీ: మూడువారాల పాటు వాడివేడి చర్చలు, వాకౌట్లు, నిరసనల మధ్య జరిగిన పార్లమెంటు శీతాకాల సమావేశాల అనంతరం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడటంతో సభలోని వాతావరణాన్ని తేలిక చేసేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం ఉదయం ఎంపీలందరికీ తన నివాసంలో తేనేటి విందు ఇచ్చారు. గత సమావేశాల మాదిరిగా కాకుండా ఈ టీ పార్టీకి విపక్ష ఎంపీలు కూడా హాజరయ్యారు. స్నేహపూర్వక వాతావరణంలో సరదా ముచ్చట్లతో సభ్యులంతా సందడిగా గడిపారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ జర్మనీ పర్యటనలో ఉండటంతో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా.. స్పీకర్ ఇచ్చిన టీ పార్టీలో పాల్గొని విపక్షం తరపున ప్రాతినిధ్యం వహించారు. 20 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీతో పాటు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూర్చుని ఉండగా ఆయన పక్కన ప్రియాంక ఆసీనులయ్యారు. తన నియోజకవర్గం వయనాడ్ నుంచి తెచ్చుకున్న ఒక మూలికను ఎలర్జీ రాకుండా తీసుకుంటూ ఉంటానని ప్రియాంక ఈ సందర్భంగా వివరించారట. మోదీ ఇటీవల జరిపిన ఇథియోపియా, జోర్డాన్, ఒమన్ పర్యటన గురించి ప్రియాంక అడగగా, బాగా జరిగిందని ఆయన బదులిచ్చారు. సమాజ్‌వాదీ పార్టీ నేత ధర్మేంద్ర యాదవ్, ఎన్‌సీపీ (ఎస్‌పీ) నేత సుప్రియా సులే, సీపీఐ నేత డి.రాజా కూడా సమావేశంలో పాల్గొన్నారు.

శీతాకాల సమావేశాలను మరికొద్ది రోజులు పొడిగించి ఉండాల్సిందని ధర్మేంద్ర యాదవ్ అభిప్రాయపడగా, ఆయనకు గొంతు నొప్పి రాకుండా ఇక్కడితో ముగించామని మోదీ సరదాగా బదులిచ్చారు. బాగా ప్రిపేర్ అయి సభకు వచ్చారంటూ ఎన్‌కే రామచంద్రన్, తదితర విపక్ష ఎంపీలను పీఎం అభినందించారు. పాత పార్లమెంటు భవనంలో మాదిరిగానే న్యూ పార్లమెంట్ బిల్డింగ్‌లో ఎంపీల కోసం ఒక సెంట్రల్ హాల్ చేర్చాలని ప్రధాని మోదీని పలువురు ఎంపీలు కోరారు. సెంట్రల్ హాలులో ఎంపీలు, రిటైరైన ఎంపీలు చర్చించుకునే వారన్నారు. దీనిపై మోదీ సరదాగా స్పందించారు. అది రిటైర్‌మెంట్ తర్వాత కదా...ఇంకా మీరు చాలా సేవ చేయాల్సి ఉంది.. అని అనడంతో సమావేశంలో నవ్వులు వెల్లివిరిసాయి

### విపక్షాల హాజరుకు కారణం ఏమిటంటే?

విపక్ష పార్టీ సభ్యులను సభలో మాట్లాడేందుకు అనుమతించడం లేదని ఆరోపిస్తూ గత పర్యాయం స్పీకర్ ఇచ్చిన టీ పార్టీని రాహుల్, ఇతర విపక్ష నేతలు బాయ్‌కాట్ చేశారు. అయితే ఈసారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో విపక్షాల విషయంలోనూ స్పీకర్ సముచితంగా వ్యవహరించారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అభిప్రాయ పడ్డారని, స్పీకర్ టీ పార్టీకి విపక్ష ఎంపీలంతా తప్పనిసరిగా హాజరుకావాలనే నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.

# శబరిమల బంగారం చోరీ కేసు..

**- దర్యాప్తు ఈడీకి అప్పగింత**

తిరువనంతపురం: శబరిమల అయ్యప్ప దేవాలయంలో జరిగిన బంగారం చోరీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి దర్యాప్తు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు కేరళలోని కొల్లాం విజిలెన్స్ కోర్టు అనుమతిచ్చింది. ఈ సందర్భంగా కేసులో కీలక పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలు సహా సంబంధిత దస్త్రాలను కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఆదేశించింది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు నమోదైన రెండు ఎఫ్‌ఐఆర్ కాపీలు, అరెస్టయిన ఏడుగురికి సంబంధించి సిట్ దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టులు సహా ఇతర కీలక దస్త్రాలను ఈడీకి తక్షణమే ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. తద్వారా ఈడీ దీనిపై మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద కేసు నమోదు చేయనుందని సమాచారం. ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) నమోదు చేయాలంటే పోలీసు డాక్యుమెంట్లు తప్పనిసరి అని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంలో ఈడీ ఇప్పటికే ప్రాథమిక దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది.



సంచలనం రేపిన శబరిమల ఆలయంలో ని విగ్రహాల బంగారు తాపడం బరువులో వ్యత్యాసం కేసుపై రాష్ట్ర ప్రభుత్వం నియ మించిన సిట్ దర్యాప్తు చేస్తోంది. ఈ సమ యంలో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టేందుకు అనుమతించాలని కోరుతూ ఈడీ.. తొలుత కేరళ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు సూచన మేరకు కొల్లాం విజిలెన్స్‌కోర్టులో పిటిషన్ వేయగా.. కేంద్ర దర్యాప్తు బృందం విజ్ఞప్తిని సిట్ వ్యతిరేకించింది. ఒకేసారి రెండూ కొనసాగడం దర్యాప్తును ప్రభావితం చేస్తాయని అభిప్రాయపడింది. అయినప్పటికీ విజిలెన్స్ కోర్టు మాత్రం ఈడీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

### బెట్టింగ్ యాప్‌ల కేసు..

## యువరాజ్, సోనూసూద్ ఆస్తులు జప్తు

న్యూఢిల్లీ: బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసులో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, బాలీవుడ్ నటులు సోనూసూద్, నేహాశర్మ ఆస్తుల్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. ఆ జాబితాలో నటి ఊర్వశీ రౌతేలా తల్లితో పాటు టీఎంసీ మాజీ ఎంపీ మిమీ చక్రవర్తి. అంకుశ్ హజ్రా (బెంగాలీ నటుడు) కూడా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు సంస్థ వీరిని ఇప్పటికే విచారించగా.. తాజాగా అటాచ్ చేసిన ఆస్తుల విలువ రూ.7.93 కోట్లని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

గతంలో మాజీ క్రికెటర్లు సురేష్ రైనా, శిఖర్ ధావన్‌కు చెందిన రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఇద్దరు మాజీ క్రికెటర్లు అన్ని విషయాలు తెలిసే 1ఇదీవత్రీ దాని అనుబంధ సంస్థల ప్రమోషన్ కోసం విదేశీ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారని గుర్తించింది.. ఈ నేపథ్యంలోనే శిఖర్ ధావన్‌కు చెందిన రూ.4.5 కోట్ల స్థిరాస్తిని, సురేష్ రైనాకు చెందిన రూ.6.64 కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్లను సీజ్ చేసేందుకు



మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల పార్లమెంట్ వేదికగా రియల్ మనీ ఆన్‌లైన్ గేమింగులను బ్యాన్ చేసిన సంగతి తెలిసిందే.

## ఎక్స్‌లో ప్రధాని మోదీ హవా!



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుకుగా ఉంటారు. విదేశాల సందర్శనలు, ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన విషయాలను 'ఎక్స్'లో పంచుకుంటారు. తాజాగా ఎక్స్ నిర్వహించిన "మోస్ట్ లైక్‌డ్" సర్వేలో మోదీ హవా కొనసాగుతోంది. గత 30 రోజుల్లో భారత్‌లో అత్యధిక లైక్‌లు పొందిన 10 ట్వీట్లలో 8 ట్వీట్లు ప్రధానివే ఉన్నట్లు సోషల్ మీడియా సంస్థ వెల్లడించింది. వీటిలో రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటనకు వచ్చినప్పుడు ఆయనకు ప్రధాని భగవద్గీత (రష్యా ఎడిషన్)ను బహుమతిగా ఇచ్చిన పోస్టు 6.7 మిలియన్ల వ్యూస్, 2 లక్షలకు పైగా లైకులతో మొదటి స్థానంలో ఉంది. మిగిలిన స్థానాల్లో పుతిన్ పర్యటనకు సంబంధించిన రెండు పోస్టులు, వేదమూర్తి దేవవ్రత్ గురించి చేసిన పోస్టు, అయోధ్యలో ధ్వజారోహణ పోస్టు, ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్‌కు వివాహ శుభాకాంక్షలు చెప్పిన పోస్టు, టీ20 వరల్డ్ కప్‌లో భారత అంధ మహిళల క్రికెట్ జట్టు విజయం సాధించిన పోస్టు, ప్రధాని ఒమన్‌కు వెళ్లినప్పుడు అక్కడి ప్రభుత్వం ఆయనకు అత్యున్నత పురస్కారం అందించిన పోస్టులు ఉన్నాయి.

## రెండున్నరేళ్ల ఒప్పందమేదీ లేదు

**- సిద్ధరామయ్య**



బెళగావి: కర్ణాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాలపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరోసారి స్పందించారు. రెండున్నరేళ్ల పాటు సీఎం పదవిని పంచుకోవాలనే ఒప్పందం అనేదే లేదని, తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని చెప్పారు. సీఎం పదవీకాలంపై విపక్షాలు పదేపదే ప్రశ్నిస్తుండటంపై ముఖ్యమంత్రి శుక్రవారం మాట్లాడుతూ, పార్టీ అధిష్టానం నిర్ణయించేంత వరకూ తానే ముఖ్యమంత్రినని చెప్పారు. మొదట ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారు. ఆ తర్వాత లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో శాసనసభ్యులు తమ నేతను ఎన్నుకున్నారు.

ఆ తర్వాత అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఇంతమాత్రమే చెప్పగలను. ఇప్పటికీ నేనే సీఎంను. అధిష్టానం నిర్ణయం తీసుకునేంత వరకూ సీఎంగానే కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. రెండున్నరేళ్ల పదవీకాలం గురించి తానెప్పుడూ చెప్పలేదని, అలాంటి అగ్రిమెంట్ కూడా ఏదీ లేదని ఆయన వివరణ ఇచ్చారు.

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం పగ్గాలు అప్పగించనున్నారంటూ ఇటీవల ఊహాగానాలు ఊపందుకోవడంతో పార్టీ అధిష్టానం జోక్యం చేసుకుంది. ఒకరినొకరు విందు సమావేశాలకు ఆహ్వానించుకుని కూర్చుని మాట్లాడుకోవాలని సూచించింది. దీంతో తొలుత సిద్ధరామయ్య డీకేను బ్రేక్‌ఫాస్ట్ కోసం తన ఇంటికి ఆహ్వానించారు. అనంతరం డీకే సైతం సిద్ధరామయ్యకు విందు ఇచ్చారు. కాగా, సిద్ధరామయ్య–డీకే మధ్య గొడవల కారణంగా రాష్ట్ర ప్రయోజనాలను నిర్లక్ష్యానికి గురవుతున్నాయంటూ బీజేపీ విమర్శలు గుప్పిస్తోంది.



# కమ్మేసిన పొగమంచు..ఢిల్లీకి రెడ్ అలర్ట్

**- 150కి పైగా విమాన సర్వీసులు రద్దు**

న్యూఢిల్లీ: ఉత్తర భారతాన్ని పొగమంచు కప్పేసింది. దాంతో శుక్రవారం ఉదయం 100 మీటర్ల దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రాజధాని ఢిల్లీకి భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రోడ్డు, రైలు, వాయు మార్గాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని హెచ్చరించింది. దానికి తగ్గట్టే 150కి పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. మరో 200 సర్వీసుల్లో జాప్యం చోటుచేసుకుంది. ఈ అంతరాయాలు కొనసాగుతాయని ఢిల్లీ ఎయిర్ పోర్ట్ వెల్లడించింది. పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాలను దట్టమైన పొగమంచు కప్పేసిందని, ఉపగ్రహ చిత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఉదయం 5.30 గంటల సమయంలో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా, బరేలీ, షహరాన్‌పూర్, గోరఖ్‌పూర్, పంజాబ్ లోని అంబాలా, అమృత్‌సర్, లూథియానా, ఆదంపూర్, ఢిల్లీ, హర్యానా, మధ్యప్రదేశ్, బీహార్లోని పలు ప్రాంతాల్లో ఎదురుగా వస్తోన్న వాహనాలు ఏమాత్రం కనిపించని పరిస్థితి నెలకొంది. కాగా.. వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఢిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన కఠినమైన చర్యలు అమల్లోకి వచ్చాయి. కాలుష్య నియంత్రణ ధ్రువపత్రం (పీయూసీ) లేని వాహనాలకు ఢిల్లీ పెట్రోలు బంకుల్లో ఇంధనం నింపడాన్ని నిలిపివేశారు. ఈ నిబంధనలను కఠినంగా అమలుచేసేందుకు ఢిల్లీ సరిహద్దుల వద్ద పోలీసు, రవాణాశాఖ బృందాలను మోహరించారు.

అంతర్జాతీయం




# బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు

**ఇంక్విలాబ్ మంచ్ కన్వీనర్ షరీఫ్ మృతితో ఘర్షణలు**
**పత్రికా కార్యాలయాలపై అల్లరిమూకల దాడి..**
**భారతీయులకు అడ్వైజరీ జారీ చేసిన హై కమిషన్**
**జర్నలిస్టులకు యూనస్ సర్కారు క్షమాపణ**

బంగ్లాదేశ్‌లో కొన్నాళ్ల క్రితం జరిగిన కాల్పుల్లో గాయపడిన ఇంక్విలాబ్ మంచ్ కన్వీనర్ షరీఫ్ ఉస్మాన్ బిన్ హాదీ సింగపూర్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

దీంతో బంగ్లా రాజధాని ఢాకా సహా పలుచోట్ల తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. చత్తోగ్రామ్‌లోని భారత అసిస్టెంట్ హైకమిషన్ కార్యాలయాన్ని రాత్రి 11 గంటల సమయంలో ఆందోళనకారులు ముట్టడించారు. భారత్, అవామీలీగ్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

### పత్రికా కార్యాలయాలపై అల్లరిమూకల దాడి..

బంగ్లాదేశ్‌లోని డెయిలీ స్టార్ పత్రికా కార్యాలయంపై అల్లరిమూకలు దాడికి పాల్పడ్డాయి. ఢాకాలోని కర్వాన్ బజార్‌లోని కార్యాలయానికి నిప్పుపెట్టారు. గంటలతరబడి శ్రమించి దాదాపు 25మంది జర్నలిస్టులను అగ్నికీలల నుంచి కాపాడారు.

వీరిలో మహిళా జర్నలిస్టులూ ఉన్నారు. రెండు అంతస్తులు అగ్నికీలల్లో చిక్కుకొన్నాయి. బెంగాలీ పత్రిక ప్రోథోమ్ అలో కార్యాలయంపైనా అల్లరి మూకలు దాడులు జరిపారు. దుండగులతో మాట్లాడేందుకు యత్నించిన న్యూఏజ్ పత్రిక ఎడిటర్ నూరుల్ కబీర్‌పైనా దాడి జరిగింది. దీంతో బంగ్లాదేశ్‌లో ప్రధాన పత్రికలు నేడు తమ కార్యకలాపాలను సస్పెండ్ చేశాయి. బంగ్లాదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రహమాన్ కుటుంబానికి ధన్మోండీ 32 ఏరియాలో ఉన్న ఇంటిని ఆందోళనకారులు ధ్వంసం చేశారు. ప్రస్తుతం ఆ ఇంటిని మ్యూజియంగా వాడుతున్నారు.

### భారతీయులకు అడ్వైజరీ

ఉద్రిక్త పరిణామాల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని భారత హైకమిషన్ అడ్వైజరీ జారీ చేసింది. భారతీయులంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. "ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా.. ఈ దేశంలో నివసిస్తున్న భారతీయులు, భారత విద్యార్థులు అనవసర ప్రయాణాలు చేయొద్దు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు. ఏదైనా ఎమర్జెన్సీ అయితే సాయం కోసం హైకమిషన్, అసిస్టెంట్ హైకమిషన్ కార్యాలయాలను సంప్రదించండి" అని భారత దౌత్యాధికారులు తమ అడ్వైజరీలో వెల్లడించారు.

### జర్నలిస్టులకు యూనస్ సర్కారు క్షమాపణ

బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు నేపథ్యంలో మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం స్పందించింది. ఆందోళనకారులు సంయమనం పాటించాలని, హింసకు దూరంగా ఉండాలని అభ్యర్థించింది. అలాగే జర్నలిస్టులకు క్షమాపణలు చెప్పింది. హిందూ వ్యక్తిపై జరిగిన మూకదాడిని తీవ్రంగా ఖండించింది. "ది డైలీ స్టార్, న్యూ ఏజ్, ప్రోథోమ్ అలో పాత్రికేయులకు మేం అండగా నిలుస్తాం. మీరు ఎదుర్కొన్న హింసపై తీవ్రంగా చింతిస్తున్నాం. ఈ హింసను ఎదుర్కొనే క్రమంలో మీరు చూపిన ధైర్యాన్ని ఈ దేశం చూసింది. మీకు పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇస్తున్నాం" అని ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది.

## 'రియల్ హీరో'కు భారీ నజరానా

**-సిడ్నీ ఉగ్రకాల్పుల ఘటన**




సిడ్నీలోని బోండీ బీచ్‌లో ఉగ్ర కాల్పుల ఘటనలో అహ్మద్ అల్ అహ్మద్ అనే వ్యక్తి ఉగ్రవాదులకు ఎదురొడ్డి ఎంతోమంది ప్రాణాలు కాపాడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న 'సిడ్నీ రియల్ హీరో'కు గో ఫండ్ మీ సంస్థ 2.5 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్ల (దాదాపు రూ.14 కోట్లు) చెక్కును అందించింది. ప్రపంచవ్యాప్తంగా 43వేలమంది దాతలనుంచి ఈ మొత్తాన్ని సేకరించారు. ఇందుకు సంబంధించిన చెక్కును తీసుకున్న అనంతరం అహ్మద్ మీడియాతో మాట్లాడుతూ సంతోషం వ్యక్తంచేశారు. మనుషులంతా ఒకరికొకరు తోడుగా ఉండాలని, ఇతరుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్న సమయంలో వారిని రక్షించడానికి శాయశక్తులా ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను ఎదుర్కొనే సమయంలో నిందితుడు.. అతడి చేతిపై పలు రౌండ్ల కాల్పులు జరపడంతో అహ్మద్ తీవ్రంగా గాయపడినట్టు ఆస్ట్రేలియన్స్ ఫర్ సిరియా అసోసియేషన్ ప్రతినిధి లుబాబా పేర్కొన్నారు. అతడి చికిత్సకయ్యే ఖర్చుల కోసం నిధులు సేకరిస్తున్నట్టు తెలిపారు.

## డిఫెన్స్ పాలసీపై ట్రంప్ ముందడుగు

**- భారత్‌తో బలమైన బంధానికి ప్రయత్నం**



భారత్‌తో సంబంధాలు బలోపేతం చేసుకోవడానికి అమెరికా ముందడుగు వేసింది. ఇండో- పసిఫిక్ ప్రాంతంలో చైనాతో జరుగుతోన్న వ్యూహాత్మక పోటీలో ఆధిపత్యం పొందేందుకు.. క్వాడ్ కూటమి ద్వారా భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవాలన్న వార్షిక డిఫెన్స్ పాలసీ బిల్లుపై ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశారు. దేశీయ, విదేశీ బెదిరింపుల నుంచి మాతృభూమిని రక్షించడానికి, రక్షణ పారిశ్రామికరంగ పునాదులను బలోపేతం చేయడానికి ఈ చట్టం వీలు కల్పిస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. భారత్‌తో డిఫెన్స్‌రంగంలో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లినప్పుడే ఇండో-పసిఫిక్‌లో చైనాపై ఆధిపత్యం సాధ్యమవుతుందని వెల్లడించారు. ప్రస్తుతం ట్రంప్ సంతకం చేసిన ది నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్ -2026లో భారత్ డిఫెన్స్ రంగంలో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం, క్వాడ్ ద్వారా స్వేచ్ఛాయుతమైన బహిరంగ ఇండో-పసిఫిక్ ప్రాంత ఉమ్మడి లక్ష్యాన్ని సాధించడం, చైనాతో వ్యూహాత్మక పోటీలో అమెరికా ప్రయోజనాలను పెంచడం వంటివి ఉన్నాయి. ఈ బిల్లు అమల్లోకి వస్తే ఇరుదేశాలు సంయుక్త సైనిక విన్యాసాలలో పాల్గొనడం, రక్షణ వాణిజ్యం, విపత్తు సమయాల్లో మానవతా సాయం, సముద్ర భద్రత విషయంలో సహకారంవంటి ప్రయోజనాలు ఉండనున్నట్టు తెలుస్తోంది.

# గ్రీన్‌కార్డ్ లాటరీ ప్రోగ్రామ్ నిలిపివేత

***- బ్రౌన్ యూనివర్సిటీలో కాల్పుల ఎఫెక్ట్***



గ్రీన్‌కార్డ్ లాటరీ ప్రోగ్రామ్‌ను నిలిపివేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల అగ్రరాజ్యంలో బ్రౌన్ యూనివర్సిటీలో కాల్పుల ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఆ కాల్పుల్లో ఇద్దరు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. పోర్చుగీస్ జాతీయుడైన నిందితుడు అమెరికాలోకి ప్రవేశించడానికి ఈ లాటరీ విధానం కారణమైందని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. ఈమేరకు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ ప్రోగ్రామును నిలిపివేయాలని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్‌ను ఆదేశించారు. "ఇలాంటి దారుణమైన వ్యక్తులను మన దేశంలోకి ఎన్నటికీ అనుమతించకూడదు" అని రాసుకొచ్చారు. డైవర్సిటీ వీసా ప్రోగ్రామ్‌నే గ్రీన్‌కార్డు లాటరీ ప్రోగ్రామ్‌గా పిలుస్తుంటారు. ఇమిగ్రేషన్ అండ్ నేషనాలిటీ యాక్ట్‌కింద స్టేట్ డిపార్ట్మెంట్ ఈ డైవర్సిటీ వీసా ప్రోగ్రామ్ పనితీరును పర్యవేక్షిస్తుంది. దీనికింద ఏటా 55 వేలవరకు గ్రీన్ కార్డులను అందుబాటులో ఉంచుతుంది. ఇతర దేశాలనుంచి అమెరికాకు వచ్చే జనాభాలో భిన్న జాతీయులు ఉండేలా దీనిని జారీ చేస్తుంటారు. ఈ వీసా ద్వారానే పోర్చుగీస్ జాతీయుడైన నిందితుడు అమెరికాలోకి ప్రవేశించాడు.

# అదేబాటలో ఈయూ..

***- అమెరికా తరహాలో భారత శరణార్థుల సంఖ్యలో కోత***



శరణార్థుల విషయంలో అమెరికా బాటలోనే ఐరోపా సంఘం నడుస్తోంది. భారత్ సహా ఏడు దేశాలనుంచి వచ్చే శరణార్థుల అభ్యర్థనలను తక్కువగా తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాలో భారత్‌తోపాటు బంగ్లాదేశ్, కొలంబియా, ఈజిప్ట్, కొసావో, మొరాకో, ట్యునీషియాలు ఉన్నాయి. ఈ దేశాలను సురక్షిత దేశాలుగా పరిగణిస్తూ ఈ మేరకు నిర్ణయించింది. దీనిపై మానవ హక్కుల సంఘాలనుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సాయుధ ఘర్షణలవంటి సందర్భాలలో విచక్షణారహిత హింస చోటుచేసుకోని దేశాలను తాము సురక్షితమని భావిస్తున్నట్టు ఐరోపా వెల్లడించింది. ఈమేరకు ఐరోపా పార్లమెంట్, యూరోపియన్ కౌన్సిల్ మధ్య జరిగిన ఒప్పందం వెల్లడి చేస్తోంది. ఈ నిబంధన తమకు వర్తించదని దరఖాస్తుదారులు నిరూపించుకోవాల్సి ఉంటుంది. 2026 జూన్‌నుంచి అమల్లోకి రానున్న ఈ ఒప్పందాన్ని రానున్న రోజుల్లో ఇతర దేశాలకు విస్తరించనున్నారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత ఆయా దేశాలు సురక్షితమని భావిస్తే తిరిగి ఈ శరణార్థులను వారి దేశాలకు పంపించే అవకాశం ఉంది. అయితే శారీరక హింసకు గురయ్యే ప్రమాదం ఉన్నవారిని మాత్రం తిరిగి వారి దేశాలకు పంపకుండా మినహాయింపు ఇవ్వనున్నారు.

వలసదారులపై కఠిన విధానాలు అమలుచేస్తోన్న డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కూడా శరణార్థులకు ఇచ్చే వర్క్ పర్మిట్ కాలవ్యవధిని కుదిస్తున్నట్టు యూఎస్ సిటిజన్‌షిప్, ఇమిగ్రేషన్ సర్వీసెస్ ఇటీవల ప్రకటనలో తెలిపింది. శరణార్థులు, ఆశ్రయం పొందాలనుకునేవారు, గ్రీన్‌కార్డు కోసం ఎదురు చూస్తున్నవారికి అమెరికాలో ఉద్యోగం చేసుకునేందుకు ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ కార్డ్ కింద అనుమతులు జారీ చేస్తారు. దీనికి ఐదేళ్ల కాలవ్యవధి ఉండేది. ఈ సవరణలతో దాన్ని 18 నెలలకు కుదించారు. భద్రతా కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు యూఎస్ సీఐఎస్ తెలిపింది.

# చివరి మ్యాచ్‌లో సఫారీలు చిత్తు

- భారత్‌దే టీ 20 సిరీస్
- అహ్మదాబాద్‌లో టీమిండియా ఘన విజయం
- బ్యాటింగ్‌లో తిలక్, హార్దిక్ మెరుపులు.. బౌలింగ్‌లో వరుణ్ మాయాజాలం

ఈ ఏడాదిని టీమ్ ఇండియా ఘనంగా ముగించింది. దక్షిణాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌ను కైవసం చేసుకుంది. అహ్మదాబాద్ వేదికగా శుక్రవారం జరిగిన చివరి మ్యాచ్లో సౌతాఫ్రికాపై 30 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 20 ఓవర్లలో 231/5 స్కోరు చేసింది. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో సఫారీ జట్టు 8 వికెట్లను కోల్పోయి 201 పరుగులు చేయగలిగింది. దీంతో 30 పరుగుల తేడాతో భారత్ గెలిచింది. ఐదు టీ20ల సిరీస్ ను 3-1 తేడాతో భారత్ సొంతం చేసుకుంది. సిరీస్‌లో నాలుగో మ్యాచ్ మంచు ప్రభావం కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. దీంతో భారత పర్యటనను దక్షిణాఫ్రికా ఓటమితో




ముగించింది. తొలుత టెస్టు సిరీస్‌ను నెగ్గిన సఫారీ జట్టు.. వన్డే, టీ20 సిరీస్‌లు కోల్పోయింది.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు భారత బ్యాటర్లు షాకిచ్చారు. ఓపెనర్లు సంజూ శాంసన్ (37), అభిషేక్ శర్మ (34) తొలి వికెట్‌కు 63 పరుగులు జోడించారు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (5) మరోసారి త్వరగానే ఔటైనా వన్‌డౌన్‌లో వచ్చిన తిలక్ వర్మ (42 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్స్‌తో 73) వేగంగా ఆడాడు. ఆ తర్వాత హార్దిక్ పాండ్యా (25 బంతుల్లో 5 సిక్స్‌లు, 5 ఫోర్లతో 63) బౌండరీలతో హోరెత్తించాడు. వీరి అండతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 231 పరుగులు సాధించింది.

లక్ష్య ఛేదనను సౌతాఫ్రికా ధాటిగానే ప్రారంభించింది. ఓపెనర్లు రీజా హెండ్రిక్స్, క్వింటన్ డి కాక్ తొలి వికెట్‌కు 69 పరుగులు జోడించారు. ఇన్నింగ్స్‌లో 6 ఓవర్ 3వ బంతికి హెండ్రిక్స్‌ను వరుణ్ చక్రవర్తి ఔట్ చేసి భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. తరువాత కూడా సౌతాఫ్రికా జట్టు బలంగానే పోరాడింది. 120/1తో పటిష్టంగానే కనిపించింది. ఇన్నింగ్స్ పదో ఓవర్ 2వ బంతికి డికాక్ (65, 35 బంతులు, 9 ఫోర్లు, 3 సిక్సులు)ను జస్‌ప్రీత్ బుమ్రా (కాట్ అంట్ బౌల్డ్) ఔట్ చేయటంతో మ్యాచ్ స్వరూపం మారిపోయింది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ మాయాజాలంతో ఆ తరువాత సౌతాఫ్రికా వరుసగా వికెట్లు కోల్పోయి ఓటమి పాలయింది. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 4, బుమ్రా 2, అర్షదీప్, హార్దిక్ చెరో వికెట్ తీసుకున్నారు.



డెవాన్ కాన్వే డబుల్ సెంచరీ

## న్యూజిలాండ్ భారీస్కోర్

- వెస్టిండీస్‌తో మూడో టెస్ట్

వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడో టెస్టులో న్యూజిలాండ్ స్టార్ ఓపెనర్ డెవాన్ కాన్వే డబుల్ సెంచరీతో చెలరేగాడు. ఈ వికెట్ కీపర్ బ్యాటర్ 316 బంతుల్లో తన రెండో టెస్టు డబుల్ సెంచరీ సాధించాడు. దీనికి తోడు మరో ఓపెనర్, కెప్టెన్ టామ్ లాథమ్ కూడా సెంచరీ చేయటంతో ఈ టెస్ట్‌లో న్యూజిల్యాండ్ 8 వికెట్ల నష్టానికి 575 పరుగుల భారీ స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ రెండోరోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 110 పరుగులు సాధించింది. జాన్ క్యాంప్‌బెల్ 45 (60 బంతుల్లో), బ్రెండన్ కింగ్ 55 (78) పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు.

178 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన కాన్వే దూకుడుగా ఆడి తన ద్విశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. 367 బంతులు ఎదుర్కొన్న కాన్వే.. 31 ఫోర్ల సాయంతో 508 పరుగులు చేశాడు. ఇంతకుముందు ఇంగ్లండ్ పై కాన్వే తన తొలి డబుల్ సెంచరీని సాధించాడు.

**కాన్వే-లాథమ్ వరల్డ్ రికార్డు..**

ఈ మ్యాచ్‌లో డెవాన్ కాన్వేతో పాటు మరో ఓపెనర్ కెప్టెన్ టామ్ లాథమ్ కూడా (246 బంతుల్లో 137: 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ చేశాడు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్కు 323 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. తద్వారా న్యూజిలాండ్ గడ్డపై అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం సాధించిన జోడీగా లాథమ్- కాన్వే చరిత్ర సృష్టించారు. అదేవిధంగా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) చరిత్రలో ఇదే అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం కావడం విశేషం. సౌతాఫ్రికాతో టెస్టులో 2019లో టీమిండియా ఓపెనర్లు రోహిత్ శర్మ- మయాంక్ అగర్వాల్ తొలి వికెట్‌కు 317 పరుగులు జోడించగా.. లాథమ్- కాన్వే ఈ రికార్డును బ్రేక్ చేశారు.

## అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌కు భారత్

- సెమీస్‌లో శ్రీలంకపై విజయం

ఏసీసీ మెన్స్ అండర్-19 ఆసియా కప్-2025 టోర్నమెంట్లో భారత్ ఫైనల్‌కు దూసుకువెళ్లింది. సెమీ ఫైనల్లో శ్రీలంకను చిత్తు చేసి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఈ టోర్నీలో ఆయుశ్ మాత్రే సారథ్యంలోని భారత జట్టు గ్రూప్-ఏలో భాగంగా యూఏఈ, పాకిస్తాన్, మలేసియా జట్లను ఓడించి అజేయంగా సెమీస్‌కు చేరింది. ఈ క్రమంలో శుక్రవారం నాటి తొలి సెమీ ఫైనల్లో శ్రీలంకతో తలపడి విజయం సాధించింది.

దుబాయ్‌లో వాన పడిన కారణంగా టాస్ అలస్యమైంది. వర్షం ఆగినా అవుట్ ఫీల్డ్ చిత్తడిగా ఉన్న కారణంగా ఈ యూత్ వన్డేను 20 ఓవర్లకు కుదించారు. టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకోగా.. శ్రీలంక బ్యాటింగ్‌కు దిగింది. భారత బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది ఏకెట్ల నష్టానికి 138 పరుగులే చేసింది.

లంక ఓపెనర్లు విరాన్ చముదిత (19), దుల్నెత్ సిగెరా (1) విఫలం కాగా... వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ విమత్ దిన్సారా (32) ఫర్వాలేదనిపించాడు. మిగిలిన వారిలో చమిక హీనతిగల 42 పరుగులతో లంక తరపున టాప్ స్కోరర్‌గా నిలవగా.. లోయర్ ఆర్డర్లో సెత్మిక సెనెవిరత్న 30 పరుగులతో రాణించాడు. మిగిలిన వారిలో కవిజ గమాగే (2), కిత్మా వితనపతిరన (7). ఆధమ్ హిల్మీ (1) సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితం అయ్యారు..

భారత బౌలర్లలో హెనిల్ పటేల్, కనిష్ చౌహాన్ చెరో రెండు వికెట్లు తీయగా.. దీపేశ్ దేవేంద్రన్, కిషన్ కుమార్, ఖిలన్ పటేల్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. ఇక నామమాత్రపు లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ కు.. ఆదిలోనే షాక్ తగిలింది. ఓపెనర్లలో కెప్టెన్ ఆయుశ్ శర్మ (7), వైభవ్ సూర్యవంశీ (9) దారుణంగా విఫలమయ్యారు. రసిత్ నిమ్సారా వీరిద్దరిని పెవిలియన్కు పంపాడు. అయితే, వన్ డౌన్ బ్యాటర్ ఆరోన్ జార్జ్, విహాన్ మల్హోత్రాతో కలిసి వేగంగా పరుగులు రాబట్టి ఇద్దరూ హాఫ్ సెంచరీలు సాధించారు. ఆరోన్ 49 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్ బాది 58 పరుగులతో... విహాన్ 45 బంతుల్లోనే 4 ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 61 పరుగులతో అజేయంగా నిలిచారు. వీరిద్దరి అద్భుత ప్రదర్శన కారణంగా




భారత్ 18 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే నష్టపోయి 139 పరుగులు చేసింది. ఫలితంగా ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపొంది ఫైనల్‌కు దూసుకువెళ్లింది. ఆరోన్, విహాన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు పంచుకున్నారు.

టీ 20 ప్రపంచకప్..

## నేడు భారత జట్టు ప్రకటన

టీ20 ప్రపంచకప్-2026కు భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించనుంది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ముంబైలోని వాంఖడే స్టేడియంలో సమావేశం కానుంది. అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అగార్కర్ జట్టును ప్రకటించనున్నాడు. ఈ మెగా టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7 నుంచి ఈ పొట్టి ప్రపంచకప్ ప్రారంభం కానుంది. ఈ టోర్నీ గ్రూపు-ఏలో టీమిండియా ఉంది. టీమిండియాతో పాటు పాకిస్తాన్, యూఎస్ఏ, నమీబియా, నెదర్లాండ్స్ ఇదే గ్రూప్‌లో ఉన్నాయి. ఈ మెగా ఈవెంట్‌కు ముందు న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ సిరీస్‌లో టీమిండియా తలపడనుంది. ఈ సిరీస్ ముగిశాక నేరుగా టీ20 ప్రపంచకప్‌లో అడుగుపెట్టనుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్.. తన తొలి మ్యాచ్‌లో ఫిబ్రవరి 7న యూఏఈతో తలపడనుంది.

హెడ్ అజేయ సెంచరీ..

## 356 పరుగుల ఆధిక్యంలో ఆసీస్

యాషెస్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్ వేదికగా ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న మూడో టెస్టులో ఆస్ట్రేలియా భారీ ఆధిక్యం దిశగా దూసుకెళుతోంది. మూడో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఆసీస్ 66 ఓవర్లకు నాలుగు వికెట్లు కోల్పోయి 271 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ లీడ్‌తో కలిపి ఆసీస్ ఇప్పటికే 356 పరుగుల భారీ ఆధిక్యాన్ని సాధించింది. ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ (142 నాటౌట్, 196 బంతుల్లో, 13 ఫోర్లు, 2 సిక్సులు) అద్భుత సెంచరీతో అజేయంగా నిలిచాడు. అతడికి తోడుగా అలెక్స్ కేరీ(52 నాటౌట్)హాఫ్ సెంచరీతో క్రీజులో ఉన్నాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌ను అజేయంగా 122 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

అంతకు ముందు 213/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ 286 పరుగులకు ఆలౌటైంది. బెన్‌స్టోక్స్ (83), జోఫ్రా ఆర్చర్ (51) హాఫ్ సెంచరీలు సాధించారు. ఆసీస్ బౌలర్లలో పాట్ కమిన్స్, స్కాట్ బోల్యాండ్ చెరో మూడు, నాథన్ లైయన్ 2, కామెరూన్ గ్రీన్, మిచెల్ స్టార్క్ తలో వికెట్ తీసుకున్నారు.

ఆస్ట్రేలియా బ్యాటర్లలో జేక్ వెదర్లాడ్ (1), లబుషేన్ (13), కామెరూన్ గ్రీన్ (7) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. ఉస్మాన్ ఖవాజా (40: 51 బంతుల్లో, 4 ఫోర్లు) రాణించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో డకౌట్‌గా వెనుదిరిగిన గ్రీన్, రెండో ఇన్నింగ్స్‌లోనూ తక్కువ స్కోరుకే పరిమితమయ్యాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ 2, బ్రైడన్ కార్స్, విల్ జాక్స్ తలో వికెట్ తీసుకున్నారు.

చైతన్య రథం సినిమా



# సనాతన ధర్మ ఆవశ్యకతను చాటింది



ప్రమోషన్స్‌లో భాగంగా 'అఖండ 2' చిత్ర బృందం వారణాసిని సందర్శించింది. నటుడు బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను తదితరులు కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం బాలకృష్ణ మీడియాతో మాట్లాడారు. 'అఖండ 2' సినిమా సనాతన హైందవ ధర్మ పరిరక్షణ ఆవశ్యకతను చాటిందన్నారు. ఇది కేవలం తెలుగు సినిమా కాదని, భారతీయులందరి చిత్రమని పేర్కొన్నారు. మంచి సినిమా కోసం చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ని కలిశామని, భక్తి, ధర్మం ప్రధానంగా సినిమాని రూపొందించినందుకు అభినందనలు తెలిపారని గుర్తుచేసుకున్నారు. బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన ఈ మూవీ ఈనెల 12న విడుదలైన సంగతి తెలిసిందే. ఇప్పటికే హైదరాబాద్‌లో సక్సెస్ ఈవెంట్ నిర్వహించిన టీమ్ ఇప్పుడు ఉత్తరాదిలో సినిమాని ప్రమోట్ చేస్తోంది.

# రవితేజ శైలిలో టీజర్..



రవితేజ హీరోగా దర్శకుడు కిశోర్ తిరుమల తెరకెక్కిస్తున్న చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లు. ప్రమోషన్స్‌లో భాగంగా టీజర్‌ను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. 'వదిన వాళ్ల చెల్లి అంటే నా వైఫేగా' అంటూ రవితేజ తనదైన శైలిలో కామెడీ పండించారు. వినోదభరితంగా ఓ సున్నితమైన అంశాన్ని ఈ సినిమాలో ప్రస్తావించనున్నట్టు టీజర్ తెలియజేస్తోంది. ఈ సినిమా 2026 జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# స్పెషల్ గ్లింప్స్‌తో 'ఎల్లమ్మ' అనౌన్స్‌మెంట్?



'బలగం'తో తొలి ప్రయత్నంలోనే ప్రశంసలు అందుకున్న దర్శకుడు వేణు యెల్దండి, ఇప్పుడు తన రెండో చిత్రం 'ఎల్లమ్మ'తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. ఇక ఈ సినిమాలో తొలుత నాని, నితిన్‌ల పేర్లు వినిపించినా, ఇప్పుడు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే, సినిమాను ఎప్పుడో ఓకే చేసినా, ఇంకా ఈ చిత్రానికి సంబంధించి ఎలాంటి అనౌన్స్‌మెంట్ రాలేదు. దీంతో ప్రేక్షకుల్లో ఈ సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. కాగా, సినిమాను అధికారికంగా ప్రకటించేందుకు ప్రత్యేక గ్లింప్స్ వీడియోను రూపొందిస్తున్నట్టు సమాచారం. డిఎస్పీ హీరోగా షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభంలో మొదలయ్యే అవకాశముంది. హీరోయిన్ విషయంలోనూ ఆసక్తి నెలకొంది. తొలుత పరిశీలనలో ఉన్న సాయిపల్లవి, కీర్తి సురేష్ పేర్లు ప్రస్తుతం లేవని టాక్. దిల్ రాజు నిర్మాణంలో రూపొందుతున్న ఎల్లమ్మ మూవీలో దేవిశ్రీ నటుడిగా ఎలా మెప్పిస్తాడన్న ఆసక్తి ప్రేక్షకుల్లో ఉంది. అధికారిక ప్రకటనతోపాటు తదుపరి అప్‌డేట్స్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# ఓటీటీకి ఇంట్రెస్టింగ్ రామ్‌కామ్



టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ నటుల్లో ప్రియదర్శి ఒకడు. తననుంచి రీసెంట్‌గానే రెండు సినిమాలు వచ్చాయి. మరి ఆ చిత్రాల్లో ఓ ఇంట్రెస్టింగ్ రొమాంటిక్ కామెడీ చిత్రం "ప్రేమంటే". టాలెంటెడ్ బ్యూటీ కయల్ ఆనంది హీరోయిన్‌గా దర్శకుడు నవనీత్ శ్రీరామ్ తెరకెక్కించిన సినిమా థియేటర్స్‌లో డీసెంట్ రెస్పాన్స్‌ని అందుకుంది. అయితే ఈ సినిమా ఫైనల్‌గా ఓటిటిలో స్ట్రీమింగ్‌కి వచ్చేసింది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకోగా అందులో ఈ సినిమా నేటినుంచి అందుబాటులోకి వచ్చింది. తెలుగు, సహా ఇతర ముఖ్య దక్షిణాది భాషల్లో ఈ సినిమా స్ట్రీమ్ అవుతుంది. అప్పుడు మిస్ అయ్యినవారు ఉంటే ఇప్పుడు చూడాలనుకుంటే ఇందులో చూడొచ్చు. ఇక ఈ సినిమాకి శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి నిర్మాణం వహించగా.. స్పిరిట్ మీడియా సమర్పణలో సినిమా వచ్చింది.

# నో న్యూ ఇయర్ బ్రేక్ అట



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'స్పిరిట్'. ప్రస్తుతం టాలీవుడ్‌లోనే అత్యంత చర్చనీయాంశమైన ప్రాజెక్ట్‌గా మారింది. హార్డ్ అండ్ బోల్డ్ యాక్షన్ చిత్రాలకు పేరుగాంచిన సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇక తాజా సమాచారం ప్రకారం 'స్పిరిట్' టీమ్‌కు న్యూ ఇయర్ బ్రేక్ ఉండదని తెలుస్తోంది. నవంబర్ 27న హైదరాబాద్‌లో ప్రారంభమైన షూటింగ్, జనవరి తొలివారం వరకు నిరంతరంగా కొనసాగనుంది. ముందుగా అనుకున్న న్యూ ఇయర్ సెలవులను పూర్తిగా రద్దు చేసినట్టు ఓ వర్గం వెల్లడించింది. షెడ్యూల్స్ కొంత వెనక్కి వెళ్లడంతో ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం. ప్రభాస్ 'బాహుబలి: ది ఎపిక్' ప్రమోషన్స్ కోసం జపాన్ వెళ్లడం వల్ల షూటింగ్ ఆలస్యం కావడంతో, ఆ గ్యాప్‌ను కవర్ చేసేందుకు సందీప్ వంగా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారట. ఈ చిత్రంలో త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్‌రాజ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. దక్షిణ కొరియా స్టార్ డాన్ లీ కూడా 'స్పిరిట్'లో భాగమవడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది.

# 'జన నాయగన్' కొత్త రికార్డు!

తమిళ స్టార్ హీరో విజయ్ నటిస్తున్న చివరి చిత్రం 'జన నాయగన్'. 2026 జనవరి 9న పొంగల్ కానుకగా భారీస్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. సినిమా విడుదల తర్వాత విజయ్ పూర్తిగా రాజకీయాలపై దృష్టి పెట్టనున్నారు. హెచ్ వినోద్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ డ్రామా, బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి ఆధారంగా తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. అయితే ఈ చిత్రానికి సంబంధించి యూకేలో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. తాజా సమాచారం ప్రకారం, జన నాయగన్ 24 గంటల్లోనే 12.7 వేలకుపైగా టికెట్లు అమ్ముడై, తమిళ సినీ చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డ్‌ను సృష్టించింది. విశేషమేమిటంటే, ఈ రికార్డు గతంలో విజయ్ నటించిన లియో పేరిట ఉండేది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన లియో 24 గంటల్లో 10 వేల టికెట్లు అమ్మగా, ఇప్పుడు జన నాయగన్ దానిని అధిగమించింది. ఈ బలమైన ఓపెనింగ్ ట్రెండ్, ప్రేక్షకులు విజయ్‌కు ఘనమైన వీడ్కోలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలను ఇస్తోంది. ఈ చిత్రంలో పూజాహెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా.. మమిత బైజు కీలక పాత్రలో కనిపించనుంది. బాబీ డియోల్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, ప్రకాశ్ రాజ్, ప్రియమణి, నరైన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.



# కొత్తలోక.. టెన్షన్ పడ్డాను



2025లో బాగా వినిపించిన సినిమా పేర్లలో 'కొత్తలోక: చాప్టర్1' ముందువరుసలో ఉంటుంది. భాషతో సంబంధం లేకుండా ఆదరణను సొంతం చేసుకొని అత్యధిక కలెక్షన్లతో సరికొత్త రికార్డులు సృష్టించింది. ఈ సినిమా విడుదలకు ముందు తానెంతో భయపడినట్టు ఇందులో ప్రధాన పాత్రలో నటించిన కల్యాణి తాజాగా ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. "నన్ను సూపర్ హీరోగా ప్రేక్షకులు అంగీకరిస్తారో, లేదోనని భయపడ్డాను. రివ్యూలు వచ్చే వరకూ భయంతో గదిలోనుంచి బయటకు కూడా రాలేదు. నేను కాదు.. మా చిత్ర బృందం మొత్తం అలానే టెన్షన్ పడ్డాం. మేం ఎంత భయపడ్డామో అంత పాజిటివ్ స్పందన వచ్చింది. రివ్యూలు చదవగానే మా ఆందోళన మొత్తం మాయమైంది. రెస్పాన్స్ ఎలా ఉన్నా.. విమర్శలు రాకుండా ఉంటే చాలని భావించాం. మధ్యాహ్నాం 3 తర్వాత అందరం గదిలోనుంచి బయటకు వచ్చి సంబరాలు చేసుకున్నాం" అని కల్యాణి ప్రియదర్శన్ గుర్తు చేసుకున్నారు. చిన్న చిత్రంగా విడుదలై రికార్డులు తిరగరాసింది 'కొత్తలోక: చాప్టర్ 1'. కేవలం మౌత్ టాక్‌తోనే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిందీ సినిమా. ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ రూ.300 కోట్లకు పైగా వసూలుచేసింది. అంతేకాదు, అత్యధిక వసూళ్లు రాబట్టిన తొలి మలయాళీ చిత్రంగానూ రికార్డు సృష్టించింది. ప్రస్తుతం ఈ చిత్రం 'జియో హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.